పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు సమూలంగా వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :25 | సంచిక :61 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శనివారం 11 జూలై 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


## ఆయిల్ పామ్ సాగు వైపు
# మొగ్గు చూపండి..
### రైతులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి....




**సిద్దిపేట జిల్లా, జులై 10:** ఆయిల్ పామ్ సాగు పెంచడానికి 5 ఎకరాలపైన ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు(శుక్రవారం) హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో మెగా పామ్ ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ డిమాండ్‌కి తగ్గ ఉత్పత్తి లేదని.. రైతులు ఆ సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. నర్మేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 50 వేల ఎకరాలు ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఇప్పుడు 14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఒక్కో చిన్న గ్రామంలో 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు దాటిస్తే రూ.5 లక్షలు, పెద్ద గ్రామాల్లో 200 ఎకరాలపైన సాగు ప్రోత్సహిస్తే రూ.10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహకాలు అందిస్తామని వెల్లడించారు. ఎల్‌నినో రాబోతోందని.. తీవ్ర కరవు కాటకాలు వర్షాభావ పరిస్థితులు ఉంటాయని మంత్రి తెలిపారు. దీంతో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని - మిగతా3లో

## కాంగ్రెస్ నేతలకు
# కంటి పరీక్షలు చేయించాలి

**: కేంద్ర మంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఎంఐఎం పార్టీని లక్ష్యంగా చేసుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటు విమర్శలు చేశారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీకి చెందిన ఫాతిమా మహిళా కళాశాల.. సకలం చెరువు పరిధిలో ఉందని బండి సంజయ్ మరోసారి ఆరోపించారు. ఇది ప్రపంచమంతా చూస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చూడనట్లు నటిస్తోందని ఆయన మండిపడ్డారు. పేదల ఇళ్లను హైడ్రా (న్ణ=ూూ) పేరుతో కూల్చివేస్తున్న ప్రభుత్వం.. అందరికీ కనిపిస్తున్న ఈ ఆక్రమణను మాత్రం ఎందుకు గుర్తించలేకపోతోందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా బండి సంజయ్ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులకు వెంటనే కంటి పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందంటూ బండి సంజయ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ నేతల కోసం రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆ పరీక్షల తర్వాత కూడా వారికి చెరువు పక్కన కళాశాల కనిపించకపోతే సమస్య కళ్లలో కాదు.. వారి రాజకీయాల్లోనే ఉందని అర్థం చేసుకోవాలన్నారు. మరోవైపు హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. కాంగ్రెస్ ఎక్కడ రాజకీయ రంగోలి వేయాలనుకుంటే అక్కడ ఫుల్ ట్యాంక్ లెవల్ గీతలు వారి మిత్రులకు అనుకూలంగా మారిపోతున్నాయంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికార పార్టీ తనకు - మిగతా3లో



## నాలుగు దశాబ్దాల తర్వాత
# సరికొత్త చరిత్ర..

**న్యూజిలాండ్‌లో అడుగుపెట్టిన ప్రధాని మోదీ!**

**ఆక్లాండ్ (న్యూజిలాండ్), జులై 10:** భారత విదేశాంగ విధానంలో మరో కీలక అధ్యాయం మొదలైంది. ఆస్ట్రేలియాలో అత్యంత విజయవంతమైన పర్యటనను ముగించుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఇవాళ (శుక్రవారం) న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరానికి చేరుకున్నారు. గత నాలుగు దశాబ్దాలలో ఒక భారత ప్రధాని న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఈ పర్యటనకు విచ్చేశారు. విమానాశ్రయానికి చేరుకున్న మోదీకి పీఎం లక్సన్ ఆత్మీయంగా కౌగిలించుకుని సాదర స్వాగతం పలికారు.

**ద్వైపాక్షిక బంధానికి సరికొత్త ఊపు**

ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల - మిగతా3లో

## హైదరాబాద్‌లో
# బోనాల సందడి..
### జులై 16 నుంచి ప్రారంభం....



**హైదరాబాద్, జులై 10:** భాగ్యనగరంలో బోనాల ఉత్సవాల సందడి మొదలు కానుంది. ఈనెల 16 నుంచి హైదరాబాద్ ఆషాఢ బోనాల ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనాన్ని సమర్పించనున్నారు. ఈరోజు(శుక్రవారం) ఆషాఢ బోనాల జాతర పోస్టర్, బ్రోచర్‌ను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బోనాలు తెలంగాణ గంగా-జమున తెహజీబ్‌కు ప్రతీక అని అన్నారు. హిందూ - ముస్లిం ఐక్యత దేశానికి ఆదర్శమని చెప్పుకొచ్చారు. గోల్కొండ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. జులై 16 నుంచి ఆగస్టు 13 వరకు బోనాల ఉత్సవాలు జరగనున్నాయని వెల్లడించారు. లక్షలాది మంది భక్తుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ట్రాఫిక్, పార్కింగ్, క్యూ లైన్లు, తాగునీరు, వైద్య సేవలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. పరిశుభ్రత, విద్యుత్, భద్రతలో రాజీ వద్దని ఆదేశాలు జారీ చేశారు. శివసత్తులకు బోనాల సమర్పణలో అన్ని శాఖలు సహకరించాలన్నారు. పోలీస్ కంట్రోల్ రూంతో భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. భక్తులు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు మంత్రి కొండా సురేఖ సూచించారు.

# వాటర్ వార్....




**హైదరాబాద్, జూలై 10:** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి గోదావరి ఉరకలెత్తుతోంది. అయితే, ఈసారి నదిలో ప్రవహిస్తున్న వరద నీటి కంటే, కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ సాగుతున్న రాజకీయ వేడే ఎక్కువగా కనిపిస్తోంది. గోదావరిలో నీరు పుష్కలంగా ఉన్న తరుణంలో మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంటే.. ఇప్పుడు గనుక పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్టు బ్యారేజీలే కుప్పకూలుతాయని అధికార కాంగ్రెస్ హెచ్చరిస్తోంది. ఈ ప్రచార యుద్ధం వెనుక అసలు నిజాలేంటి? సాంకేతిక నివేదికలు ఏం చెబుతున్నాయి?బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల ప్రధాన వాదన ప్రకారం.. కాళేశ్వరం ప్రాజెక్టులోని పంప్ హౌస్‌లు, బాహుబలి మోటార్లు అన్నీ సురక్షితంగా ఉన్నాయి. కేవలం కొన్ని బ్యారేజీల పిల్లర్లు మాత్రమే దెబ్బతిన్నాయి. వరద నీరు - మిగతా3లో


# కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసిన బీఆర్ఎస్ నేతల బృందం..




**ఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘాన్ని(ఈసీఐ) బీఆర్ఎస్ నేతల బృందం కలిసింది. ఇవాళ (శుక్రవారం) ఢిల్లీకి చేరుకున్న నేతలంతా సర్ ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణలో డబుల్, డూప్లికేట్ ఓట్ల తొలగింపు వంటి అంశాలను ఈసీఐ దృష్టికి తీసుకెళ్లారు. ఈసీఐని కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఓటర్ జాబితాలో ఉన్న డబుల్, డూప్లికేట్ ఓట్లను గుర్తించి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. అలాగే ఓటర్ గుర్తింపు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా నకిలీ, ద్వంద్వ ఓట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సూచించారు. అదే సమయంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపైనా పలు సూచనలు చేసినట్లు బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు. ఓటర్ జాబితాల ప్రక్షాళన పారదర్శకంగా, రాజకీయ పక్షపాతం లేకుండా జరగాలని ఈసీఐకి సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు అనవసరంగా తొలగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తెలంగాణలో ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరగాలంటే ఓటర్ జాబితా పూర్తిస్థాయిలో తప్పులు లేకుండా ఉండటం అత్యంత కీలకమని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లినట్లు బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.

## హరీశ్ కాంగ్రెస్‌లోకి
# వస్తానంటే చర్చిస్తాం

**మహేశ్ కుమార్**



**హైదరాబాద్, జులై 10:** మూడు నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి సమస్యను పరిష్కరించి చూపిస్తానంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పార్టీలో చర్చిస్తామన్నారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో చర్చించి హరీశ్‌ను చేర్చుకోవాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పదేండ్లు ఏం చేయని వారు మూడు నెలల సమయంలో ఏం చేస్తారని అన్నారు. గత ప్రభుత్వ అప్పులు, తప్పులను సరి చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

**కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలపై..**

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలపై మహేశ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమన్నారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తుంగతుర్తి సమస్య కూడా పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇరు వర్గాల వాదనలు వింటామన్నారు. పార్టీలో అందరూ సమానమే అని తేల్చిచెప్పారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉండడం వల్ల ఇద్దరు సీనియర్ నాయకులను సమస్య పరిష్కారం కోసం నియమించామని అన్నారు. సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడతామని అన్నప్పుడు.. పది మంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని చెప్పారు. నీళ్ల దోపిడీ జరిగినప్పుడు ఈటల మంత్రిగా ఉన్నారని మహేశ్ గుర్తుచేశారు.

## పూరి రథయాత్ర.. డ్రోన్లపై నిషేధం



**పూరి:** జన్నాథుడి రథయాత్ర కోసం పూరిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జూలై 16వ తేదీ నుంచి 27వ తేదీ వరకు రథయాత్ర జరగనున్నది. అయితే ఆ సమయంలో డ్రోన్లపై నిషేధం విధించారు. అయిదు కిలోమీటర్ల పరిధి వరకు నో ఫ్లయింగ్ జోన్ ప్రకటించారు. రథయాత్రను నిర్విఘ్నంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. అయితే అనుమతి ఉన్న ఏజెన్సీలు తమ డ్రోన్లను ఆపరేట్ చేసుకునే సౌకర్యం కల్పించారు. ఏరియల్ సర్వే, సెక్యూర్టీ ఆపరేషన్స్, ఏరియల్ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, మ్యాపింగ్, డాక్యుమెంటేషన్, డిజాస్టర్ రెస్పాన్స్ కోసం డ్రోన్లను వినియోగించనున్నారు. దీనికి జిల్లా యంత్రాంగం అనుమతి అవసరం ఉంటుంది.

## ఉచిత పథకాలకు
# కోర్టు బ్రేక్..



**హైదరాబాద్, జూలై 10:** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'కల్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలు ఇప్పుడు న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాయి. నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకాల చట్టబద్ధతపై తెలంగాణ హైకోర్టు తీవ్ర సందేహాలను, అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అసెంబ్లీ ఆమోదం లేకుండా, కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా వందల, వేల కోట్ల ప్రజాధనాన్ని ఏ విధంగా పంపిణీ చేస్తారని న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ నిలదీశారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు - మిగతా3లో


# సంపాదకీయం

## వయనాడ్‌కు ఈ పరిస్థితి ఎందుకు .?

కేరళలో ప్రకృతి ప్రకోపానికి శవాల దిబ్బగా మారిన ప్రాంతాల్లో.. అన్వేషణ, సహాయక చర్యలు యుద్ధప్రాతిపదినక కొనసాగు తున్నాయి. బురద, శిథిలాల నుంచి భారీగా మృతదేహాలు బయటపడుతున్నాయి.: వయనాడ్ పశ్చిమ కనుమల అత్యంత సున్నితమైన పర్యావరణ వ్యవస్థలో ఉంది. ఇక్కడి శిలలు ప్రీకాంబ్రియన్ యుగం నాటి గ్నైస్, స్కిస్ట్ రకానికి చెందినవి, ఇవి చాలా పెళుసుగా ఉంటాయి. ఈ శిలలలో సహజ పగుళ్లు ఉంటాయి, ఇవి వర్షపు నీరు పడ్డ తర్వాత బలహీనమవుతాయి. 2024 కొండచరియ విపత్తుకు ముందు 48 గంటల్లో, 572.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది, ఇది ఐఎండి అంచనా కంటే 200 శాతం ఎక్కువ. వయనాడ్‌లోని వైతిరి తాలూకాను పశ్చిమ కనుమల పర్యావరణవేత్తల ప్యానెల్ పర్యావరణ సున్నిత జోన్-1గా ప్రకటించినప్పటికీ, అభివృద్ధి పనులు ఆగకుండా కొనసాగాయి. హెచ్చరికలను పట్టించుకోలేదు: 2011లో, మాధవ్ గాడ్గిల్ కమిటీ పశ్చిమ కనుమలలోని సున్నితమైన ప్రాంతాల్లో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, మైనింగ్‌పై తాత్కాలిక నిషేధాన్ని సిఫార్సు చేసింది. కేరళ ప్రభుత్వం ఆ నివేదికను పక్కన పెట్టింది. 2024 కొండచరియ విపత్తుకు 16 గంటల ముందు హ్యూమ్ సెంటర్ ఫర్ ఎకాలజీ ఒక హెచ్చరిక జారీ చేసింది, కానీ అది అధికారిక వ్యవస్థలో భాగం కానందున జిల్లా యంత్రాంగం దానిని విస్మరించింది. కేంద్ర ప్రభుత్వం కూడా జూలై 23, 24, 25, 26 తేదీలలో భారీ వర్షాలు, కొండచరియ విపత్తుల గురించి హెచ్చరికలు జారీ చేసింది, కానీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని సీరియస్‌గా తీసుకోలేదు. అభివృద్ధి పరుగులో పర్యావరణ నిర్లక్ష్యం: గత కొన్నేళ్లుగా వయనాడ్‌లో రిసార్ట్‌లు, రోడ్లు, పర్యాటక సౌకర్యాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. చెట్ల స్థానంలో కాంక్రీట్ కట్టడాలు వచ్చాయి. వర్షపు నీటి తీసుకునే భూమి తగ్గిపోయింది, అస్థిరమైన వాలులపై ఒత్తిడి పెరిగింది. సెప్టెంబర్ 2025 నాటి నివేదిక ప్రకారం, "వయనాడ్ కొండచరియ విపత్తు ప్రకృతి చర్య కాదు, అది మానవుల నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఫల్యం ప్రత్యక్ష ఫలితం." అని తేలింది. శిథిలాల కింద ప్రాణాలతో ఉన్నవారికోసం..రెస్క్యూ బృందాలు గాలిస్తున్నాయి. మరోవైపు ఈ జల ప్రళయానికి.. మానవుడి అత్యాశ, ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమంటున్నారు..పర్యావరణ వేత్తలు. కేరళలో విరిగిపడుతున్న కొండచరియలు.. ఊళ్లకు ఊళ్లనే నాశనం చేశాయి. వాయనాడ్‌లో ఇటీవల సంభవించిన ఘటనలో 295 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా..అనేక మంది ఆ శిథిలాల కిందే చిక్కుకుపోయారు. కనీవినీ ఎరుగని ఈ విపత్తుకు సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ విడుదల చేసింది. అక్కడ సంభవించిన విలయాన్ని 3డీ రూపంలో చూపించింది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో దాదాపు 86వేల చదరపు మీటర్ల భూభాగం జారిపడిపోయినట్లు ఇస్రో అంచనా వేసింది. సముద్రమట్టానికి 1,550 మీటర్ల ఎత్తులో ఈ కొండచరియలు విరిగిపడిన ప్రదేశాన్ని గుర్తించింది. వాయనాడ్‌లో చోటుచేసుకున్న భారీ వినాశనాన్ని అంచనా వేసేందుకు..కార్టోశాట్-3 శాటిలైట్‌తో పాటు ఆ ప్రాంతంలో అంతరిక్షం నుంచి తీసిన 3డీ చిత్రాలను ఇస్రో విశ్లేషించింది. గతంలోనూ అదే ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన విషయాన్ని ఈ చిత్రాల్లో వివరించింది. కేరళలో గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు వాయనాడ్ ప్రాంతం మొత్తం తడిగా మారిపోయిందని నిపుణులు చెబుతున్నారు.వాయనాడ్ జిల్లాలో ప్రకృతి సృష్టించిన విపత్తు ఎన్నో కుటుంబాలను చిదిమేసింది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి గ్రామాలను నేలమట్టం చేసిన ఘటనలో..మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడటంతో మండక్కై, చూరాల్‌మల ప్రాంతాలు నామరూపాల్లేకుండా ధ్వంసమైపోయాయి. ముండక్కైలో 150 వరకు ఇళ్లు ఉండగా.. వాటిల్లో 65 పూర్తిస్థాయిలో నేలమట్టమయ్యాయి. శిథిలాలను తొలగిస్తే గానీ లోపల ఎంత మంది ఉన్నారనేది తెలియదని సహాయక బృందాలు చెబుతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. యుద్ధప్రాతిపదికన రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన భారత సైన్యం దాదాపు వెయ్యిమందికిపైగా స్థానికులను సురక్షితంగా కాపాడింది. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల నుంచి ప్రజలను రక్షించేందుకు సహాయక బృందాలు తాత్కాలిక వంతెనలను నిర్మించారు. రోడ్డు మార్గాలు ధ్వంసమై రాకపోకలకు వీలులేని ప్రాంతాల నుంచి వీటి ద్వారా ప్రజలను తరలిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఉపయోగించిన వీటిని.. బెయిలీ వంతెనలంటారు.వాయనాడ్‌లోని బాధిత ప్రాంతాల్లో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ పర్యటించారు. కొండచరియలు విరిగిపడ్డ చురాల్‌మాల ప్రాంతాన్ని పరిశీలించారు. సహాయక చర్యలపై ఆరాతీశారు. రాహుల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ ఎంపీ , నేతలు కూడా కొండచరియలు విరిగిపడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. బాధితులకు అండగా నిలవాలని ఈ సందర్భంగా కేరళ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు రాహుల్‌గాంధీ. కేంద్రం కూడా కేరళకు అండగా ఉండాలన్నారు. సహాయక శిబిరాల్లో ఉన్న వరదబాధితులను కూడా కలిశారు..రాహుల్ , ప్రియాంక. అటు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా వయనాడ్ వెళ్లి విపత్తు పరిస్థితిపై సమీక్షించారు.మరోవైపు మానవ చర్యల వల్లే కేరళలో తరచూ ఇలాంటి ప్రకృతి విపత్తులు జరుగుతున్నాయంటున్నారు..పర్యావరణ వేత్తలు. కేరళకు పశ్చిమాన అరేబియా సముద్రంతో పాటు తూర్పున విస్తారమైన పశ్చిమ కనుమలు.. విస్తరించి ఉన్నాయి. వీటిని ఆస్వాదించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. దాంతో ఎకో టూరిజం పేరుతో హోటళ్లు, రిసార్టుల నిర్మాణం భారీగా జరుగుతోంది. ఇందుకోసం అడవులను కూడా విచ్చలవిడిగా నరికేస్తున్నారు. పర్యావరణపరంగా అత్యంత సున్నిత ప్రాంతమైన పశ్చిమ కనుమలు ఈ పరిణామాలతో తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. 2017, 2018, 2019ల్లో వరుసగా తుఫాన్లు, వరదలు కేరళను ముంచెత్తాయి. ఇప్పుడు వాయనాడ్ విధ్వంసం..కోలుకోలేని దెబ్బతీసింది.కేరళలోని వాయనాడ్, ఇడుక్కి జిల్లాల్లో కొండ ప్రాంతాలపై ఇటీవల నిర్మాణాలు విపరీతంగా పెరిగిపోవడమే పెను సమస్యగా పరిణమించింది. వేసవిలో తీవ్రమైన ఎండలు, వర్షాకాలంలో మితిమీరిన వానలు పరిపాటిగా మారాయి. దాంతో కొండచరియలు విరిగిపడే ముప్పు నానాటికీ పెరుగుతోంది. బాగా ఎండిన నేలల్లో వాననీరు తక్కువగా ఇంకుతుంది. కొండల పైభాగంలో రాతి శిఖరాలను ఆవరించి ఉండే మట్టి పొరలు వదులుగా ఉంటాయి. భారీ వర్షాలకు తడిసి, వరద ఉధృతికి కొట్టుకుపోతాయి. తాజా విలయమే ఇందుకు ఉదాహరణ. గత ఏడేళ్లలో దేశవ్యాప్తంగా అత్యంత ఎక్కువ సంఖ్యలో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు నమోదైంది కేరళలోనే. దేశవ్యాప్తంగా 3 వేల 782 ఘటనలు జరిగితే..వాటిలో కేరళలోనే 2 వేల 239 ఘటనలు జరిగాయి. పర్యావరణ విధ్వంసంపై కేరళ ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే..వయనాడ్ ఘటనలు నిత్యకృత్యంగా మారుతాయని హెచ్చరిస్తున్నారు..పర్యావరణ వేత్తలు.

# న్యూ ఏజింగ్ టాప్ ప్రయారిటీ

**న్యూఢిల్లీ, జూలై 10:**వయసు పెరగడం మానవ జీవితంలో అనివార్యమైన భాగం. కానీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ప్రక్రియను మందగించి, ఆరోగ్యకరమైన జీవితకాలాన్ని పెంచడానికి భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. ఇందుకోసం సుమారు 26 బిలియన్ డాలర్లు (సుమారు 2 లక్షల కోట్ల రూపాయలు) ఖర్చు చేస్తూ ఒక జాతీయ శాస్త్రీయ కార్యక్రమాన్ని నడుపుతున్నారు. 2025లో బీజింగ్‌లో జరిగిన సైనిక కవాతు సందర్భంగా పుతిన్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో అవయవాల మార్పిడి ద్వారా మనుషులు యువతను నిలుపుకోవచ్చని, బహుశా అమరత్వం కూడా సాధ్యమవుతుందని చర్చించినట్లు హాట్ మైక్ రికార్డింగ్ ద్వారా బయటపడింది. ఈ చర్చ 2024లో అధికారికంగా ప్రారంభమైన 'న్యూ హెల్త్ ప్రిజర్వేషన్ టెక్నాలజీస్' ప్రాజెక్టుకు సంబంధించినదిగా విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యా ప్రభుత్వం దీనిని టాప్ ప్రయారిటీ శాస్త్రీయ కార్యక్రమంగా ప్రకటించిందిఈ కార్యక్రమం అనేక అధునాతన రంగాలపై దృష్టి పెట్టింది. కణాల వృద్ధాప్యాన్ని నెమ్మది చేసే చికిత్సల అభివృద్ధి. ఇది ప్రాజెక్టులో కీలక భాగం. కణజాలాలు, అవయవాలను 3డీ ప్రింటింగ్ ద్వారా తయారు చేయడం. ఇప్పటికే ఎలుకల థైరాయిడ్ గ్రంథి, మానవ కార్టిలేజ్ విజయవంతంగా ప్రింట్ చేశారు. 2030 నాటికి పూర్తి మానవ అవయవాలను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జన్యుపరంగా మార్చిన మినీ పందులలో మానవ అనుకూల



అవయవాలు పెంచి, మనుషులకు మార్పిడి చేయడం. ఇది అవయవాల కొరతను తగ్గించడానికి సహాయపడుతుంది. క్రయోథెరపీ ఇవి కణాలను రక్షించడానికి ఉపయోగపడతాయి. ఈ సాంకేతికతలు ప్రపంచవ్యాప్తంగా (ముఖ్యంగా సిలికాన్ వ్యాలీలో) జరుగుతున్న పరిశోధనలతో సమాంతరంగా ఉన్నాయి. రష్యా వాటిని రాష్ట్ర స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి ముందుకు తీసుకెళ్తోంది. ఈ ప్రాజెక్టును పుతిన్ కుమార్తె, ఎండోక్రైనాలజిస్ట్ మరియా వొరొంత్సోవాకు అప్పటించారు. ఆమె నేతృత్వంలోని జన్యు పరిశోధనలతో అనుసంధానించారు. ఆమె రాష్ట్ర జన్యు కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఇది వ్యక్తిగత ఆసక్తిని రాష్ట్ర విధానంగా మార్చడానికి సహాయపడింది. ఈ ప్రాజెక్టు ఆశావాదాన్ని కలిగిస్తుంది. జీన్ థెరపీ, రీజెనరేటివ్ మెడిసిన్ వంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అవయవాల మార్పిడి ద్వారా జీవితకాలం పొడిగించడం సాంకేతికంగా సాధ్యమవుతుంది, కానీ పూర్తి అమరత్వం ఇప్పటికీ శాస్త్రీయంగా దూరంలోనే ఉంది. అవయవాల తిరస్కరణ, జన్యు మార్పుల భద్రత, జంతు ప్రయోగాల నైతికత వంటి సవాళ్లు ఉన్నాయి. ఇలాంటి అధునాతన చికిత్సలు మొదట్లో సంపన్నులు లేదా శక్తివంతులకు మాత్రమే అందుబాటులోకి రావచ్చు. ఇది సామాజిక అసమానతలను పెంచవచ్చు. అలాగే, జంతువులను ఉపయోగించి అవయవాలు పెంచడం వల్ల నైతిక చర్చలు రావచ్చు. రష్యాలో ఆయుర్దాయం తగ్గుతున్న నేపథ్యంలో ఈ ప్రయత్నం సానుకూలం. అయితే, యుద్ధం నేపథ్యంలో ఈ భారీ నిధులు ఇతర సామాజిక--ఆర్థిక అవసరాలకు ఉపయోగపడాలని విమర్శలు వస్తున్నాయి. చైనాతో సహకారం సాధ్యమైతే బయోటెక్నాలజీ రంగంలో రష్యా--చైనా బలం పెరగవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి పోటీ పెరగడం వల్ల మానవాళికి మంచి చికిత్సలు వచ్చే అవకాశం ఉంది. ఈ అభివృద్ధులు శాస్త్రం ఎంతవరకు మానవ సామర్థ్యాలను విస్తరించగలదో చూపిస్తాయి. ఫలితాలు ఏమైనా, ఇవి మానవాళి ముందుకు సాగడానికి ఒక ముఖ్యమైన అధ్యాయం.

# పీఓకేలో ఆందోళనలు తీవ్రం

**న్యూఢిల్లీ, జూలై 10:**పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ కొన్ని రోజులుగా అట్టుడుకుతోంది. గత కొన్ని రోజులుగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. పాకిస్తాన్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రావల్కోట్ సహా పలు ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపడుతున్నారు. ధరల పెరుగుదల, విద్యుత్ కొరత, పరిపాలనా సమస్యలు, మౌలిక సదుపాయాల లోపం వంటి అంశాలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నెలకొన్న అసంతృప్తిని మరోసారి వెలుగులోకి తెచ్చాయి. స్థానిక వర్గాల ప్రకారం, నిరసనలను నియంత్రించేందుకు పాకిస్తాన్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆహారం, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరాపై ఆంక్షలు విధించారని కొందరు స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు నాయకులు అంతర్జాతీయ సమాజం దృష్టి ఈ అంశంపై పడాలని కోరుతున్నారు. రక్షణ విశ్లేషకుడు, రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ జె.ఎస్. సోధి మాట్లాడుతూ, పాకిస్తాన్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి చాలా కాలంగా ఉందని అభిప్రాయపడ్డారు. అయితే, ఆయన చేసిన రాజకీయ విశ్లేషణలు వ్యక్తిగత అభిప్రాయాలేనని



గమనించాలి. భవిష్యత్తులో అక్కడ మరింత పెద్ద ఉద్యమం చెలరేగే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. 2023లో ఏర్పాటైన జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు మొత్తం 38 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ఈ కమిటీలో రవాణా రంగ ప్రతినిధులు, దుకాణదారులు, చిన్న వ్యాపారులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తదితరులు ఉన్నారు. పెన్షన్ల చెల్లింపు, పిండి, విద్యుత్ ధరల తగ్గింపు, మెరుగైన ఆరోగ్య సేవలు, మీర్‌పూర్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం, విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆస్తుల బదిలీలపై పన్నుల తగ్గింపు వంటి అంశాలు ప్రధాన డిమాండ్లలో ఉన్నాయి. స్థానికులు, గత రెండేళ్లలో జరిగిన నిరసనల సందర్భంగా మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. అలాగే విద్యుత్ ఉత్పత్తిలో కీలక ప్రాంతంగా ఉన్నప్పటికీ, విద్యుత్ కొరత కొనసాగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, భారతదేశం అధికారికంగా మొత్తం జమ్మూ-కాశ్మీర్, లడఖ్‌తో పాటు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను కూడా భారత అంతర్భాగంగానే పరిగణిస్తోంది. అయితే ప్రస్తుతం పరిపాలన పాకిస్తాన్ ఆధీనంలో కొనసాగుతోంది. ఈ అంశం భారత్-పాకిస్తాన్ మధ్య దీర్ఘకాలిక వివాదంలో భాగంగా ఉంది. ప్రస్తుతం జరుగుతున్న నిరసనలు, ప్రజల డిమాండ్లు, అక్కడి పరిస్థితులు ప్రాంతీయ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారాయి. పరిస్థితిపై పలు వర్గాలు నిశితంగా గమనిస్తున్నాయి. అయితే అక్కడి పరిస్థితులపై వస్తున్న అనేక ఆరోపణలు, రాజకీయ వ్యాఖ్యానాలు స్వతంత్రంగా పూర్తిగా ధృవీకరించలేదు.

# అమ్ములపొదిలో పాశుపతాస్త్రం

**న్యూఢిల్లీ, జూలై 10:**భారత రక్షణ రంగం పాశుపతాస్త్రంను సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రపంచంలో అత్యంత శక్తి వంతంగా గుర్తింపు పొందిన ఇడియన్ ఆర్మీ చేతిలోకి ఇది రావడంతో మరింత బలం చేకూరినట్లయింది. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన 'పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ ను విజయవంతంగా పరీక్షించారు. దీంతో భారత సైన్యం దీర్ఘదూర దాడి సామర్థ్యం మరింత బలోపేతమైంది. అయితే ఇది ఎలా తయారైంది? దీని వల్ల సైన్యానికి ఎటువంటి ఉపయోగం?ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ లో 8, జూలై 2026న నిర్వహించిన ఈ పరీక్షలో రాకెట్ నిర్దేశించిన 60 కిలోమీటర్ల కనిష్ఠ దూరాన్ని అత్యంత కచ్చితత్వంతో చేరుకుని లక్ష్యాన్ని ఛేదించింది. పరీక్ష సందర్భంగా ప్రయోగించిన పినాకా ఎల్ఆర్‌జీఆర్ ముందుగా నిర్దేశించిన మార్గాన్నే అనుసరిస్తూ ఎలాంటి వ్యత్యాసం లేకుండా ప్రయాణించింది. చివరికి లక్ష్యాన్ని అత్యంత ఖచ్చితత్వంతో తాకింది. రాకెట్ గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థలు అద్భుతంగా పనిచేశాయని ఈ పరీక్ష మరోసారి నిరూపించింది.పినాకా ఎల్ఆర్‌జీఆర్‌ను డీఆర్‌డీవో ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. పూణెలోని ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ , హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ (లు ఈ రాకెట్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించాయి. అలాగే హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ , రీసెర్చ్ సెంటర్ ఇమారత్ గైడెన్స్, నావిగేషన్, నియంత్రణ వ్యవస్థలకు అత్యాధునిక సాంకేతిక సహకారం అందించాయి.పినాకా ఎల్ఆర్‌జీఆర్ సాధారణ రాకెట్ కాదు. ఇది లక్ష్యానికి చేరుకునేంతవరకు తన దిశను సరిచేసుకుంటూ ప్రయాణించే గైడెడ్ రాకెట్. అందువల్ల శత్రు కమాండ్ సెంటర్లు, బంకర్లు, వ్యూహాత్మక స్థావరాలు వంటి కీలక లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదు. తక్కువ సమయంలో భారీ అగ్నిశక్తిని ప్రదర్శించగల సామర్థ్యం దీనికి ప్రత్యేకత.ఈ విజయవంతమైన పరీక్షతో భారత సైన్యానికి అత్యాధునిక ఆయుధ వ్యవస్థ మరోటి అందుబాటులోకి రానుంది. సరిహద్దు భద్రత, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు, యుద్ధ పరిస్థితుల్లో వేగవంతమైన ప్రతిస్పందనకు ఈ రాకెట్ కీలకంగా ఉపయోగపడుతుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత భూసేన అగ్నిశక్తిని మరింత పెంచడంలో పినాకా కీలక పాత్ర పోషించనుంది. ఈ పరీక్ష స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యానికి మరో నిదర్శనంగా నిలిచింది. విదేశీ ఆయుధాలపై ఆధారపడకుండా అత్యాధునిక రాకెట్ వ్యవస్థలను దేశీయంగానే అభివృద్ధి చేయగల సామర్థ్యం భారత్‌కు ఉందని ఈ పరీక్ష మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. రక్షణ రంగంలో స్వావలంబన లక్ష్యానికి ఇది మరింత బలాన్ని చేకూర్చనుంది.పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ విజయవంతమైన పరీక్షతో భారత్ ఆధునిక రాకెట్ సాంకేతికతలో మరో కీలక అడుగు వేసింది. ఖచ్చితత్వం, దీర్ఘదూర దాడి సామర్థ్యం, స్వదేశీ అభివృద్ధి వంటి అంశాల్లో ఈ వ్యవస్థ భారత రక్షణ రంగానికి కొత్త బలాన్ని అందించనుంది. భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక ఆయుధ వ్యవస్థల అభివృద్ధికి ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని రక్షణ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## డిసెంబర్‌లో స్వదేశానికి వెళతాను..

# బంగ్లాదేశ్ మాజీ ప్రధాని హసీనా

**ఇంటర్నెట్ డెస్క్:** డిసెంబర్‌లో తాను స్వదేశానికి తిరిగెళ్లాలని అనుకుంటున్నట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, ఆవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా తాజాగా తెలిపారు. బంగ్లాదేశ్‌లో విద్యార్థుల తిరుగుబాటు అనంతరం షేక్ హసీనాతో పాటు పలువురు ఆవామీ లీగ్ నేతలు భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. హింసాత్మక నిరసనల నేపథ్యంలో ఆమె దేశాన్ని వీడాల్సి వచ్చింది. ఈ నిరసనల్లో సంభవించిన మరణాలకు షేక్ హసీనా బాధ్యురాలని నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రైబ్యునల్ తేల్చింది. ఆమెకు మరణ శిక్ష కూడా విధించింది. అప్పటి హోం మంత్రికి కూడా మరణ శిక్షను ఖరారు చేసింది.తాను మళ్లీ బంగ్లాదేశ్ వెళ్లాలనుకుంటున్నట్లు షేక్ హసీనా తాజాగా తెలిపారు. బహిష్కరణకు గురైన ఇతర ఆవామీ లీగ్ నేతలు కూడా స్వదేశానికి వెళతారని చెప్పారు. బంగ్లాదేశ్‌లో కోర్టు ముందు లొంగిపోతానని ఆమె చెప్పారు. అధికారులు తనను అరెస్టు చేయవచ్చని అన్నారు. తనను చంపే అవకాశం కూడా ఉందని చెప్పారు. అయినా వెళ్లక తప్పదని అన్నారు. ప్రస్తుతం ఆవామీ లీగ్‌పై బంగ్లాదేశ్‌లో నిషేధం ఉంది. స్వదేశానికి వెళ్లాక నిషేధాన్ని ఎత్తేయాలని డిమాండ్ చేయనున్నానని కూడా షేక్ హసీనా చెప్పారు.



బంగ్లాదేశ్ ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తుస్తోందని ఆరోపించారు. అక్కడ మళ్లీ ప్రజాస్వామ్య ప్రక్రియలను పునరుద్ధరించడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. అయితే, తిరిగెళ్లే విషయమై అక్కడి అధికారులతో ఇంకా ఎలాంటి సంప్రదింపులు మొదలు కాలేదని తెలిపారు.

# 16 జిల్లాల్లో వర్షాభావం..

## 65 లక్షల ఎకరాలకు గాను 4.22 లక్షల ఎకరాల్లోనే సాగు

**హైదరాబాద్, జూలై 10:**తెలంగాణలో రుతుపవనాల నిరాశతో వానాకాలం పంటల సాగు తీవ్రంగా మందగించింది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా.. వరి సాగు చేస్తున్న వారి సంఖ్య చాలా తగ్గిపోయింది. ఇప్పటి వరకు కేవలం 6.40 శాతం మాత్రమే అంటే 4.22 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేపట్టారు. రాష్ట్రంలోని మొత్తం సాగు విస్తీర్ణంలో ఇప్పటి వరకు కేవలం 41.79 శాతం మేరకే అన్ని రకాల పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ బుధవారం ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో తెలిపింది.తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం సీజన్ ప్రారంభమై దాదాపు 38 రోజులు గడుస్తున్నా.. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనగా.. మిగిలిన 17 జిల్లాల్లో కేవలం సాధారణ వర్షపాతమే నమోదైనట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ వానాకాలం సీజన్ సాగు పరిస్థితులపై వ్యవసాయశాఖ బుధవారం ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరి సాగు తీవ్రంగా మందగించగా.. ఇతర పంటల సాగు కూడా లక్ష్యానికి చాలా వెనుకబడి ఉన్నట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మొత్తం 65,95,645 ఎకరాల్లో వరి సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే వర్షాలు ముఖం చాటేయడంతో ఇప్పటి వరకు కేవలం 4,22,340 ఎకరాల్లో మాత్రమే (అంటే 6.40 శాతం) నాట్లు



పడ్డాయి. నీటి వనరులు సరిగ్గా లేకపోవడం, సకాలంలో రుతుపవనాలు ఊపందుకోకపోవడంతో అన్నదాతలు వరి నాట్లు వేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. వరితో పాటు రాష్ట్రంలో అన్ని రకాల పంటల అంటే పత్తి, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు వంటి సాగును పరిశీలిస్తే.. మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలుగా అంచనా వేశారు. కానీ నివేదిక ప్రకారం ఇప్పటి వరకు కేవలం 55,31,812 ఎకరాల్లో (41.79 శాతం) మాత్రమే విత్తనాలు నాటడం లేదా పంటలు వేయడం పూర్తయింది. అంటే సగానికి పైగా సాగు భూములు ఇంకా బీడుగానే ఉన్నాయి.వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం.. జూలై నెలలో సగటున 47.6 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా కేవలం 39.9 మి.మీ. మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 16 శాతం తక్కువ. అలాగే జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తంగా 177.9 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 154.9 మి.మీ. మాత్రమే కురిసింది. ఇది సీజన్ సగటు కంటే 13 శాతం లోటుగా రికార్డయింది.

**లోటు వర్షపాతం ఉన్న 16 జిల్లాలివే..!**

లోటు వర్షాపాతం ఉన్న 16 జిల్లాల్లో.. ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, జనగామ, వికారాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ ఉన్నాయి. అయితే వర్షాల కొరత కారణంగా జిల్లాల వారీగా సాగు విస్తీర్ణంలో భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, మహబూబాబాద్, ములుగు, మేడ్చల్, వనపర్తి, సూర్యాపేట జిల్లాల్లో పంటల సాగు 25 శాతం కూడా దాటలేదు. ఇక నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నారాయణపేట జిల్లాల్లో కొంతవరకు పరవాలేదనేలా 51 శాతం మేర సాగు పనులు జరిగాయి.వర్షాలు కొంత అనుకూలించిన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో గరిష్టంగా 75 శాతం విస్తీర్ణంలో సాగు చేపట్టారు. రాబోయే రోజుల్లో అయినా భారీ వర్షాలు కురిస్తేనే వరి నాట్లు ఊపందుకునే అవకాశం ఉందని.. లేనిపక్షంలో సాగు విస్తీర్ణం మరింత తగ్గి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆదాయంలో శేరిలింగంపల్లి టాప్.....

**హైదరాబాద్, జూలై 10:**తెలంగాణను 'ఎగువ మధ్య-ఆదాయ'ఆర్థిక వ్యవస్థగా ప్రపంచ బ్యాంక్ గుర్తించడం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనిక నాయకత్వానికి, పరిపాలనా దక్షతకు దక్కిన అంతర్జాతీయ స్థాయి గుర్తింపు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తాజా గుర్తింపును ప్రస్తావిస్తూ.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 5,407 అమెరికన్ డాలర్ల తలసరి ఆదాయంతో తెలంగాణ.. ప్రపంచ బ్యాంక్ ఎగువ మధ్య-ఆదాయ కేటగిరీలో చేరిందని, ఈ మైలురాయిని సాధించిన ఐదు భారతీయ రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో తెలంగాణ సాధించిన అసాధారణ ఆర్థిక పరివర్తనకు ఈ విశేష విజయమే అద్దం పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు.తెలంగాణ ఆర్థిక పరివర్తనను ప్రపంచ బ్యాంకు సైతం ధృవీకరించడం కేవలం ఒక గణాంక విజయం మాత్రమే కాదని, కేసీఆర్ దార్శనికత, నిబద్ధత, పాలనా నమూనాకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.రాష్ట్ర ఆవిర్భావానికి ముందు దశాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ, కేవలం పదేళ్ల వ్యవధిలోనే తన ఆర్థిక తలరాతను తిరగరాసుకుని భారతదేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, సంపన్న రాష్ట్రాల్లో ఒకటిగా అవతరించిందని కేటీఆర్ గుర్తు చేశారు.పారిశ్రామికంగా, ఆర్థికంగా సుదీర్ఘకాలం పాటు అనుకూలతలు ఉన్న ఇతర



రాష్ట్రాల వలె కాకుండా, దార్శనిక నాయకత్వం, సాహసోపేతమైన సంస్కరణలు, వినూత్న పాలన ద్వారానే తెలంగాణ ఈ మైలురాయిని చేరుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.'పారిశ్రామిక అనుమతుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి అపూర్వమైన పెట్టుబడులను ఆకర్షించిన టీఎస్-ఐపాస్ తో పాటు, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి ప్రతిష్ఠాత్మక పథకాలు రాష్ట్రవ్యాప్తంగా సమ్మిళిత వృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి, పారిశ్రామిక విస్తరణకు, మెరుగైన ఉపాధికి బలమైన పునాది వేశాయి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరించారు. యథాతథ స్థితిని సవాల్ చేయడానికి ఒక సంస్కర్త, అపూర్వమైన ఫలితాలను అందించడానికి ఒక కార్యదక్షుడు, ఒక రాష్ట్ర తలరాతను పూర్తిగా మార్చివేయడానికి ఒక నిజమైన మార్గదర్శి అవసరమని, ఈ లక్షణాలే కేసీఆర్ పాలనను నిర్వచిస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు.తెలంగాణ అభివృద్ధి నమూనా ప్రపంచస్థాయి విశ్వసనీయతను సంపాదించుకుంది అనడానికి ప్రపంచ బ్యాంకు గుర్తింపే మరో నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉద్ఘాటించారు.ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి తెలంగాణను దివాలా తీసిన రాష్ట్రంగా చిత్రించడాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే మానుకోవాలని కేటీఆర్ హితవు పలికారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందంటూ పదేపదే తప్పుడు చిత్రాన్ని చూపేందుకు చేస్తున్న ప్రయత్నాలు, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఆర్థిక సూచీల సాక్షిగా పూర్తిగా బట్టబయలు అయ్యాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో సృష్టించబడిన బలమైన ఆర్థిక పునాదిపై నిర్మితమైన రాష్ట్రం తెలంగాణ అని ప్రపంచ బ్యాంక్ గుర్తింపు మరోసారి నిరూపించిందని కేటీఆర్ నొక్కిచెప్పారు. దార్శనికత, పనితీరుతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన ప్రభుత్వానికి, తప్పుడు ప్రచారాలతో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తున్న ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసం తెలంగాణ ప్రజలకు పూర్తి స్థాయిలో తెలుసునని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.

## తెలుగు వర్సిటీలో గిరిజన మ్యూజియం రగడ : కొనసాగుతున్న విద్యార్థుల నిరసన

హైదరాబాద్ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకుల నిరసనలు కొనసాగుతున్నాయి. వర్సిటీ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌ను 'ఆది ధ్వని' ట్రస్ట్‌కు గిరిజన కళల మ్యూజియం, పరిశోధన కేంద్రం ఏర్పాటు నిమిత్తం కేటాయించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ చేపట్టిన ఆందోళనలు శుక్రవారం నాటికి పదో రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వ నిర్ణయం కారణంగా ప్రస్తుతం కింది అంతస్తులో విద్యాభ్యాసం చేస్తున్న సుమారు 650 మంది విద్యార్థుల తరగతులకు తీవ్ర అంతరాయం కలుగుతుందని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము గిరిజన సంస్కృతి పరిరక్షణకు వ్యతిరేకం కాదని, అయితే ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయం అవసరాలను పక్కనబెట్టి ప్రైవేట్ ట్రస్ట్‌కు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని వారు స్పష్టం చేశారు. "ప్రస్తుతం 650 మంది విద్యార్థులు చదువుకుంటున్న తరగతి గదులనే ఖాళీ చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది" అని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.ఏ. శ్రీనివాసన్ పేర్కొన్నారు. బాచుపల్లిలో నూతన ప్రాంగణం ప్రారంభమైనప్పటికీ, అక్కడ ఆడిటోరియం, సెమినార్ హాళ్లు వంటి కీలక వసతులు లేకపోవడంతో నాంపల్లి ప్రాంగణంలోనే పలు విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివాదాస్పదంగా మారిన కింది అంతస్తులో తరగతి గదులతో పాటు, వైస్-ఛాన్సలర్ కార్యాలయం, ఆడిటోరియం, చిత్రవాణి స్టూడియో కూడా ఉన్నాయి.

# వాటర్ వార్....

- మొదటి పేజీ తరువాయి

వృధాగా సముద్రం పాలు కాకుండా, పంపింగ్ సిస్టమ్‌ను తక్షణమే ఉపయోగించి మిడ్ మానేరు, లోయర్ మానేరు వంటి ప్రధాన రిజర్వాయర్లను నింపాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే భయంతో, కావాలనే పొలిటికల్ మైలేజ్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఒక వ్యర్థ కట్టడంగా చిత్రించేందుకు కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నాయి.బీఆర్ఎస్ ఆరోపణలను కాంగ్రెస్ ప్రభుత్వం సాంకేతిక ఆధారాలతో తిప్పికొడుతోంది. పంప్ హౌస్‌లు బాగున్నాయన్నది నిజమే కావొచ్చు, కానీ వాటికి నీటిని అందించాల్సిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పునాదులు కదిలిపోయాయన్నది నగ్న సత్యమని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. దీనికి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన గైడ్‌లైన్స్, మధ్యంతర నివేదికలను చూపిస్తోంది.గత ఏడాది మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం బ్యారేజీలో ఊటలు రావడం వంటి తీవ్రమైన ఘటనల తర్వాత ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ రంగంలోకి దిగింది. పూర్తిస్థాయిలో మరమ్మతులు జరగకుండా, పునాదుల కింద గ్రౌటింగ్ పూర్తికాకుండా బ్యారేజీలలో నీటిని నిల్వ ఉంచడం అత్యంత ప్రమాదకరమని ఆ కమిటీ స్పష్టం చేసింది. ఒకవేళ బలవంతంగా నీటిని నిల్వ ఉంచితే ఏర్పడే 'హైడ్రోస్టాటిక్ ప్రెజర్' కారణంగా మిగిలిన పిల్లర్లు కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. బ్యారేజీలో నీరు నిలిస్తేనే పంపుల ద్వారా ఎత్తిపోయడం సాధ్యమవుతుంది. కాబట్టి, పునాదులే కదిలిన చోట నీటిని నిల్వ చేసి, పంపింగ్ చేయాలని చూడడం ఆత్మహత్యాసదృశ్యమేనని అధికార పక్షం వాదిస్తోంది. ఈ ప్రచార యుద్ధానికి తెరదించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షానికి ఒక బహిరంగ సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ లోపాలు, అడ్డగోలు ఖర్చులు, ప్రస్తుత దుస్థితిపై అసెంబ్లీ వేదికగా సుదీర్ఘమైన లైవ్ చర్చకు రావాలని సవాల్ చేశారు. జ్యుడీషియల్ ఎంక్వైరీ వివరాలు, సాంకేతిక తప్పిదాలను ప్రజల ముందు ఉంచి.. రీ-డిజైనింగ్ పేరిట జరిగిన వేల కోట్ల రూపాయల వ్యయం వెనుక ఉన్న అసలు నిజాలను నిరూపించాలని కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది.ఈ సవాల్‌పై హరీష్ రావు సానుకూలంగానే స్పందించినప్పటికీ, గతంలో కాళేశ్వరంపై జరిగిన లఘు చర్చలకు గులాబీ బాస్ కేసీఆర్ హాజరుకాలేదు. ఒకవేళ ఈసారి అసెంబ్లీలో గనుక పూర్తిస్థాయి పోరు జరిగితే, అది ఉభయ పార్టీలకు ప్రతిష్టాత్మకమైన 'చావో రేవో' లాంటి పరిస్థితిగా మారుతుంది. తాము నిర్మించిన ప్రాజెక్టును కాంగ్రెస్ చేతకానితనంతోనే వదిలేసిందని నిరూపించాలని బీఆర్ఎస్.. లేదు ఇది కేవలం 'కమీషన్ల స్కామ్' మాత్రమేనని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ భావిస్తున్నాయి.సోషల్ మీడియా వేదికగా సాగే ట్వీట్లు, కౌంటర్ ట్వీట్ల పొలిటికల్ డ్రామా వల్ల తెలంగాణ రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు. అసెంబ్లీ సాక్షిగా, నిపుణుల సమక్షంలో పారదర్శకమైన చర్చ జరిగి, ఎన్డీఎస్ఏ నివేదికలోని సాంకేతిక అంశాలు ప్రజల ముందుకు వచ్చినప్పుడే.. వేల కోట్లతో నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు భవిష్యత్తుపై ఒక స్పష్టత వస్తుంది.

## ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపండి..

- మొదటి పేజీ తరువాయి

సూచించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా కోతుల బెడద ఉండదని.. వాతావరణ మార్పుల ఇబ్బంది ఉండదని చెప్పుకొచ్చారు. రాజకీయాలకు అతీతంగా రైతాంగం గురించి ఆలోచించే వారు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

**దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరం: వివేక్**

దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరమని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. ఇరాన్ యుద్ధం వల్ల ధరలు పెరుగుతున్నాయని.. ఆయిల్ పామ్ దిగుమతి చేసుకుంటే ఇబ్బందులు తప్పవని.. అందుకోసం సొంతంగా ఉత్పత్తి పెంచాలని కోరారు. గత సంవత్సరం కాళేశ్వరం ప్రాజెక్ట్ లేనప్పటికీ 25 శాతం అదనంగా వడ్లు కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ఆయిల్ పామ్‌కు పెద్దగా నీళ్లు అవసరం లేదన్నారు. చెన్నూరులో కూడా ఆయిల్ పామ్ సాగు వైపు చూస్తున్నారన్నారు '100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసిన గ్రామాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 లక్షలు ప్రోత్సాహకం ఇస్తే.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నేను కూడా రూ.5 లక్షలు ఇస్తాను' అని మంత్రి వివేక్ ప్రకటించారు.

## కాంగ్రెస్ నేతలకు కంటి పరీక్షలు చేయించాలి

- మొదటి పేజీ తరువాయి

అనుకూలంగా వ్యవస్థలను వినియోగిస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కాగా, సకలం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఓవైసీ కాలేజీ ఉందనే అంశంపై ఇటీవల రాజకీయంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా బండి సంజయ్ చేసిన పోస్టు.. తెలంగాణ రాజకీయాల్లో మరోసారి దుమారం రేపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## నాలుగు దశాబ్దాల తర్వాత సరికొత్త చరిత్ర..

- మొదటి పేజీ తరువాయి

ప్రధానులు ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. గత రెండేళ్లుగా భారత్-న్యూజిలాండ్ మధ్య వాణిజ్యం, రక్షణ రంగాలలో అద్భుతమైన ప్రగతి కనిపిస్తోంది. ముఖ్యంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో కుదిరిన 'సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ఊపునిస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

**పర్యటనలోని ప్రధానాంశాలు:**

వ్యాపార, క్రీడా ప్రముఖులతో భేటీ: ఆక్లాండ్‌లో ఉన్న ప్రముఖ వ్యాపారవేత్తలు, క్రీడా రంగ ప్రముఖులతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

ప్రవాస భారతీయులతో ముఖాముఖి: భారత్-న్యూజిలాండ్ దేశాల మధ్య ఉన్న బలమైన ప్రజా సంబంధాలకు ప్రతీకగా, అక్కడ పెద్ద ఎత్తున స్థిరపడిన భారతీయ సమాజాన్ని ఉద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు.అంతకుముందు 2025, మార్చి 17న న్యూజిలాండ్ పీఎం క్రిస్టోఫర్ లక్సన్ భారతదేశంలో పర్యటించినప్పుడు, న్యూఢిల్లీలో ఇరువురు నేతలు ద్వైపాక్షిక సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. కాగా, న్యూజిలాండ్ పర్యటనకు ముందు మూడు రోజులపాటు ఆస్ట్రేలియాలో పర్యటించిన భారత ప్రధాని తన ఆస్ట్రేలియా పర్యటన అత్యంత ఫలప్రదమైందని పేర్కొన్నారు.

## ఉచిత పథకాలకు కోర్టు బ్రేక్..

- మొదటి పేజీ తరువాయి

చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు.న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ ఆధారంగా ఈ విచారణ సాగింది. చట్టసభ ఆమోదం లేకుండా కేవలం 8 జీవోల ఆధారంగా ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు మళ్లించడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ కోర్టుకు నివేదించారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 245, 246ల ఉల్లంఘన కిందికే వస్తుందని వాదించారు. చట్టపరమైన నిబంధనలు, శాసనసభ పర్యవేక్షణ లేకుండా ఇంత పెద్ద ఎత్తున నిధులను కేటాయించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ, ఈ పథకాలకు సంబంధించిన జీవోలను రద్దు చేయాలని కోరారు.ఈ పిటిషన్ విచారణ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ప్రాధాన్యతలపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఒకవైపు రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని, నిధుల సమీకరణ కోసం ప్రభుత్వ భూములను విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని కోర్టు గుర్తు చేసింది. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సకాలంలో అందడం లేదని, కాంట్రాక్టర్ల బిల్లులు, భూసేకరణకు సంబంధించిన పరిహారాలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని న్యాయస్థానం ఎత్తిచూపింది.రాష్ట్రం అప్పుల్లో ఉండి, కనీస చెల్లింపులు చేయలేని పరిస్థితుల్లో ఈ ఉచిత పథకాలను ఎవరు అడిగారు?" అని కోర్టు ఘాటుగా ప్రశ్నించింది. ప్రభుత్వం వద్ద అదనపు నిధులు, మిగులు బడ్జెట్ ఉంటే సంక్షేమ పథకాలు లేదా ఉచితాలు ఇవ్వడంలో తప్పు లేదని, కానీ ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో చెల్లింపుల విషయంలో ప్రభుత్వానికి సరైన ప్రాధాన్యత ఉండాలని కోర్టు హితవు పలికింది. 2014లో ప్రారంభమైన ఈ పథకాల కింద ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 13,484 కోట్లు ఖర్చు చేసినట్లు పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఇంత భారీ మొత్తాన్ని వెచ్చిస్తున్నప్పటికీ, పర్యవేక్షణ లోపం వల్ల అనర్హుల చేతుల్లోకి నిధులు వెళుతున్నాయని ఆరోపించారు. కాగ్ నివేదికల ప్రకారం.. సుమారు రూ. 90 కోట్లు అనర్హుల పాలయ్యాయని కోర్టుకు సమర్పించిన నివేదికల్లో పేర్కొన్నారు.అయితే, ప్రభుత్వ తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ ఈ వాదనలను తోసిపుచ్చారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచే సామాజిక బాధ్యతతోనే ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరంగానే ఉందని, పేదల సంక్షేమాన్ని విస్మరించలేమని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు, ఈ పథకాలపై తక్షణ స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. అయితే, దీనిపై సమగ్ర వివరణ ఇవ్వడానికి ప్రభుత్వానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది.ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు ఉచిత పథకాలను ఎరగా వేస్తున్నాయనే విమర్శలు వ్యూహాత్మకంగా వినిపిస్తున్న తరుణంలో, హైకోర్టు ఈ అంశాన్ని చట్టబద్ధత కోణంలో ప్రశ్నించడం అత్యంత ప్రాధాన్యతను సంతరింపజేసుకుంది. మరి ప్రభుత్వం చట్టసభ ఆమోదం అంశంపై న్యాయస్థానానికి ఎలాంటి వివరణ ఇస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## నార్సింగిలో సోలార్ సైక్లింగ్ ట్రాక్ కొంతమేర తొలగింపు!

**నార్సింగి వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఈ చర్య చేపట్టినట్లు వెల్లడి**

**ప్రపంచ స్థాయి వసతులను దెబ్బతీయడమేనని సైక్లిస్టుల ఆవేదన**

**ట్రాక్ పూర్తిగా అందుబాటులోనే ఉందని చెబుతున్న హెచ్ఎండీఏ**

**వాహనాలకు ప్రాధాన్యత ఇస్తూ సైక్లింగ్ ట్రాక్‌లను పాడుచేస్తున్నారని విమర్శలు**

హైదరాబాద్ నగరానికే తలమానికంగా నిలిచిన సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్‌లో కొంత భాగాన్ని అధికారులు తొలగించారు. నార్సింగి మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఈ ట్రాక్‌లోని సుమారు 34 మీటర్ల మేర భాగాన్ని తొలగించినట్లు సమాచారం. వాహనదారుల సౌకర్యార్థం ఇక్కడ నూతనంగా యూ-టర్న్ ఏర్పాటు చేసే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, అధికారుల చర్యపై సైక్లిస్టులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి దాదాపు రూ. 93 కోట్ల భారీ వ్యయంతో 23 కిలోమీటర్ల మేర ఈ ట్రాక్‌ను నిర్మించారు. ట్రాఫిక్ పోలీసుల సిఫార్సుల మేరకే ఈ మార్పులు చేపట్టినట్లు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) స్పష్టం చేశాయి. ప్రస్తుతం సైక్లిస్టులు ఆ ప్రాంతంలో అట్-గ్రేడ్ క్రాసింగ్ ద్వారా ప్రయాణించవచ్చని, దీనివల్ల ట్రాక్ వినియోగానికి ఎలాంటి ఆటంకం కలగదని అధికారులు వివరణ ఇచ్చారు. కాగా, అధికారుల నిర్ణయంపై సైక్లిస్టుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్ సైకిల్ మేయర్‌గా గుర్తింపు పొందిన ఎస్. సెల్వన్ ఈ చర్యను తీవ్రంగా తప్పుపట్టారు. "ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను క్రమంగా నాశనం చేస్తున్నారు.

వార్తాతరంగాలు
శనివారం 11 జూలై 2026

# కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు: ఈటల

**నాకు తెలంగాణే మొదటి ప్రాధాన్యం.. ఆ తర్వాతే పార్టీ అన్న ఈటల**

**ప్రభుత్వం వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్**

**కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని తప్పుబట్టడం దుర్మార్గమని కాంగ్రెస్‌పై విమర్శలు**

**కాళేశ్వరం వల్లే ఉత్తర తెలంగాణలో రెండు పంటలు సాధ్యమయ్యాయని వ్యాఖ్య**

**ప్రాజెక్టుల మరమ్మతుల్లో జాప్యం చేస్తే తీవ్ర కరవు వస్తుందని ప్రభుత్వానికి హెచ్చరిక**



ప్రజల ప్రయోజనాల విషయంలో తనకు తెలంగాణే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత అంశాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను ఎవరో చెప్పినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సాగునీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి నీరు వస్తున్నప్పటికీ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఈటల ఆరోపించారు. వర్షాకాలంలోనూ సాగునీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారని, ముఖ్యంగా ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద బోర్లు, బావులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యం కాదని చెప్పారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోసమే జరిగిందని ఈటల గుర్తుచేశారు. రాజకీయాలు, సిద్ధాంతాలు వేరైనా మూలాలను మరచిపోవద్దన్నారు. కాళేశ్వరం కంటే ముందే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా ప్రాణహిత జలాలను తీసుకురావాలనే ప్రణాళిక రూపొందిందని, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టులకు అప్పుడే శ్రీకారం చుట్టారని వివరించారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టును అభివృద్ధి చేసి ఎల్లంపల్లికి నీటిని తరలించే వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్న 29 టీఎంసీల నీరు కూడా ఆ ప్రాజెక్టుల ద్వారానే వచ్చిందన్నారు. కాళేశ్వరం వల్లే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రెండు పంటలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, డిజైన్ మార్పులపై తాను మాట్లాడడం లేదని, కానీ మొత్తం ప్రాజెక్టునే తప్పుపట్టడం సరికాదని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రాజెక్టు పరిధిలోని దెబ్బతిన్న నిర్మాణాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే రాష్ట్రం తీవ్ర కరవును ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# కవితకు టీవీల్లో కనిపించాలనే పిచ్చి: గండ్ర వెంకటరమణా రెడ్డి

**కవిత తీవ్ర నిరాశ, నిస్పృహలతో రాజకీయాలు చేస్తున్నారన్న గండ్ర**

**యువత, ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోవడానికి కాంగ్రెసే కారణమని వ్యాఖ్య**




కాంగ్రెస్ ను వదిలేసి కవిత బీఆర్ఎస్ పార్టీని మాత్రమే ఎందుకు టార్గెట్ చేస్తోందని మండిపాటు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కవిత తీవ్ర నిరాశ, నిస్పృహలతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం టీవీల్లో, మీడియాలో కనిపించాలనే పిచ్చితోనే ఆమె ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఎంతో మంది యువకులు, ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోవడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని గండ్ర గుర్తుచేశారు. నాడు, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను ప్రశ్నించకుండా కవిత కేవలం బీఆర్ఎస్ పార్టీని మాత్రమే టార్గెట్ చేయడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని నిలదీశారు. అమరుల కుటుంబాలకు కాంగ్రెస్ సర్కార్ నుంచి న్యాయం జరగాలని ఆమె ఎందుకు గళం విప్పడం లేదని ఆక్షేపించారు. కాంగ్రెస్ వైఫల్యాలను వదిలేసి, బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు గుప్పించడం చూస్తుంటే కాంగ్రెస్, తెలంగాణ రక్షణ సేనల మధ్య ఏదో రహస్య మిత్రత్వం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయని గండ్ర సంచలన ఆరోపణలు చేశారు. అధికార పార్టీతో లోపాయకారి ఒప్పందం కుదుర్చుకుని కవిత ఇలా ఏకపక్షంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

# జనగామ గ్రామంలో మెగా ఫామ్ ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమం

**ఆయిల్ పామ్ మొక్కలు నాటిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి**



హుస్నాబాద్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో అక్కన్నపేట మండలం లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆయిల్ ఫామ్ మొక్కలు నాటారు. . ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివయ్య, ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు. యిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతు సంపత్ ను అభినందించి సత్కరించిన మంత్రులు మంత్రి పొన్నం ప్రభాకర్.జనగామ లో ఆయిల్ ఫామ్ సాగు కోసం మొక్కలు నాటినందున మీకు అభినందనలు తన 8 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటుతున్న రైతు సంపత్ కి అభినందనలు.ఆయిల్ ఫామ్ సాగు పెంచడానికి 5 ఎకరాల పైన ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేశాం ఆయిల్ ఫామ్ డిమాండ్ కి తగ్గ ఉత్పత్తి లేదు. రైతులు ఆయిల్ ఫామ్ సాగు వైపు మొగ్గు చూపాలి.మనకు కూత వేటు దూరంలో నర్మేట లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. హుస్నాబాద్ ప్రాంత రైతాంగానికి విజ్ఞప్తి అన్ని గ్రామాల సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు అధికారులు ఆయిల్ ఫామ్ సాగు వైపు మొగ్గు చూపాలి జిల్లాలో 50 వేల ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం ఇప్పుడు 14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతుంది.ఒక్కో చిన్న గ్రామంలో 100 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు దాటిస్తే 5 లక్షలు,పెద్ద గ్రామాల్లో 200 ఎకరాల పైన సాగు ప్రోత్సహిస్తే 10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహకాలు అందిస్తాం.ఎల్ నినో రాబోతుంది తీవ్ర కరువు కాటకాలు వర్షాభావ పరిస్థితులు ఉంటాయి రైతులు ఆరుతడి పంటలు వేసుకోవచ్చు. 5 ఎకరాలు ఉన్న రైతు 3 ఎకరాలు,10 ఎకరాలు ఉన్న రైతు 7 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు చేయాలి దీని ద్వారా కోతుల బెడద ఉండదు.

# వడివడిగా మూసి ప్రక్షాళన అడుగులు



**హైదరాబాద్, జూలై 10:** హైదరాబాద్ రూపురేఖలను మార్చే ప్రతిష్టాత్మక మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టు తొలి విడత పనుల కోసం రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులలో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి రూ.4,500 కోట్ల రుణం తీసుకోనుండగా.. మిగిలిన రూ.2,845.12 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే గ్రాంట్ రూపంలో భరించనుంది. ఈ బడ్జెట్‌లో భూసేకరణ ఖర్చులను మినహాయించారు. ఈ పనులను ఈపీసీ విధానంలో చేపట్టనున్నారు.హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరాల సరసన నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ మెగా ప్రాజెక్టు పరిధిలోని ప్రాధాన్యతా ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ రూ.7,345.12 కోట్ల భారీ బడ్జెట్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సుదీర్ఘ కాలంగా ప్రతిపాదనల దశలో ఉన్న మూసీ సుందరీకరణ, పునరుజ్జీవన పనులు త్వరలోనే క్షేత్రస్థాయిలో వేగవంతం కానున్నాయి. అయితే, ఈ కేటాయించిన నిధులలో కేవలం అభివృద్ధి పనుల వ్యయం మాత్రమే ఉందని భూసేకరణ ఖర్చులను ఇందులో చేర్చలేదని అధికారులు స్పష్టం చేశారు. భూసేకరణకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడిగా కేటాయించనుంది.ఈ భారీ ప్రాజెక్టు మొదటి విడతలో భాగంగా జోన్-1ఏ, జోన్-1డీ పరిధిలోని ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. జోన్-1ఏ కింద హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న నదీ తీరాన్ని, అలాగే జోన్-1డీ కింద ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న పరివాహక ప్రాంతాలను అనుసంధానిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. నదిలోకి మురుగునీరు చేరకుండా అడ్డుకట్ట వేయడం, నదీ తీరాల వెంబడి పచ్చదనం పెంపొందించడం, పర్యాటక ప్రాంతాలుగా మలచడం, అవసరమైన మౌలిక వసతుల కల్పన ఈ పనుల్లో ప్రధాన భాగం కానున్నాయి. హైదరాబాదీయులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ జోన్లను ముస్తాబు చేయనున్నారు.ఈ మెగా ప్రాజెక్టుకు అవసరమయ్యే భారీ ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. మొత్తం రూ.7,345.12 కోట్ల అంచనా వ్యయంలో సింహభాగాన్ని అంతర్జాతీయ సంస్థల నుంచి సేకరిస్తోంది. దీని కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి రూ.4,500 కోట్ల భారీ రుణాన్ని తీసుకోనున్నారు. ఈ మేరకు సంప్రదింపులు తుది దశకు చేరాయి. ఇక మిగిలిన రూ.2,845.12 కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే బడ్జెట్ నుంచి గ్రాంట్ రూపంలో స్వయంగా భరించనుంది. ఈ నిధుల సమీకరణతో ప్రాజెక్టుకు ఎలాంటి ఆర్థిక అడ్డంకులు లేకుండా పనులు సాఫీగా సాగడానికి మార్గం సుగమమైంది.ప్రాజెక్టు నిర్మాణంలో పారదర్శకత, వేగం పెంచేందుకు గాను ఈ పనులను పూర్తిగా ఈపీసీ మోడ్‌లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానం వల్ల కాంట్రాక్ట్ పొందిన సంస్థే డిజైనింగ్, మెటీరియల్ సేకరణ, నిర్మాణ బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీతో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం సంయుక్తంగా ఈ పనుల టెండర్లు, తదుపరి చర్యలను పర్యవేక్షించనున్నాయి. రాబోయే రోజుల్లో మూసీ నది సరికొత్త రూపురేఖలతో హైదరాబాద్‌కే ప్రధాన ఆకర్షణగా నిలవబోతోంది.

# కవిత టార్గెట్ కేటీఆర్...



**హైదరాబాద్, జూలై 10:** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి పెను సంచలనం రేగింది. బీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం, దాని అనుబంధ సోషల్ మీడియా వైఖరిపై టీఆర్ఎస్ చీఫ్ కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గులాబీ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1400 కోట్ల భారీ నిధుల వెనుక క్విడ్ ప్రో కో అవినీతి దాగి ఉందంటూ ఆమె చేసిన ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సొమ్మును తక్షణమే తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నడూ వ్యక్తిగత విమర్శలకు పోలేదని స్పష్టం చేస్తూనే, బీఆర్ఎస్ విధానాలపై విమర్శల పర్వాన్ని ఎక్కుపెట్టారు.తాను మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరుకుంటానంటూ కొందరు పనిగట్టుకుని చేస్తున్న ప్రచారాన్ని కవిత పూర్తిగా ఖండించారు. "నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లే ప్రసక్తే లేదు" అని ఆమె తేల్చి చెప్పారు. ఒక మహిళ ఒంటరిగా ప్రజాబలంతో ముందుకు సాగుతుంటే ఓర్వలేక, కాంగ్రెస్, బీజేపీలతో చేతులు కలిపి తన ప్రజా పోరాటాలను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. చివరికి టీఆర్ఎస్ అనే పేరు కూడా తనకు దక్కకుండా చేసేందుకు ఏకంగా ఎన్నికల సంఘానికి వెయ్యికి పైగా ఫిర్యాదులు పంపడం బీఆర్ఎస్ భయాందోళనలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు.బీఆర్ఎస్ అగ్రనేతలను టార్గెట్ చేస్తూ కవిత ఘాటు విమర్శలు చేశారు. కాళేశ్వరం అవినీతిలో అనకొండ లాంటి హరీశ్‌రావును బీఆర్ఎస్ ఇంకా ముందు పెట్టడం చూస్తుంటే, ఆ పార్టీ భవిష్యత్తు శూన్యమని అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. అలాగే కేటీఆర్ తన మిత్రుడు ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రో కో పద్ధతిలో అక్రమ పర్మిషన్లు ఇచ్చారని, ఇటీవల రూ. 188 కోట్లు వెచ్చించి 'పయనీర్' అనే ఇంగ్లీష్ పేపర్‌ను కొనుగోలు చేశారని ఆరోపించారు. డబ్బు బలంతో మీడియా, సోషల్ మీడియాలను గుప్పిట్లో పెట్టుకుని, తమ వార్తలు బయటకు రాకుండా గుంటనక్కల్లా ఫోన్లు చేయిస్తూ అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జోడెద్దుల్లా పార్టీని నడపాల్సిన వారే బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు.సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ శ్రేణులు తల్లి, చెల్లె అనే కనీస సభ్యత మరచి ఇష్టానుసారంగా ట్రోలింగ్ చేస్తున్నారంటూ కవిత తీవ్రంగా ఫైర్ అయ్యారు. "సభ్యత మరిచి తిడితే ఊరుకునేందుకు ఇది ఆంధ్రా కాదు, కాళ్లు విరగొట్టి చేతుల్లో పెడతాం బిడ్డా" అంటూ ఘాటుగా హెచ్చరించారు. మరోవైపు ఫినిక్స్ సంస్థకు రూ. 80 వేల కోట్ల విలువైన భూములను కట్టబెట్టారని, అటవీ శాఖ పెట్టిన కేసులను కూడా పక్కనబెట్టేశారని ఆరోపించారు. అవినీతి విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కిటికీలు తెరిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులు తెరిచిందని విమర్శించారు. కేవలం సీఎంపై కోపంతోనే కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయడం లేదని, చిన్న రాళ్ల కట్ట కడితే నీటిని వాడుకోవచ్చని సూచించారు.తెలంగాణ ఉద్యమ సమయంలో చిన్న కాంట్రాక్టర్లు, స్కూల్ యాజమాన్యాలు ఎంతో త్యాగం చేశాయని, తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కూడా కార్మికులు, ఉద్యమకారుల పక్షాన నిలబడి కొట్లాడానని కవిత గుర్తు చేసుకున్నారు. కానీ వారికి అక్కడ అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పనంగా అప్పగించిన భూములన్నింటిపై ఖచ్చితంగా రివ్యూ జరిపి, అవినీతి సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక దీక్షకు దిగుతున్నట్లు ప్రకటించి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజా అజెండా లేదని తేల్చి చెప్పారు.

# అందుబాటులోకి రానున్న కోచ్ ఫ్యాక్టరీ



**వరంగల్, జూలై 10:** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురంలో నూతనంగా నిర్మించిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ ఫ్యాక్టరీలో అతి త్వరలోనే ఉత్పత్తి పనులను ప్రారంభిస్తామని, భవిష్యత్తులో దేశ అవసరాలకు తగ్గట్టుగా సరికొత్త నూతన తరం కోచ్‌లను ఇక్కడే తయారు చేస్తామని రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈవో సతీశ్ కుమార్ స్పష్టం చేశారు. అయోధ్యపురంలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ప్రాంగణమంతా కలియతిరిగిన ఉన్నతాధికారుల బృందానికి, నిర్మాణ ప్రగతి, షెడ్ల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనపై అధికారులు రైల్వే బోర్డు ఛైర్మన్‌కు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పూర్తి స్థాయి వివరాలను వివరించారు.అనంతరం సతీశ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. కాజీపేట ఆర్ఎంయూలో విభిన్న రకాల రైల్వే కోచ్‌ల తయారీకి, వ్యాగన్ల మరమ్మతులకు అవసరమైన అన్ని రకాల అత్యాధునిక భారీ యంత్రాలు, సాంకేతిక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా స్థానిక యువతకు లభించే ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనపై తాము ప్రత్యేక దృష్టి సారించామని దీనిపై స్థానిక అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దేశీయంగా రైల్వే మౌలిక సదుపాయాల బలోపేతంలో కాజీపేట యూనిట్ భవిష్యత్తులో కీలక పాత్ర పోషించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ పర్యటనలో భాగంగా సౌత్, నార్త్ ఇండియాలను అనుసంధానించే కీలక జంక్షన్ అయిన కాజీపేట రైల్వేస్టేషన్‌ను కూడా సతీశ్‌కుమార్ సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుబాటులో ఉన్న కనీస వసతులు, ప్లాట్‌ఫారాల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్‌భారత్ పథకం కింద ఈ స్టేషన్‌లో జరుగుతోన్న ఆధునీకరణ పనులు, ప్రపంచ స్థాయి సౌకర్యాల కల్పన, నూతన భవన నిర్మాణ పురోగతిని ఆయన క్షుణ్ణంగా సమీక్షించి, పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.చివరగా, సికింద్రాబాద్ పరిధిలోని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్, టెలికమ్యూనికేషన్స్‌ను సందర్శించిన రైల్వే బోర్డు ఛైర్మన్, భారతీయ రైల్వేల భద్రతలో అత్యంత విప్లవాత్మక మార్పుగా భావిస్తున్న యాంటీ కొలిజన్ సిస్టమ్ కవచ్ 4.0 అమలు తీరును పరిశీలించారు. రైళ్ల ఢీకొట్టుకునే ప్రమాదాలను నివారించే ఈ స్వదేశీ సాంకేతికత పనితీరును, దాని లేటెస్ట్ వర్షన్ సిగ్నలింగ్ నైపుణ్యాలను ప్రత్యక్షంగా ల్యాబ్‌లలో పరిశీలించి, క్షేత్రస్థాయిలో దీని విస్తరణపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

## కొహెడ పర్యటనలో మంత్రి వాకిటి శ్రీహరికి నిరసన సెగ

**రంగారెడ్డి:** మంత్రి వాకిటి శ్రీహరికి కొహెడా పర్యటనలో నిరసన సెగ తగిలింది. చేప పిల్లల డబ్బులు వెంటనే చెల్లించాలంటూ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతుండగా మత్స్యకారులు నిరసనకు దిగారు. పోలీసులు నిరసన చేస్తున్న వారిని అరెస్ట్ చేసారు.

## బీఆరెస్ కార్యకర్తపై కాంగ్రెస్ నేతల దాడి

**నారాయణపేట:** నారాయణ పేట జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్త పై తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ నాయకుడు దాడి చేసాడు. మక్తల్ మండలం ఉప్పరపల్లి గ్రామంలో ఘటన జరిగింది. బీఆర్ఎస్ కార్యకర్త భద్ర పై కాంగ్రెస్ నాయకుడు అంజి అతని అనుచరులు దాడి చేసారు. విచక్షరహితంగా దాడి చేయడంతో భద్రకు తీవ్ర గాయాలు అయ్యాయి. మక్తల్ పట్టణంలో అనుచరులతో కలిసి బైక్ చైన్తో కొట్టించారు. బాధితుడు భద్ర తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ నాయకుల దాడికి నిరసనగా బీఆర్ఎస్ నాయకులు మక్తల్ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారుఏ. మక్తల్ మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్

## మద్యం మత్తులో ఆర్టీసీ బస్సునే టార్గెట్ చేసాడు

**జనగామ:** జనగామ బస్టాండ్లో నిలిపి ఉన్న ఆర్టీసీ అద్దె బస్సును ఓ వ్యక్తి మద్యం మత్తులో దొంగిలించి తీసుకెళ్లాడు. పాలకుర్తికి చెందిన వెంకన్న, బస్సును స్టార్ట్ చేసి సూర్యాపేట వైపు సుమారు 21 కిలోమీటర్లు ప్రయాణించాడు. సింగరాజుపల్లి టోల్ గేట్ వద్ద అదుపు తప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొట్టడంతో బస్సు ఆగిపోయింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

## జిల్లా ఆర్టీయే కు స్థల సేకరణ ప్రక్రియ ప్రారంభం

**వికారాబాద్:** జిల్లా ఆర్టీయే కార్యాలయంలో ఆటోమేటిక్ ఫిట్నెస్ టెస్టింగ్ సెంటర్, అడ్వాన్స్డ్ సైంటిఫిక్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు స్థల సేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. దీని కోసం 7 ఎకరాల స్థలం గుర్తించారు. ఆటోమేటిక్ వ్యవస్థతో వాహన ఫిట్నెస్ పరీక్షలు మరింత పారదర్శకంగా జరగనున్నాయని అధికారులు తెలిపారు.

# తెల్కపల్లి మండలం వట్టిపల్లి గ్రామంలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ

**తెల్కపల్లి 10 జూలై (స్కై న్యూస్)**ఒకే రోజు 9 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారు.నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని తెల్కపల్లి మండలం వట్టిపల్లి గ్రామంలో ఈరోజు కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం గ్రామంలో ఒకే రోజు 9 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి అడుగుపెట్టిన కుటుంబాలకు అభినందనలు తెలుపుతూ, పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.గ్రామాభివృద్ధి, ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల విశ్వాసానికి అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను నియోజకవర్గంలో అమలు చేస్తామని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు.బొప్పల్లి గ్రామంలో



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సమర్థవంతంగా అందుతున్నాయా అనే విషయాన్ని తెలుసుకునేందుకు బొప్పల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులు, ఔట్‌పేషెంట్ విభాగం, మందుల నిల్వలు, పరిశుభ్రత, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న చికిత్స తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రిలో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, పరిశుభ్రతతో పాటు సేవల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని, ప్రతి గ్రామంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారు పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ రమణారావు, గ్రామ సర్పంచ్ శ్రీ విష్ణువర్ధన్ రావు, మండల్ అధ్యక్షులు బండ పర్వతాలు ,వెంకటయ్య గౌడ్ ,మాజీ సింగల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య , మాజీ ఎంపీటీసీ ఉమాదేవి కుమార్, మాజీ ఉప సర్పంచ్ నర్సింహ, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నీటి కొరత నేపథ్యంలో ఆరుతడి పంటల సాగే ఉత్తమ ప్రత్యామ్నాయం

**- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప**

**జోగులాంబ గద్వాల, జూలై 10 ( స్కై న్యూస్):**ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్‌లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున,రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప సూచించారు. శుక్రవారం ఐడీఓసీ సముదాయంలోని జిల్లా వ్యవసాయం శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,జిల్లాలోని ప్రధాన సాగునీటి వనరులైన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు,నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం,రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ పరిధిలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు నీటి వినియోగంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని కోరారు.వరి వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా పెసర, మినుము,కంది, జొన్న, సజ్జ, రాగులు,చిరుధాన్యాలు వంటి తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలను,ముఖ్యంగా స్వల్పకాలిక రకాలను సాగు చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించేందుకు డ్రిప్ ఇరిగేషన్,స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను అనుసరించాలని,ఒకవేళ వరి సాగు



తప్పనిసరి అయితే తడి--ఆరబెట్టే పద్ధతిని పాటించాలని తెలిపారు.భూమిలో తేమను ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు మల్చింగ్ చేయడంతో పాటు పశువుల ఎరువు,వర్మీ కంపోస్ట్, ఘన జీవామృతం వంటి సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో తెల్లదోమ,పేనుబంక,నల్లి వంటి చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రైతులు పొలాలను నిరంతరం పరిశీలిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని,కలుపు మొక్కలను తొలగించి పొలాలను శుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు.సాగునీటి లభ్యత లేని ప్రాంతాల్లో రైతులు తక్కువ నీటితో పెరిగే పశుగ్రాస పంటలను సాగు చేయడంతో పాటు పాడి పరిశ్రమ,గొర్రెలు,మేకలు,కోళ్ల పెంపకం వంటి అనుబంధ వ్యవసాయ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందాలని సూచించారు.వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారులు,శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డిప్యూటీ ఇంజనీర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ 9.75 టీఎంసీల పూర్తి సామర్థ్యం ఉన్న జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం 5.729 టీఎంసీల స్థూల నీటి నిల్వ, 2.022 టీఎంసీల ప్రత్యక్ష (గాఅజవ) నీటి నిల్వ మాత్రమే ఉందన్నారు. అందుబాటులో ఉన్న ప్రత్యక్ష నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాల్సిన పరిస్థితి ఉందని,దీంతో జూరాల కుడి, ఎడమ ప్రధాన కాలువలు, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌ల ద్వారా ఈ ఖరీఫ్‌లో సాగునీటి సరఫరా ఉండదని తెలిపారు. మొత్తం 3,89,700 ఎకరాల ఆయకట్టు ఉన్న రైతులు నీటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ ఈఈ సంజీవ్ ప్రసాద్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మోసం చేయలేరు :ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని: **జూలై 07 (స్కై న్యూస్)** రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిందని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. ప్రజల మద్దతు పొందుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లే ఉద్దేశంతో దీ=గా నాయకులు ఖు=, హరీష్ రావు సింగరేణి బొగ్గు అంశం, కన్నెపల్లి అంశాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసి, దోపిడీకి గురిచేసిన చరిత్ర గత దీ=గా ప్రభుత్వానిదేనని ఆరోపించారు. మెడికల్ దందా ద్వారా **TBGKS** నాయకులు కోట్ల రూపాయలు దోచుకున్న వ్యవహారంలో గత ప్రభుత్వ హయాంలోనే విజిలెన్స్ విచారణ జరిపి అరెస్టులు చేసిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుత ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. **BRS** నాయకులు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో గడీల పాలన ఉంటే, ప్రస్తుతం ప్రజల కోసం పనిచేసే ప్రజాపాలన కొనసాగుతోందని పేర్కొన్నారు.రామగుండం నియోజకవర్గంలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో అనేక కార్యక్రమాలను చేపడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు.ఈ సమావేశంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్--బీఆర్ఎస్ కుట్రలు ఫలించవు..

**తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయే: కోలన్ శంకర్ రెడ్డి**



**రంగారెడ్డి(మహేశ్వరం),జూలై 10:** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని రాజకీయ కుట్రలు పన్నినా తెలంగాణలో భారతీయ జనతా పార్టీ విజయాన్ని అడ్డుకోలేవని బీజేపీ రాష్ట్ర సహకార విభాగం కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి అన్నారు.ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అప్పులు, ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిందని ఆరోపించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తోందని కొనియాడారు. ప్రజల విశ్వాసం బీజేపీపైనే ఉందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలకు కాలం చెల్లిందని కోలన్ శంకర్ రెడ్డి అన్నారు.

# ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జోగులాంబ గద్వాల, జూలై 10 (స్కై న్యూస్):**జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా శుక్రవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు.ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ మధు మోహన్,గద్వాల్ తహసీల్దార్ హరి కృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల,సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# 14వ తేదీ జాబ్ మేళా



**జోగులాంబ గద్వాల, జూలై 10 (స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల్ డిస్టిక్ లో ఆల్ గవర్నమెంట్ అండ్ ప్రైవేట్ ఒకేషనల్ కళాశాలలో ఒకేషనల్ కోర్సులు **(MLT,MPHW,ET AND All vocational courses)** ఈ ఈ సంవత్సరాలలో (2023-24,2024-25,2025-26) పూర్తిచేసిన విద్యార్థులు ఈనెల 14 తారీఖున అనగా మంగళవారం రోజు మహబూబ్నగర్ ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో అప్రెంటిషిప్ కం జాబ్ మేళా నిర్వహించబడుతుంది కావున ఇట్టి జాబ్ మేళాకు జోగులాంబ గద్వాల్ డిస్టిక్ లోని ఒకేషనల్ విద్యార్థులందరూ మీ యొక్క సర్టిఫికెట్స్ తీసుకొని హాజరు కాగలరని ఇట్టి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జోగులాంబ గద్వాల్ డిస్టిక్ ఇంటర్మీడియట్ విద్యాధికారి గారు శ్రీ ఎం హృదయ రాజ్ సార్ గారు పత్రికా ముఖంగా తెలియజేయడం జరిగింది

# తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నిజమైన తెలంగాణ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలి

**గుర్తింపు మరియు సంక్షేమచర్యలు చేపట్టాలి**

**తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు కోదండరాం కు బండి రమేష్ విజ్ఞప్తి**



**హైద్రాబాద్ జూలై 10;**తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నిజమైన తెలంగాణ ఉద్యమకారులందరికీ న్యాయం, గుర్తింపు మరియు సంక్షేమ చర్యలుకల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల కమిటీ విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరాం ను తెలంగాణఉద్యమకారుల కమిటీ చెర్మెన్ బండి రమేష్ కలిసి వినతి పత్రం సమర్పించారు.తెలంగాణ ఉద్యమం కారులకు 250 చదరపు గజాల నివాస స్థలం కేటాయించాలని, నెలకు ?25,000 పింఛను ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమ కేసులన్నింటినీ ఉపసంహరించుకోవాలని,తెలంగాణఉద్యమకారుల గుర్తింపు కార్డుల జారీ చేయాలని,ప్రత్యేక బడ్జెట్‌తో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని,ఉచిత బస్ పాస్, హెల్త్ కార్డ్ మరియు బీమా సౌకర్యాలు కల్పించాలని, ఉస్మానియా విశ్వవిద్యాలయం/సికింద్రాబాద్ సమీపంలో అమరవీరుల స్థూపం నిర్మించాలని, అమరవీరుల కుటుంబాలకు, గాయపడిన కార్యకర్తలకు, జైలులో ఉన్న కార్యకర్తలకు మరియు క్షేత్రస్థాయి తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపునిస్తూ, గుర్తింపు ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఉండాలని కోరారు.అలాగేతెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను, సేవలను గౌరవించేందుకు తెలంగాణ ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకోవాలని కోరారు.

# మున్సిపల్ ఎన్నికలను తలపిస్తున్న గద్వాల చేనేత సహకార సంఘం ఎన్నికలు



**జోగులాంబ గద్వాల, జూలై 10(స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల: సాధారణంగా చేనేత సహకార సంఘాల ఎన్నికలు అంటే సభ్యుల మధ్య ప్రశాంతంగా జరిగే ప్రక్రియగా భావిస్తారు. అయితే గద్వాల హెచ్‌డబ్ల్యూసీఎస్ (చేనేత సహకార సంఘం) ఎన్నికలు మాత్రం అందుకు పూర్తి భిన్నంగా సాగుతున్నాయి. ఈరోజు ప్రారంభమైన పోలింగ్ మున్సిపల్ ఎన్నికలను తలపించేలా ఉత్కంఠభరితంగా మారింది."నువ్వా... నేనా?", "నాకు ఓటు -- నీకు ఓటు" అన్నట్టుగా అభ్యర్థులు తీవ్ర ప్రచారం నిర్వహించగా, ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు చివరి నిమిషం వరకు పోటీ కొనసాగింది. సంఘం పరిసరాలు రాజకీయ ఎన్నికల వాతావరణాన్ని తలపించగా, కార్యకర్తల హడావుడి, మద్దతుదారుల సందడి, ఓటర్ల రాకపోకలతో ప్రాంతం కోలాహలంగా మారింది.ఇలాంటి ఉత్కంఠభరిత పరిస్థితులు సాధారణంగా మున్సిపల్ లేదా శాసనసభ ఎన్నికల్లోనే కనిపిస్తాయని భావించే స్థానికులు, "చేనేత సహకార సంఘం ఎన్నికలు కూడా ఇంత హోరాహోరీగా జరుగుతాయా?" అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.చేనేత సంఘం ఎన్నికలు ఈ స్థాయిలో రాజకీయ రంగు పులుముకోవడం, గెలుపు కోసం అభ్యర్థులు ప్రతిష్ఠాత్మకంగా పోటీ పడడం ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గద్వాల చేనేత సహకార సంఘం ఎన్నికలు ఇప్పుడు సాధారణ సంఘ ఎన్నికలు కాకుండా, మున్సిపల్ ఎన్నికలను తలపించే రాజకీయ పోరుగా మారాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ను రద్దు చేయాలి..

**పోలీస్ స్టేషన్‌లోనే నిరాహార దీక్షకు శ్రీకారం..**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా, జూలై 10 (స్కై న్యూస్):** సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సీనియర్ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. సిద్ధాపూర్ ప్రాంతాన్ని సందర్శించేందుకు వెళ్తున్న మహిళలను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని కొత్తూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అనంతరం పోలీస్ స్టేషన్‌లోనే నిరవధిక రిలే నిరాహార దీక్షను ప్రారంభిస్తున్నట్లు విష్ణువర్ధన్ రెడ్డి ప్రకటించారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ రద్దు అయ్యే వరకు తన పోరాటం కొనసాగుతుందని, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా ఉద్యమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం జవహర్‌నగర్‌కు మహిళలతో కలిసి వెళ్లేందుకు సిద్ధమైన విష్ణువర్ధన్ రెడ్డిని పోలీసులు ముందస్తు చర్యగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కొత్తూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా, అక్కడే నిరాహార దీక్షకు శ్రీకారం చుట్టడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ "డంపింగ్ యార్డ్ రద్దు అయ్యే వరకు మా పోరాటం ఆగదు. ప్రతిరోజూ రిలే నిరాహార దీక్షలతో పాటు శాంతియుత ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తాం. సిద్ధాపూర్ ప్రజలకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదు" అని విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. సిద్ధాపూర్ ప్రజల న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుందని, "జై సిద్ధాపూర్ -- డంపింగ్ యార్డ్ రద్దు చేయాలి" అనే నినాదంతో పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని ఉద్యమ నాయకులు వెల్లడించారు.

# ఆయాలకు నియామక పత్రాల అందజేత

**జోగులాంబ గద్వాల, జూలై 10 (స్కై న్యూస్):** గద్వాల మండలంలోని పలు ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ఆయాలుగా ఎంపికైన వారికి మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు సమీ, గోపాల్, నరసింహ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు
శనివారం 11 జూలై 2026

## విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం షాద్‌నగర్‌లో విద్యాసంస్థల బంద్..




**రంగారెడ్డి జిల్లా జూలై 10 (స్కై న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు శుక్రవారం షాద్‌నగర్‌లో కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ బంద్‌లో ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవుల గర్జన వాల్ పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



**చిన్న చింతకుంట జులై 10 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల పరిధిలోని ధమగ్నాపూర్ గ్రామం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మదనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, ఎం బి సీయోను చర్చ్ సెక్రెటరీ జి, యోనా, పాస్టర్ రేవా, గిద్యోను, చైర్మన్ రేవ జి మోషే, రేవ, సుధాకర్, రేవ, నెహెమ్య ల సమక్షంలో గోడపత్రిక విడుదల చేశారు. కార్యక్రమం లో చిన్నచింతకుంట నాయకులు జి పిలోగు,శేఖర్, ప్రతాప్, యాకోబు, మలాగర్, పురుషోత్తం, బాబు ఉంద్యాల సారంగము, చైర్మన్, సురేష్ సెక్రెటరీ, శ్యామ్,వడ్డెమాను యోసేపు చైర్మన్,సి. పౌలు,ఎ. రాజు, నెల్లికొండి ప్రేమయ్య చైర్మన్ , మద్దూరు షెడ్రెక్ చైర్మన్, పర్దిపూర్ చైర్మన్ తిమోతి,ఆనంద్ ఆదాము, అడ్డాకుల జగన్,సొలమోను సాగర్ ఫీల్డ్ పరిధిలో ఉన్న చర్చ్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ విజయవంతం చేయాలి

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్



**రంగారెడ్డి జిల్లా జూలై 10 (స్కై న్యూస్):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరిస్తున్న బూత్ స్థాయి అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. కొత్త ఓటరు నమోదు, వివరాల సవరణకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నిరక్షరాస్యులకు ఫారాలు నింపడంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సాంకేతిక సమస్యలతో ఫరూక్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం



**రంగారెడ్డి జిల్లా జూలై 10 (స్కై న్యూస్):** సాంకేతిక సమస్యల కారణంగా రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు వారానికి పైగా అంతరాయం కలుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్లాట్‌లు బుక్ చేసుకున్నప్పటికీ సర్వర్ పనిచేయకపోవడంతో కొనుగోలుదారులు, విక్రయదారులు రోజంతా కార్యాలయం వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు 15 రోజులుగా ఇదే సమస్య కొనసాగుతోందని, ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక లోపం వల్ల ప్రజలతో పాటు ప్రభుత్వానికి కూడా ఆదాయ నష్టం కలుగుతోందని పేర్కొంటూ, సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఫరూక్‌నగర్ తహసీల్దార్ నాగయ్య స్పందిస్తూ, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సాంకేతిక సమస్యలు ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం కొద్దిసేపు మాత్రమే సర్వర్ పనిచేస్తోందని, సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

## వీర్లపల్లిలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నూతన గృహానికి భూమిపూజ



**రంగారెడ్డి జిల్లా జూలై 10 (స్కై న్యూస్):** నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ తన నూతన గృహ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి అనురాధతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ పెద్దలు, స్నేహితులు, శ్రేయోభిలాషులతో పాల్గొన్నారు. స్వగ్రామంలోనే ఇల్లు నిర్మించుకోవడం ద్వారా గ్రామంతో తనకున్న అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం గ్రామ పెద్దలు, అభిమానులు ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పట్టా పాస్ బుక్ రద్దుచేసి మా పొలం మాకు ఇప్పించాలి

### కోర్ట్ ఆర్డర్ ధిక్కరిస్తూ పట్టా పాస్ బుక్

### మా నాలుగున్నర ఎకరంల ఐదుకుంటల భూమి మకిపించండి

### 19 ఎకరాల భూమి అక్రమంగా పట్టా చేయించుకున్న మహిళ





**చుంచుపల్లి జూలై 10 ( స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం చుంచుపల్లి తండా గ్రామ పంచాయతీలో తాతల నాటి పట్టాగలిగిన భూమి కోర్టు నాలుగు భాగాలుగా విభజించిన భూమి రక్తసంబంధీకులకు తెలియజేయకుండానే కోర్టు తీర్పుని లెక్కచేయకుండా పొత్తులో ఉన్న 19 ఎకరాలు పంట పొలం పట్టా చేయించుకున్న సంఘటన చుంచుపల్లి తండాలో చొటుచేసుకుంది పూర్తి వివరాల్లోకి వెళితే 2021 లో కూలీ లైన్లో ఉన్న 800 గజాల స్థలము నలుగురికి కోర్టు ఆర్డర్ ప్రకారం ఇవ్వడం జరిగింది. జీవి రమణ చెన్నకేశర్ల రమాదేవి సుంకర విజయలక్ష్మి సుంకర మాలతి లకు నాలుగు భాగాలుగా విభజించి ఇవ్వడం జరిగింది. అదేవిధంగా చుంచుపల్లి తండాలో ఉన్న 19 ఎకరాల స్థలము నాలుగు భాగాలు అనగా కూలి లైన్ లో ఉన్న స్థలము ఏ విధంగా అయితే నలుగురికి ఇవ్వడం జరిగిందో అదే విధంగా చుంచుపల్లి తండాలో ఉన్న స్థలం సైతం నలుగురికి కొత్తగూడెం జిల్లా కోర్టు ఆర్డర్ నెంబర్ ఓఎస్ 5/2013 ద్వారా సర్వేయర్ అడ్వకేట్ కమిషనర్ నాలుగు భాగాలుగా విభజించడం జరిగింది. 2023 లో అనారోగ్యంతో ఉమా ప్రసాద్ చనిపోయినారు భార్య సుంకర మాలతి 2021 లో కోర్టు ఆర్డర్ ద్వారా సర్వేయర్ చేసిన నాలుగు భాగాలు ఎవరికి తెలియజేయకుండా ఆ స్థలం మొత్తము సర్వేనెంబర్ 90/1 నుండి సర్వేనెంబర్ 90/ 9 వరకు పట్టా చేయించుకోవడం జరిగింది . కొత్తగూడెం డిస్టిక్ కోర్టు మండల సర్వేయర్ కి భాగాలుగా విభజించమని గత సంవత్సరం కోర్టు ఆర్డర్ ఇవ్వడం జరిగింది కోర్టు ఆదేశాలను సర్వేయర్ విభజించిన భాగాలను లెక్కచేయకుండా అధికారులకు తెలియజేయకుండా 19 ఎకరాలు నాదే అంటూ దొంగతనంగా సొంత వారిని అధికారులను మోసగించి పాస్ బుక్ చేయించుకోవడం జరిగింది. కోర్టు ద్వారా వేసిన హద్దులను సైతం తీసివేసి పట్టా పాస్ బుక్ చేయించుకున్న మాలతి. జనవరి 2026 లో 4 నాలుగున్నర ఎకరంల ఐదుకుంటల భూమిలో మొక్కజొన్న మేము వేసినాము. మొక్కజొన్న మొత్తం ట్రాక్టర్ తో పాడు చేయడం జరిగింది. మేము ఆనాడు కంప్లైంట్ ఇవ్వడానికి వెళితే పోలీస్ వారు తిరస్కరించినారు. అన్ని డాక్యుమెంట్లు కలిగి కోర్ట్ ఆర్డర్ ఉన్నప్పటికీ మా భూమిలోకి రావద్దంటూ మమ్ములను భయభ్రాంతులకు గురిచేస్తుంది కాబట్టి జిల్లా అధికారులు నిజా నిజాలు తెలుసుకొని సర్వే నెంబర్ 90/1 నుండి సర్వే నెంబర్ 90//9 వరకు ఉన్న మా భూమిని ఆమె పేరు మీద చేసిన పట్టా పాస్ బుక్ రద్దుచేసి మాకు చెందవలసిన భూమిని మాకు ఇప్పించవలసిందిగా కోరుచున్నాము. మాలతికి నాలుగు ఎకరాల ఐదు కుంటల భూమి ఏ విధంగా అయితే చెందుతుందో అదేవిధంగా మిగతా ముగ్గురికి సైతం అదే కోర్టు ఆర్డర్ ద్వారా చెందుతుంది కావున మాయందు దయవుంచి మా పెద్దల నుండి సంక్రమించిన భూమిని మాకు ఇప్పించవలసిందిగా కోరుచున్నాము.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్ పవన్ కుమార్ శర్మ







**నారాయణపేట జూలై 10: (స్కైన్యూస్)** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అన్నారు. శుక్రవారం న్యూ ఢిల్లీ నుంచి కార్యదర్శి నవీన్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల జాబితాలో పారద ర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని అన్నారు. ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాను నవీకరించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక మాట్లాడుతూ భారత ఎన్ని కల కమీషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించడం జరుగు తుందని తెలిపారు. మ్యాపింగ్ చేసిన డాటా ఆధారంగా ఎన్యుమరేషన్ ఫారాలను సరిచూసుకొని డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పని తీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల 24 తేదీ నాటికి డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, గతంలో కూడా 2002, లో ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా క్షేత్రస్థాయి ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు. దరఖాస్తుదారులకు తగిన విచారణ ద్వారా వారి అర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టడం జరుగుతుందని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. నారాయణ పేట జిల్లాలో ప్రతీ బిఎల్ ఓ రోజూ 100 మంది ఓటర్ల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ తహాసిల్దారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డిప్యూటీ కలెక్టర్ ఫణి రాజ్, ఎన్నికల విభాగం అధికారిని జయసుధ పాల్గొన్నారు.

## వామ పక్ష విద్యార్థి సంఘాల విద్యాసంస్థలు బంద్ విజయవంతం



**నారాయణపేట జూలై 10: (స్కైన్యూస్)** విద్యా రంగంలో సమస్యలను వెంటనే పరిష్కరించాల నీ డిమాండ్ చేస్తూ వామ పక్షాల విద్యార్థి సంఘాల విద్యాసంస్థల బంధు నారాయణపేట జిల్లా లో విజయవంతమైంది. ఈ బంద్ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్ మాట్లాడుతూ విద్య రంగాన్ని బలోపేతం చేస్తానని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికీ మూడు సంవత్సరాలు గడుస్తున్నా విద్య రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసిన పరిస్థితి కొనసాగుతున్నది. గత ఐదు సంవత్సరాలుగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ ఇప్పటికీ ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమైన విషయం. స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ పూర్తిగా రద్దు చేయాలని చట్టాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇంకొకపక్క ప్రైవేట్ విద్యా సంస్థలలో ఫీజులు నియంత్రణ లేకుండా విచ్చలవిడిగా వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను పూర్తిగా వేధిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ విద్య సమస్యలల్లో విద్యార్థుల సంఖ్య రోజుకి పడిపోతూ మూసివేసే పరిస్థితికి చేరుకున్నదని దానికి ప్రధానంగా ప్రభుత్వ విద్యా సంస్థలలో సరైన వసతులు లేకపోవడమేనని మండిపడ్డారు. అధికారం లోకి రాకముందు ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి ఒకే డీఎస్సీ నిర్వహించి చేతులు దులుపుకున్నాడు అన్నాడు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల పాడు పడిపోయి పాములు తేళ్లు తిరిగే కోటలో విద్యార్థులు చదువుకుంటున్నారనీ దాని పడగొట్టి నూతనంగా నిర్మించాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోని పరిస్థితి కొనసాగుతున్నదని అన్నారు. దీని కారణంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చదువుకోవడం కోసం ఇబ్బంది పడడమే కాకుండా అడ్మిషన్స్ కూడా రావడానికి భయపడుతున్నారనీ అన్నారు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం వీటన్నిటి పైన చర్యలు తీసుకొని వెంటనే విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ లేనిపక్షంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి రోడ్డు ఎక్కడానికైనాసిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోపి.డి.ఎస్.యు జిల్లా నాయకులు వివేక్, అజయ్, సత్తి, అరుణ్, మహేష్, వెంకటేష్, గణేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## నారాయణపేట సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం

### బిజెపి పట్టణ కార్యవర్గం నిర్ణయం

**నారాయణపేట జూలై 10: (స్కైన్యూస్)** జిల్లా కేంద్రమైన నారాయణపేట ప్రజల కనీస మౌలిక వసతులను పట్టణ అభివృద్ధి కోసం రాజీలేని పోరాటం చేయాలని శుక్రవారం పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్ అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాయకులు నాగురావు నామాజి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగపాండురెడ్డి,బిజెపి జిల్లా అధ్యక్షులు కే సత్య యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగురావు నామాజి మాట్లాడుతూ నారాయణపేట భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నారాయణపేట లో ఏరియా ఆసుపత్రి ని తిరిగి ఏర్పాటు చేసేంత వరకుకృషి చేయాలని,జిల్లా ఆసుపత్రి అత్యాధునిక సదుపాయాలతో పాటు చిన్న పిల్లల ఆసుపత్రి కూడా వెంటనే ప్రజలకు అందుబాటులోకి వచ్చేవరకు విశ్రమించవద్దని రాజీ లేని పోరాటం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ పాండు రెడ్డి మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు తమకు ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫామ్ లను వ్రాసి వార్డులో ఉన్న బి ఎల్ ఓ లకు ఇచ్చి ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని ప్రతి ఓటును రక్షించుకోవాలి సూచించారు. బి జె పి జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నాయకులు కార్యకర్తలు శ్రమించాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు రఘురామయ్యా గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ కొండ శ్వేతా సత్య యాదవ్, వైస్ పర్సన్ మంజుల జి.ర్.రెడ్డి,జిల్లా.ప్రధాన కార్యదర్శి.తిరుపతి రెడ్డి,జిల్లాకోశాధికారి సిద్ధి.వెంకట్ రాములు, జిల్లా కార్యదర్శి సుజాత, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ,పట్టణ ప్రధాన కార్యదర్శులు పరిగి.శ్రీనివాస్ రెడ్డి నక్క సత్యనారాయణ వడ్డే దత్తు కాన్సిలర్లు లు .అప్పిరెడ్డిపల్లి.రాము ప్రభాకర్ కమల పూర్.లక్మప్ప.నాగమ్మ.అంబిక శ్రీనివాస్,పి నాయకులు.గోపాల్ యాదవ్ హన్మంతురావు ఆశప్ప కె.నర్సింలు .భారతమ్మ.మరియు జాజపూర్ మణిశంకర్ యువ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట జూలై 10: (స్కైన్యూస్):**నారాయణపేట జిల్లాలో మహిళలు, యువతులు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మహిళలు, బాలికలు ఆకతాయిల వేధింపులు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గృహహింస, లైంగిక వేధింపులు లేదా ఇతర ఏ విధమైన అన్యాయాలకు గురైనప్పుడు భయపడ కుండా ధైర్యంగా పోలీసుల ను సంప్రదించాలని కోరారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, పార్కులు, ప్రజా ప్రదేశాలు, గ్రామాలు, కాలనీలు, కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో మహిళలు, విద్యార్థినులు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే షీ టీమ్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలపై జరిగే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో స్వీకరించి, విచారణ చేపట్టి నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మైనర్ బాలికలను వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా, సోషల్ మీడియా ద్వారా అసభ్య సందేశాలు పంపినా, ఫోటోలు లేదా



వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేసినా, వెంటాడినా సంబంధిత నిందితులపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటా మని ఎస్పీ హెచ్చరించారు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గృహహింసకు గురవుతున్న మహిళలు కూడా మౌనంగా బాధపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, బాధితులకు అవసరమైన న్యాయం అందించేందుకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళల ఫిర్యాదులపై సత్వర స్పందనతో పాటు నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, కళాశాలల్లో మహిళా భద్రత, సైబర్ నేరాల నివారణ, సోషల్ మీడియా వినియో గంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, వ్యక్తిగత ఫోటోలు, వీడియో లను నిర్లక్ష్యంగా పంపవద్దని, అనుమానాస్పద లింకులు లేదా ఖాతాలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. మహిళలు, బాలికలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయలేని పరిస్థితుల్లో షీ టీమ్ ఫోన్ నంబర్ 8712670398 లేదా డయల్--100కు సమాచారం అందించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరా లను పూర్తిగా గోప్యంగా ఉంచి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.

## సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ కు వెళ్తుండగా బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అరెస్ట్

**రంగారెడ్డి జిల్లా, జూలై 10 (స్కై న్యూస్):** సిద్ధాపూర్ (జవహర్‌నగర్) డంపింగ్ యార్డ్ ప్రాంతానికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిని కొత్తూరు పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు వెళ్లిన మహిళలను కూడా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకోగా, ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగానే అరెస్టులు చేసినట్లు సమాచారం.




## 24వ వార్డులో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ - కుట్టు సామగ్రి పంపిణీ

**గద్వాల పట్టణం, జూలై 10(స్కై న్యూస్):** మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించి ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో జనాబ్ అతీఖుర్ రహ్మాన్ ఆధ్వర్యంలో 24వ వార్డులో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి 24వ వార్డు కౌన్సిలర్ శ్రీ గువ్వల గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందుతున్న మహిళలకు కుట్టు పనికి అవసరమైన కత్తెరలు, మెజరింగ్ టేపులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఉపాధి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 24వ వార్డు ఇన్‌చార్జ్ మహమ్మద్ రియాజుద్దీన్, పార్టీ సభ్యుడు, లిటిల్ బర్డ్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఆసిఫ్ పాల్గొని మహిళలను అభినందించారు. ఈ ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జనాబ్ అతీఖుర్ రహ్మాన్ సేవా కార్యక్రమాలను స్థానికులు అభినందిస్తూ, మహిళల సాధికారతకు ఆయన చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు.




## మందకృష్ణ మాదిగకు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపిన శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్

**హైద్రాబాద్ జులై 10 :**వీఆర్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగకుశివసేన ఉద్ధవ్ థాక్రే తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్ నేడు మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ అన్ని వర్గాల కోసం పోరాటం చేసే గొప్ప నాయకుడు మందకృష్ణ మాదిగ అని కొనియాడారు. అతని పోరాట ప్రతిమను సేవా నిరతిని గురయించిన కేంద్ర ప్రభుత్వం పద్మ శ్రీ బిరుదు తో గౌరవించిందన్నారు



# లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

**వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల సమస్యల పరిష్కారానికై ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి**

**సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలి**

**లక్ష్మీదేవి పల్లి జూలై 10 (స్కై న్యూస్ ):**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ ను శుక్రవారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి,అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని సూచనలు చేశారు. సీఐఈఆర్ పోర్టల్ వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలోని క్రైమ్ ప్రాపర్టీని పరిశీలించి వాటి




భద్రత,నిర్వాహన పై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్ 100 కు



ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్సైలు అఖిల, రాజమౌళి సిబ్బంది పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ విద్యాలయం 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

**జోగులాంబ గద్వాల, జూలై 10 (స్కై న్యూస్):**2026--27 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ ఎంపిక పరీక్షకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు http://cbseitms.rcil.gov.in/nvs/ మరియు https://navodaya.gov.in/nvsgov.html ద్వారా ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జవహర్ నవోదయ విద్యాలయం ప్రవేశ ఎంపిక పరీక్షను 2026 నవంబర్ 28వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువు తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు.

## డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు

**మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీలు**

**నారాయణపేట జూలై 10 (స్కైన్యూస్)** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకునారాయణపేట జిల్లా కేంద్రంలో మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలం "విక్కి" సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, కొరియర్ షాప్స్ లలో ఎరువుల దుకాణాలు అనుమానాస్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టామని తెలిపారు. మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని ఎస్ఐ పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బందు విజయవంతం

**ఆత్మకూర్ జులై 10( స్కై న్యూస్)** PDSU ,AiSF,SFI,AiYF ఆధ్వరంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల కళాశాలలో స్వచ్ఛందంగా బందుకు పాటించగా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల కళాశాలలకు వెళ్లి బంద్ చేయడం జరిగింది రాష్ట్రంలో ప్రైవేట్ ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులతో దోపిడిని అరికట్టాలని పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని రాష్ట్రంలో 27,000 ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించాలని ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని విద్యాశాఖ మంత్రిని కేటాయించాలి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫాం పాఠ్యపుస్తకాల అందించాలని మధ్యాహ్నం భోజనం పథకాన్ని నిధులు పెంచి అక్షయపాత్ర ఇస్కాన్ మొన్న సంస్థకు కాకుండా మహిళ సంఘాలకు అప్పగించాలి ప్రైవేట్ కార్పొరేటు విద్య వ్యాపారాన్ని అరికట్టవలసిందిగా కోరడమైనది అరికట్టిన ఫీజు నియంత్రణ చట్టం చేయాలి ఖాళీగా ఉన్న టీచర్స్ పోస్టులను ఎంఈఓ డీఈవో మరియుక్ట్ సెలెక్ట్ అయిన లక్షణాలని పోస్టులను వెంటనే భర్తీ చేయవలి కోరడమైనది పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ను మరియు విడుదల చేసి జీవో నెంబర్ 789 లను రద్దు చేయాలి ఇంటర్ కాలేజీలకు మధ్యాహ్నం భోజనం పథకాన్ని తక్షణమే ప్రారంభించి పాఠశాల హాస్టల్ లో గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని ప్రతి పాఠశాలల కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేయవలసిందిగా ఆదరణతో భవనాలు నిర్మించాలి విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించి బడి బస్సులో నడపాలి ఉచిత బస్పాసులు ఇవ్వాలి పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్సు కాస్మోటిక్చార్జీలు పెంచి పెండింగ్లో ఉన్న బిల్లు బకాయిలను వెంటనే విడుదల చేయవలసిందిగా కోరడమైనది అలాగే త్రాగునీరు మరుగుదొడ్లు సౌకర్యవంతంగా కల్పించాలని విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిరోధక నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలి ఐసీసీ కమిటీలను నియమించాలి విద్యాహక్కు చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు 25% ఉచిత ప్రవేశాలను కల్పించాలి రాష్ట్రంలో విద్యార్థి సంఘాల్లో ఎన్నికలు నిర్వహించాలి కాంగ్రెస్ విద్యాసంఘా రంగానికి ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసి ఐదు లక్షల విద్య భరోసా కార్డులను అందించాలిప్రైవేట్ కార్పొరేటర్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా పుస్తకాలు యూనిఫామ్ నోట్ బుక్స్ విక్రయ కేంద్రాలను మూసివేయాలి ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుతుబ్ ఉదయ్ శివ అరవింద్ పి డి ఎస్ యు నాయకులు శివ కార్తీక్ సర్వేష్ నవీన్ శరత్ ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్ నాయక్ మల్లేష్ కుమార్ శివ తదితర వ్యక్తులు పాల్గొన్నారు

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

**నారాయణపేట జూలై 10: (స్కైన్యూస్)** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణపేట పట్టణంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. జయచంద్ర మోహన్ ప్రారంభించారు. ఈర్యాలీ ఆర్డీఓ కార్యాలయం నుండి పాత బస్టాండ్ సావర్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డా. కె. జయచంద్ర మోహన్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ద్వారా 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు, యుక్తవయస్కులకు ఆల్బెండాజోల్ మాత్రలు అందించడం ద్వారా నులిపురుగుల సమస్యను నివారించవచ్చని తెలిపారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, చదువులో ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు జూనియర్ కళాశాలలలో అర్హులైన ప్రతి చిన్నారికి ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఏ కారణం చేతనైనా ఈరోజు మాత్రలు తీసుకోలేని పిల్లలకు ప్రభుత్వం నిర్ణయించిన మాప్-అప్ దినం ఈ నెల 20 రోజు న మాత్రలు అందజేయ నున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,ప్రజలు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించి అర్హులైన ప్రతి చిన్నారికి ఆల్బెండాజోల్ మాత్రలు వేయించేలా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ అవగాహన ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డాక్టర్ సిద్ధప్ప డిప్యూటీ డిఎంహెచ్వో, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సాయిరాం, డాక్టర్ లక్ష్మీ కాంత్, వైద్యాధికారి డాక్టర్ తిరుపతి, ఆఫీసు సిబ్బంది, సూపర్వైజర్స్, ఏ ఎం ఎం,ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జి.ఎం.ఆర్ సానుకూల స్పందన



**చిన్న చింతకుంట జులై 10 (స్కై న్యూస్);** చిన్న చిన్న చింతకుంట మండలం, పర్దిపూర్ గ్రామంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు శుక్రవారం గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్, ఉప సర్పంచ్ నీరట నరసింహారెడ్డి, సంగం అధ్యక్షులు కట్ట రాజు సంఘం ఉపాధ్యక్షులు బిక్కి మైబు తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు, ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, పర్దిపూర్ హరిజనవాడలో అంబేద్కర్ భవనం నిర్మించవలసిందిగా వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులురామేశ్వర్ రెడ్డి మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాస్ గంగల్లా ఆనంద్ కావాలి నరేష్ తొమ్మిదవ వార్డు నెంబర్ ఎర్రన్న పదే వార్డు నెంబర్ ప్రకాష్ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ ల తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుడు గుడి విరాళానికి నాలుగు లక్షల విరాళం అందజేసిన మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు



**ఆత్మకూర్ జులై 10 (స్కై న్యూస్)** అభయాంజనేయ స్వామికి పునర్నిర్మాణం విశేష సహకారం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం పిన్నంచర్ల గ్రామం నాయకులు బంగారు శ్రీనివాసులు కుటుంబ సభ్యులు తరపున శ్రీ అభయాంజనేయ స్వామి గుడి నిర్మాణంకి నాలుగు లక్షలు విరాళాలు అందజేశారు ఆలయ అభివృద్ధికి కుటుంబ సభ్యులులు చూపిస్తున్న భక్తి సేవాభావం అభినందనీయం అభయాంజనేయ స్వామి వారి దివ్య ఆశీర్వాదం ఆశీస్సులు ఆ కుటుంబం మీద ఎప్పటికి ఉంటాయి మనసారా కోరుకుంటూ శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయనిర్మాణం కమిటీకోరారు

# టీడీపీలోకి హితేష్

**ఒంగోలు జూలై 10:**తెలుగుదేశం పార్టీలోకి మరో యువనేత ఎంట్రీకి రంగం సిద్ధం అయినట్లు తెలుస్తోంది. నందమూరి తారకరామారావు మనవడు దగ్గుబాటి హితేష్ త్వరలో పార్టీలో చేరుతారని తెలుస్తోంది. ఆయన మాజీ మంత్రులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి ల కుమారుడు. ఆయన పూర్తి పేరు హితేష్ చెంచురాం. గతంలో కుటుంబంలో నెలకొన్న విభేదాలు సమసి పోవడంతో చేరికకు మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది . ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి భారతీయ జనతా పార్టీలో ఉన్నారు. ఆ పార్టీ ఎంపీగా కొనసాగుతున్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఉన్నారు. దశాబ్దాలుగా చంద్రబాబుతో ఉన్న విభేదాలు సమసిపోవడంతో హితేష్ టిడిపిలో చేరికకు రంగం సిద్ధం అయింది. ఈ మేరకు చంద్రబాబు సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో హితేష్ సైకిల్ ఎక్కడం ఖాయం అన్నట్లు తెలుస్తోంది.దగ్గుబాటి వెంకటేశ్వరరావు నందమూరి తారక రామారావు అల్లుడు. సీఎం చంద్రబాబుకు స్వయానా తోడల్లుడు. 1983 నుంచి 2009 వరకు క్రియాశీలక రాజకీయాల్లో నడిచారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1985, 1989, 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. 1991లో మాత్రం ఎంపీగా విజయం సాధించారు. 1996లో రాజ్యసభకు ఎంపికయ్యారు. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. ఆయనపై టిడిపి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలిచారు. సుదీర్ఘకాలం పరుచురు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం అక్కడ టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఉన్నారు. అయినా సరే హితేష్ టిడిపిలో చేరి రాజకీయాలు చేయాలని భావిస్తున్నారుపురందేశ్వరి సైతం తన భర్త వెంకటేశ్వరరావుతో కలిసి 2004లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాపట్ల నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. రెండోసారి విశాఖ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో మంత్రిగా కూడా వ్యవహరించారు. అయితే ఆమె తర్వాత బిజెపిలో చేరగా.. ఆమె భర్త వెంకటేశ్వరరావు మాత్రం వైసీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో వెంకటేశ్వరరావు వైసీపీలో ఓడిపోయిన తర్వాత సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయారు. వాస్తవానికి చంద్రబాబుతో విభేదించి టిడిపి నుంచి బయటకు వచ్చేసారు. ఇప్పుడు అదే చంద్రబాబుతో విభేదాలు పూర్తిగా సమసి పోయాయి. పైగా సోదరుడు లోకేష్ తో హితేష్కు మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే లోకేష్ టీమ్ లో చేరేందుకు హితేష్ రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. చంద్రబాబు నుంచి సైతం గ్రీన్ సిగ్నల్ లభించడంతో త్వరలో హితేష్ టిడిపిలో చేరనున్నారు.

# అడ్డంగా బుక్కైన కాటసాని...

**కర్నూలు, జూలై 10:**నంద్యాల జిల్లాలో వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూకబ్జా ఉదంతం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తనకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి.. ఏకంగా రూ.15 కోట్ల విలువైన 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కాటసాని రామిరెడ్డి అక్రమంగా ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. నాటి అధికార మదంతో ప్రభుత్వ ఆస్తులను సైతం వదలకుండా కాటసాని అనుచరులు కబ్జాకు పాల్పడ్డారనే విమర్శలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.ఈ భారీ భూకబ్జా పర్వంలో కేవలం రాజకీయ నాయకులే కాకుండా.. ప్రభుత్వానికి రక్షణగా ఉండాల్సిన అధికారులే లంచాలకు ఆశపడి చేతులు కలిపినట్లు తెలుస్తోంది. అప్పట్లో కాటసాని రామిరెడ్డి అక్రమాలకు ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖలకు చెందిన కొందరు కీలక అధికారులు పూర్తి స్థాయిలో సహకరించారని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ భూమి అని తెలిసి కూడా రికార్డులను తారుమారు చేయడం లేదా కబ్జా జరుగుతున్నా కళ్ళు మూసుకోవడం ద్వారా ఈ అక్రమ ఆక్రమణకు వారు బాటలు వేశారనే ఆరోపణలు వినపడుతున్నాయి.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అవినీతి అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే కాటసాని రామిరెడ్డి చేసిన ఈ భూకబ్జా వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ జరపగా.. సదరు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కాటసాని ఆక్రమించిన మాట వాస్తవమేనని తేల్చేశారు. విజిలెన్స్ నివేదికతో కాటసాని అక్రమాలు అధికారికంగా బట్టబయలయ్యాయి.విజిలెన్స్ విచారణలో ఆక్రమణలు నిజమేనని తేలడంతో ఏపీ కూటమి ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందించింది. రూ.15 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. భూకబ్జాకు పాల్పడ్డ వైసీపీ నేత కాటసాని రామిరెడ్డిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు.. అప్పట్లో ఆయనకు అండగా నిలిచి లూటీకి సహకరించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపై కూడా శాఖాపరమైన మరియు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

# జూలై 13న జాతీయ నూలి పురుగుల నిర్మూలన కార్యక్రమం

## ప్రతి అర్హత గల చిన్నారికి ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి

## జిల్లా వైద్య డ ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారాం రాథోడ్

**కొత్తగూడెం జూలై 10( స్కై న్యూస్):** జిల్లాలో జాతీయ నూలి పురుగుల నిర్మూలన కార్యక్రమం ను 2026 జూలై 13న జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఇతర విద్యాసంస్థలలో విస్తృతంగా నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య డ ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారాం రాథోడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, కిశోరులు విద్యార్థులకు వయస్సుకు అనుగుణంగా ఆల్బెండాజోల్ మాత్రలు ఉచితంగా అందజేయబడతాయి. కార్యక్రమం రోజున ఏదైనా కారణంతో మాత్రలు తీసుకోలేని వారికి మాప్-అప్ డే సందర్భంగా కూడా మాత్రలు వేయించనున్నట్లు తెలిపారు.నూలి పురుగులు అపరిశుభ్రమైన పరిసరాలు, కలుషితమైన ఆహారం తాగునీటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు. ఇవి శరీరంలోని పోషకాలను గ్రహించడం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, బరువు తగ్గడం, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం, అలసట వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.ఆల్బెండాజోల్ మాత్రల ప్రయోజనాలు నూలి పురుగులను సమర్థవంతంగా నిర్మూలిస్తుంది.రక్తహీనత తగ్గడానికి తోడ్పడుతుంది.

**పోషకాహారం శరీరానికి సక్రమంగా అందేలా చేస్తుంది.**

పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుంది.చదువుపై ఏకాగ్రత విద్యా పనితీరును మెరుగుపరుస్తుంది.మాత్రలు తీసుకునే విధానం 1--2 సంవత్సరాల పిల్లలకు సూచించిన మోతాదులో మాత్రను చూర్ణం చేసి ఇవ్వాలి..2--19 సంవత్సరాల వయస్సు గల వారు మాత్రను నమిలి మింగాలి. మాత్రలను ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు లేదా ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రమే తీసుకోవాలి.జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి వైద్య ఆరోగ్య శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.జాతీయ నులిపురుగులు నివారణ కార్యక్రమం 2024 పిల్లల లక్ష్యం 322333 అల్బెండో?జోల్ మాత్రలు పంపిణీ చేసిన పిల్లలు 336136. 104.28% 2025 సంవత్సరం నాకు గాను పిల్లల లక్ష్యం 336136 మాత్రలు పంపిణీ చేసిన పిల్లలు 336212 పర్సెంటేజ్ .100.02% ప్రస్తుత సంవత్సరం 2026 కు మాత్రల పంపిణీ పిల్లల లక్ష్యం తేదీ 13.07.2026న పిల్లలకు పంపిణీ చెయ్యనిన లక్ష్యం 336212గా ఉన్నది అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ తెలియజేసారు.తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని, ఆల్బెండాజోల్ మాత్రలు వేయించడం పూర్తిగా సురక్షితమైనదని, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రతి అర్హత గల చిన్నారికి ఈ మాత్రలు వేయించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా వైద్య డ ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారాం రాథోడ్ విజ్ఞప్తి చేశారు.



# చేయి నొప్పితో ఆసుపత్రికి వెళ్లిన మహిళ మృతి







కొత్తూరు మండలం మహిళా సమాఖ్య అకౌంటెంట్ సుజాత మృతి

**రంగారెడ్డి జిల్లా జూలై 10 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన మహిళ మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యమే మహిళ మృతికి కారణమని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు సంబంధిత ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట, అలాగే ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, షాద్‌నగర్ పట్టణంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన బిజ్జ సుజాత చేయి నొప్పి సమస్యతో జీహెచ్ఆర్ గార్డెన్ ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు గర్భసంచిలో సమస్య, గడ్డలు ఉన్నాయని, శస్త్రచికిత్స ద్వారా వాటిని తొలగించాలని సూచించారని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో వారు ఆపరేషన్‌కు అంగీకరించారు.అయితే శస్త్రచికిత్స అనంతరం సుజాత కోమాలోకి వెళ్లిందని, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం, తప్పుడు చికిత్స కారణంగానే ఈ విషాదం జరిగిందని వారు వాపోయారు.హైదరాబాద్ నుంచి మృతదేహాన్ని షాద్‌నగర్‌కు తీసుకొస్తుండగా, ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ధర్నా జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. అంబులెన్స్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ బాధిత కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు కొందరు బంధువులు, స్థానికులు సంబంధిత ప్రైవేట్ ఆసుపత్రి ఎదుటకు చేరుకుని ఆందోళన చేపట్టారు. దీంతో రెండు ప్రాంతాల్లోనూ ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.మృతికి కారణమైన వైద్యుడిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. అయితే చట్టపరమైన ఫిర్యాదు నమోదు చేసే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు వారికి సూచించినట్లు సమాచారం. మహిళ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలు బాధిత కుటుంబ సభ్యులవి. ఈ ఘటనపై అధికారిక విచారణ అనంతరం వాస్తవాలు తేలాల్సి ఉంది.

# అంగన్వాడీలకు 41,000 వేతనాన్ని ఇవ్వాలి

## సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ డిమాండ్...

**కొత్తగూడెం జూలై 10( స్కై న్యూస్):**అంగన్వాడీ టీచర్లకు 41 వేల వేతనాన్ని , హెల్పర్లకు 35 వేల రూపాయల వేతనాన్ని ఇవ్వాలని, ఐసిడిఎస్ ప్రాజెక్టులను కాపాడుట కోసం ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.శుక్రవారం నాడు కొత్తగూడెం సిడిపిఓ కార్యాలయం ముందు అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించడం జరిగింది. అనంతరం ఐసిడిఎస్ సిడిపిఓ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ మాట్లాడుతూ ఐ సి డి ఎస్ ప్రాజెక్టును క్రమంగా ఎత్తివేసే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడిగా కలిసి ప్రయత్నం చేస్తున్నాయని ఆయన విమర్శించారు . గర్భవతులకు, పుట్టిన పిల్లలకు, గర్భంలో ఉన్న శిశువులకు, ఎదుగుతున్న చిన్నారులకు ఎప్పటికప్పుడు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తూ వారి యోగక్షేమాలు కంటికి రెప్పలా కాపాడుతున్న అంగన్వాడీ టీచర్లకు హెల్పర్లకు అండగా నిలబడాల్సిన ప్రభుత్వాలు వారిని నిర్వీర్యం చేస్తూ వారంతట్ట వారే డ్యూటీలు మానేసేలా చేసి వారి ఉద్యోగాలను వదిలి వెళ్లేలా చేస్తున్న పాలకవర్గాల ప్రయత్నాలన్నింటిని తిప్పి కొట్టాలని ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఐసిడిఎస్ ప్రాజెక్టుకు నిధులు తక్కువగా కేటాయించి నిధులు లేవనే సాకుతో కార్మికులకు వేతనాలు తగ్గించి నెలల తరబడి వారికి జీతాలు పెండింగ్లో పెట్టి అంగన్వాడి భవనాలకు కిరాయిలు సక్రమంగా చెల్లించకుండా అనేక సమస్యలను లోనయ్యేట్లు ప్రయత్నం చేస్తున్న పాలకవర్గాల కుట్రలన్నింటిని అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు గమనించాలని ఆయన అన్నారు. గత నెలలో ఢిల్లీలో జరిగిన జాతీయ సంఘాల సమావేశాల్లో భారతదేశంలో ఉన్న అంగన్వాడీ టీచర్లకు హెల్పర్లకు వేతనాలు వారికి శ్రమకు తగ్గట్టు ఇవ్వట్లేదని వారి పనిని పరిశీలన చేసిన అనంతరం టీచర్లకు 41000 ఇవ్వాలని హెల్పర్లకు ,35 వేల రూపాయలు ఇవ్వాలని ఐఎల్ఓ ప్రకారం జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. వేతనాలు పెంచకపోగా ఎఫ్ ఆర్ ఎస్ డ్యూటీలని ,బిఎల్ఓ డ్యూటీ లని, ఎస్ ఐ ఆర్ డ్యూటీ ల పేరుతో పాలకవర్గాలకు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ అంగన్వాడీల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .వారి శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వాలని అప్పుడే భావి భారత నిర్మాతలైన చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని గుర్తు చేశారు పౌష్టికాహారం లోపం వల్ల చిన్నారులు మృత్యువాత పడుతుంటే గమనించలేని గుడ్డి ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పేలా ఉద్యమాలు ఉధృతం చేయాలని ఆయన అన్నారు రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో ఇవ్వడం లేదని మినీ టీచర్లకు కొత్తగా రిక్రూట్ అయిన అంగన్వాడీ టీచర్లకు పెరిగిన జీతాలు వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఐసిడిఎస్ రక్షణ కోసం నిధులు పెంచాలన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి రాజకీయ అవసరాల కోసం అంగన్వాడీ వ్యవస్థను ఉపయోగించుకుంటూ వారి శ్రమను అగౌరవపరుస్తున్నారని విమర్శించారు ఇప్పటికైనా వారిని గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులుగా రిక్రూట్మెంట్ చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించుకుంటే భవిష్యత్తులో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కూసాని శైలజ కళావతి జయలక్ష్మి ప్రసన్న రాజేశ్వరి సుజాత భవాని సుభద్ర తదితరులు పాల్గొన్నారు.





# రిజిస్టర్ కార్యాలయానికి కుర్చీలు అందజేసిన ఎస్ కె టీ గ్రూప్

**కొత్తగూడెం జూలై 10( స్కై న్యూస్):**కొత్తగూడెం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఎస్ కె టీ గ్రూప్ దోసపాటి వెంకటేశ్వర రావు డ బ్రదర్స్ దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కుర్చీలు అందచేశారు ఈ కార్యక్రమం లో ఎస్ కె టి గ్రూప్ దోసపాటి పిచ్చేశ్వర రావు , దోసపాటి క్రాంతి సబ్ రిజిస్టర్ నూతలపాటి అప్పారావు కార్యాలయ సిబ్బంది మరియు ఎస్ కె టీ స్టాఫ్ కూడా పాల్గొన్నారు



# లక్ష్మీదేవునిపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**రంగారెడ్డి జిల్లా, జూలై 10 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో లబ్ధిదారులు రవి నాయక్--లక్ష్మి దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోగుర పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం లబ్దిదారుల కుటుంబాన్ని సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# వైసీపీ, టీడీపీ మధ్య సవాళ్లు




**కర్నూలు, జూలై 10:**ఉమ్మడి కర్నూలు జిల్లా లోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అధికార తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి మధ్య ఆరోపణలు, సవాళ్లతో రాజకీయ చర్చలు మరింత ముదిరాయి. ఇద్దరు నాయకులు బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.అహోబిలం ఆలయానికి సంబంధించిన వ్యవహారాల్లో అవినీతి చోటుచేసుకుందని బ్రిజేంద్రరెడ్డి ఆరోపించారు. భక్తులు సమర్పించే తలనీలాలు, కానుకలు వంటి అంశాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, వాటికి అధికార వర్గాల మద్దతు ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి నెలా అక్రమ లావాదేవీలు జరుగుతున్నాయని కూడా ఆయన విమర్శించారు.ఈ ఆరోపణలపై స్పందించిన అఖిలప్రియ వాటిని పూర్తిగా ఖండించారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం ఎప్పటి నుంచో దేవాలయాలు, మఠాలకు విరాళాలు అందిస్తోందని, ఆధ్యాత్మిక సంస్థలను దోచుకునే సంస్కృతి తమకు లేదని చెప్పారు. గతంలో అధికారంలో ఉన్నవారే ఇప్పుడు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆమె ఎదురుదాడి చేశారు.అంతేకాకుండా, తనపై చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని బ్రిజేంద్రరెడ్డికి సవాల్ విసిరారు. అవి నిజమని తేలితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. అదే సమయంలో ఆరోపణలను నిరూపించలేకపోతే ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ప్రత్యర్థి నేతను డిమాండ్ చేశారు.ఈ సవాల్‌కు ప్రతిస్పందించిన బ్రిజేంద్రరెడ్డి కూడా తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, సరైన సమయంలో వాటిని ప్రజల ముందుకు తీసుకొస్తానని తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రమైంది. ఈ వివాదానికి అహోబిలాన్ని వేదికగా ఎంచుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అఖిలప్రియ ఆళ్లగడ్డ నుంచి అహోబిలానికి చేరుకుని అక్కడే ఉంటానని ప్రకటించారు. మరోవైపు బ్రిజేంద్రరెడ్డి కూడా అక్కడికి వెళ్లేందుకు సిద్ధమవగా, పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఆయనను గృహనిర్బంధంలో ఉంచినట్లు సమాచారం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఆళ్లగడ్డ రాజకీయాలు గతంలో కూడా ఎన్నో సంచలనాలకు కేంద్రంగా నిలిచాయి. ఇప్పుడు మరోసారి ఇద్దరు ప్రధాన నాయకుల మధ్య నేరుగా సవాళ్లు, ప్రతి సవాళ్లు సాగడంతో స్థానిక రాజకీయాలు మరింత వేడెక్కాయి. అయితే అహోబిలం చర్చకు వచ్చేందుకు గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి తన ఇంటి నుంచి బయలుదేరారు. కానీ శాంతి భద్రతల సమస్య దృష్ట్యా పోలీసులు ఆయనను ఇంటి బయటకు రాకుండా అడ్డుకున్నారు. గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి తో పాటు ఆయన అనుచరులు కూడా తమను అహోబిలం వెళ్లేందుకు అనుమతివ్వాలని పోలీసులను కోరారు. పోలీసులు అందుకు అంగీకరించకపోవడంతో అఖిలప్రియకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికలకు ఇంకా మూడేళ్లు ముందు నుంచే ఆళ్లగడ్డ రాజకీయం హీటెక్కింది. గంగుల బ్రిజేంద్రనాథ్ రెడ్డి వర్సెస్ భూమా అఖిలప్రియగా వార్ మొదలయింది. ఇప్పుడే ఇలా ఉంటే.. రానున్న కాలంలోఇంకెన్ని వివాదాలు తలెత్తుతాయోనన్న ఆందోళన ఆళ్లగడ్డ ప్రజల్లో నెలకొంది. మొత్తం మీద కేవలం రాజకీయ ఆధిపత్యం కోసమే ఇలాంటి ఆరోపణలు చేసుకుంటున్నారంటూ సొంత పార్టీ నేతలే కామెంట్స్ చేస్తున్నారు. వ్యవహారం ఎలా ముగుస్తుందో, ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు బయటకు వస్తాయో అన్న అంశంపై రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లో కూడా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఇరు పార్టీల కార్యకర్తలు తమ తమ నాయకులకు మద్దతుగా నిలుస్తుండటంతో పరిస్థితిని అధికారులు నిశితంగా గమనిస్తున్నారు.

# ఆరణి శ్రీనివాసులుకు కష్టాలు

**తిరుపతి, జూలై 10:**తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కష్టాలు మొదలయినట్లు కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో ఆయనకు తిరుపతి శాసనసభ టిక్కెట్ దక్కేది కూడా కష్టంగానే కనిపిస్తుంది. తెలుగుదేశం పార్టీ నుంచి ఆరణి శ్రీనివాసులకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయని చెప్పాలి. తాజాగా టీడీపీ అధినాయకత్వం తిరుపతి ఇన్ ఛార్జిగా మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను నియమించడంతో ఈ ఊహాగానాలకు మరింత ఊపు నిచ్చినట్లయింది. ఇప్పటి వరకూ తిరుపతి టీడీపీ ఇన్ ఛార్జిగా ఉన్న సుగుణమ్మను తప్పించి ఆమె స్థానంలో మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను నియమించడం వెనక వచ్చే ఎన్నికల్లో శ్రీనివాస్ ప్రసాద్ ను పోటీకి దింపాలన్న యోచనలోనే టీడీపీ నాయకత్వం ఉందన్నది పార్టీ వర్గాల ద్వారా విస్తృతంగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతుంది. 2019లా వైసీపీ నుంచి గెలిచిన ఆరణి శ్రీనివాసులు 2024 ఎన్నికల్లో జనసేనలోచేరారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరణి శ్రీనివాసులకు తిరుపతి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చారు. టీడీపీ బలంగా ఉన్నప్పటికీ, అక్కడ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తనకు కావాలని గట్టిగా కోరినప్పటికీ పవన్ కల్యాణ్ తిరుపతి నియోజకవర్గం సీటును పట్టుబట్టి జనసేన ఖాతాలో వేసుకున్నారు కూటమి హవాలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైసీపీ నుంచి జనసేనలోకి గతంలో చిత్తూరు ఎమ్మెల్యేగా వైసీపీలో ఉన్న ఆయన పార్టీ మారి తిరుపతి జనసేన ఎమ్మెల్యే అయ్యారు. కానీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరణి శ్రీనివాసులు పార్టీ క్యాడర్ ను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ, జనసేన క్యాడర్ ను పక్కన పెట్టి కొందరు వైసీపీ నేతలకు టచ్ లో ఉన్నారంటూ ఆరో?పణలు పలు దఫాలు ఎదుర్కొన్నారు. అలాగే సుగుణమ్మ కూడా జనసేన నేతలతో సమన్వయం చేసుకోవడంలో విఫలమయ్యారని టీడీపీ నాయకత్వం భావించింది. జనసేన నాయకులే ఆరణి శ్రీనివాసులుపై ఆరోపణలు చేస్తున్నారు. వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలకు కూడా ధీటుగా ఆరణి శ్రీనివాసులు స్పందించక పోవడం కూడా ఆరణిపై ఆగ్రహానికి కారణమయిందంటున్నారు. కొంతకాలం క్రితం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్లాస్ పీకారని తెలిసింది. ఇలాగైతే ఎలా.. కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తలను కలుపుకుని పోవాలని పవన్ కల్యాణ్ చెప్పారట. పాత పరిచయాలుంటే వాటిని వదిలేయాలని, జనసేనలో కొనసాగాలనుకుంటే మారాలని ఆరణి శ్రీనివాసులుకు పవన్ కల్యాణ్ ఒకింత సీరియస్ గానే చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే వచ్చే ఎన్నికలు మూడేళ్లకు ముందుగానే టీడీపీ ఇన్ ఛార్జిగా మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ ను పార్టీ నాయకత్వం నియమించినట్లు తెలిసింది.గ్రేటర్ రాయలసీమపై గురి జనసేనలో చేరికలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా గ్రేటర్ రాయలసీమ పరిధిలోని ఆరు ఉమ్మడి జిల్లాల నుంచి భారీగా వైసీపీ నేతలు జనసేనలో చేరుతారని ప్రచారం ప్రారంభం అయింది. చాలామంది వైసిపి నేతలు అసంతృప్తితో ఉన్నారు. అటువంటి వారంతా జనసేన వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. వారిని పార్టీలోకి రప్పించేందుకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి రంగంలోకి దిగినట్లు సమాచారం. ఇటీవల 14 మంది జనసేన నేతలతో చేరికల కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అందులో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి కూడా ఒకరు. ఆయనకు గ్రేటర్ రాయలసీమ జిల్లాలపై మంచి పట్టు ఉంది. కాంగ్రెస్ పార్టీతో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆయన పని చేశారు. ఆ అనుభవంతోనే పెద్ద ఎత్తున వైసిపి నేతలను ఆకర్షించేందుకు ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు గెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తి ఉన్నవారు, వీధి లేక పార్టీలో కొనసాగుతున్న వారిని టార్గెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది.గ్రేటర్ రాయలసీమ పరిధిలో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో ఉన్నాయి. దాదాపు 70 వరకు నియోజకవర్గాలు ఉంటాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆది నుంచి గ్రేటర్ రాయలసీమ అనుకూలంగా ఉంటూ వస్తోంది. 2014 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చింది. కానీ గ్రేటర్ రాయలసీమలో మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టు చాటుకుంది. 2019 ఎన్నికల్లో మాత్రం ఒక ఐదు స్థానాలు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించింది. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభంజనంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ ఏడు స్థానాల్లో విజయం సాధించింది. మూడు ఎంపీ సీట్లను పొందింది. అందుకే అక్కడ వైసిపిని తక్కువ అంచనా వేయకూడదని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అందుకే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డిని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది.బాలినేని శ్రీనివాస్ రెడ్డి తన సొంత జిల్లా ప్రకాశం నుంచి జనసేన చేరికల విషయంలో ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు సమాచారం. జిల్లాలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఓ నలుగురు జనసేనలోకి వస్తారని టాక్ నడుస్తోంది.

# బీజేపీ నేతల మౌనం ఎందుకో...

**విశాఖపట్టణం, జూలై 10:**ఆంధ్రప్రదేశ్ బీజేపీలో ఏదో జరుగుతుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ పెద్దగా రాజకీయంగా యాక్టివ్ గా లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంపై ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నప్పటికీ దానికి సరైన కౌంటర్ మాత్రం ఇవ్వడం లేదు. బీజేపీ నేతల మౌనం వెనక అర్థం ఏంటన్నది ఇప్పటికీ కూటమిలోని ప్రధాన పక్షాలైన టీడీపీ, జనసేనలకు అర్థం కాకుండా ఉంది. రాష్ట్ర నేతలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారా? లేదా కేంద్ర నాయకత్వం నుంచి ఏమైనా ఆదేశాలు ఉన్నాయా? అన్న అనుమానం అందరిలోనూ కలుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ కమలం పార్టీ రాష్ట్ర నేతలు మాత్రం సంతోషంగా లేరు. తమ నియోజకవర్గాల్లో... అనేక నియోజకవర్గాల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న చోట టీడీపీ, జనసేన నుంచి తమకు మద్దతు లభించడం లేదని రివర్స్ లో బీజేపీ నేతలు ఈ విధమైన నిరాసక్తతతో ఉన్నారని చెబుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ పది స్థానాల్లో పోటీ చేసింది. ఎనిమిది స్థానాల్లో విజయం సాధించింది. అలాగే ఆరు లోక్ సభ స్థానాలకు పోటీ చేసి మూడింటిలోవిజయం సాధించింది. అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి, ఆదోని నుంచి డా. పి.వి. పార్థసారథి, జమ్మలమడుగు నుంచి ఆదినారాయణ రెడ్డి, ధర్మవరం నుంచి సత్య కుమార్ యాదవ్, ఎచ్చెర్ల నుంచి నడుకుదిటి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. విశాఖపట్నం ఉత్తరం నుంచి పెన్మెత్స విష్ణు కుమార్ రాజులు ఎన్నికయ్యారు. రాజమండ్రి పార్లమెంటు నుంచి దగ్గుబాటి పురంధేశ్వరి, అనకాపల్లి సీఎం రమేష్, నర్సాపురం నుంచి భూపతిరాజు శ్రీనివాసవర్మలు ఎన్నికయ్యారు. దీంతో పాటు మాధవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు... కానీ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలున్నప్పటికీ ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. అసలు కూటమి ప్రభుత్వంతో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం పై వస్తున్న ఆరోపణల విషయంలోనూ పెద్దగా స్పందించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం.. కూటమి సర్కార్ లో తమకు ప్రాధాన్యత దక్కకపోవడం ఒక కారణమయితే, మరొక ముఖ్యమైన కారణం.. తమ నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్ ఛార్జుల పెత్తనం సాగుతుండటమేనని చెబుతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర నాయకత్వానికి కొందరు ఫిర్యాదు




చేసినట్లు తెలిసింది. అయితే సంయమనం పాటించాలని, రానున్న కాలంలో అంతా సర్దుకుంటుందని నాయకత్వం చెప్పిందట. అయినా సరే కూటమిలో మిత్రధర్మం పాటించకుండా వ్యవహరించడంపై టీడీపీ, జనసేనలో కొంత అసంతృప్తి అయితే మొదలయింది. తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావం, రుతుపవనాల లోపం వల్ల వ్యవసాయానికి తీవ్ర ఆటంకం కలిగి కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి.

## రాయలసీమలో ఎకరా రూ.1.50 కోట్లు



**అనంతపురం జూలై 10:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణ కోసం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో దూసుకుపోతోంది. కొత్త ఇండస్ట్రియల్ పాలసీ, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానంతో పరిశ్రమలు, కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మారుతున్న పరిస్థితులకు తగిన విధంగా వ్యూహాలతో ముందుకు సాగుతోంది. తాజాగా ఏపీ ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్లలో అభివృద్ధి చేస్తున్న మూడు నోడ్‌లలో పరిశ్రమలకు భూమి కేటాయించడానికి ప్రత్యేకంగా పాలసీని తీసుకొచ్చింది. విశాఖపట్నం–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లలో ఉన్న కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లలో ఉన్న పరిశ్రమలకు ఈ పాలసీ వర్తిస్తుంది.ఏపీ ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్లలోని నోడ్‌లకు సంబంధించి పరిశ్రమలకు కేటాయించే భూముల ధరల్ని ఖరారు చేసింది. అత్యధికంగా నెల్లూరు జిల్లా క్రిస్ సిటీలో ఎకరా భూమిని రూ. 1.74 కోట్లకు విక్రయించాలని నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లులోని నోడ్‌లో ఎకరా రూ. 1.50 కోట్లుగా ఫిక్స్ చేశారు. కడప జిల్లాలో ఎకరా రూ. 1.25 కోట్లు ఖరారు చేశారు. కేంద్రం నిర్ణయించిన ధరలే ఫిక్స్ చేశారు. ఏపీ పొరుగున్న ఉన్న కర్ణాటకతో పాటుగా మహారాష్ట్ర, గుజరాత్‌లో కూడా ఇలాగే క్లస్టర్లలో పరిశ్రమలకు భూములకు సంబంధించి ధరలు ఖరారు చేశారు. గుజరాత్, ముంబైలో ఎకార రూ. 2.25 కోట్లకు ఫిక్స్ చేశారు. పారిశ్రామికవేత్తల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని చెబుతున్నారు.రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ నోడ్‌లకు సమీపంలో ఎకరా రూ. 20 నుంచి 30 లక్షలకు భూములు అందిస్తున్నట్లు కేంద్రం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ ధరలతో పోలిస్తే ఇండస్ట్రియల్ నోడ్‌లలో భూముల ధరలు 3 నుంచి 4 రెట్లు ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. దీంతో కేంద్రం ఈ నోడ్‌లలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తునందున ఈ ఖర్చును భరించి రాబట్టేందుకు వీలుగా కేంద్రం ధరల్ని ఫిక్స్ చేసింది. కాకపోతే ముందుకుగా వచ్చే ప్రాజెక్టులకు మాత్రం 25శాతం రాయితీ ఇచ్చేందుకు అనుమతించింది.. అది కూడా ప్రోత్సాహకం కింద ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇండస్ట్రియల్ కారిడార్లకు సంబంధించిన భూముల్ని ఏ ధరకు విక్రయించాలో తమ నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరించాలని, ఐఆర్ఆర్‌కు సంబంధించి కేంద్రం నిబంధన విధించింది.. ఈ ధరలకే భూములు విక్రయించాల్సి ఉంటుందంటున్నారు అధికారులు.క్రిస్ సిటీలో ముందుగా ఈ భూములు కేటాయింపు ప్రారంభించాలని ప్లాన్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లలో కలిపి దశల వారీగా 29,254 ఎకరాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. రాష్ట్రం భూముల్ని కేటాయిస్తే.. కేంద్ర సంస్థ నిక్‌డిక్ట్ (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్) అభివృద్ధి చేస్తోంది. మూడు నోడ్‌లలో కలిపి మొదటి దశలో భాగంగా మౌలిక సదుపాయాలకు మొత్తం 7,225 ఎకరాల్లో దాదాపు రూ. 3,300 కోట్లు నిక్‌డిక్ట్ ఖర్చు చేస్తోంది.

# 68 మండలాల్లో డేంజర్

**విజయవాడ, జూలై 10:**ఏపీలో వర్షాభావం కనిపిస్తోంది. జూలై రెండవ వారం దాటుతున్న ఆశించిన స్థాయిలో వర్షాలు పడడం లేదు. సాగునీటి జలాశయాలు, ప్రాజెక్టుల్లో నీరు లేదు. డెడ్ స్టోరేజ్ కు చేరుకున్నాయి నిల్వలు. మరోవైపు ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమైంది కానీ.. వర్షాలు లేక ఆశించిన స్థాయిలో పనులు ముందుకు వెళ్లడం లేదు. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు పడ్డాయి కానీ.. ప్రస్తుతానికి ముఖం చాటేసాయి. వరి విత్తనాలు చల్లి వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు అన్నదాతలు. ప్రస్తుతం పరిస్థితి చూస్తుంటే మాత్రం ఖరీఫ్ ప్రమాదకరమే అని అర్థం అవుతోంది. ఈ తరుణంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమయింది. ఈ వాతావరణ విపత్తుని ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది.ప్రధానంగా ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. అది మన రాష్ట్రంపై స్పష్టంగా కనిపించింది. నైరుతి రుతుపవనాల రాక కూడా ఆలస్యం అయ్యింది. జూన్ రెండో వారానికి రాష్ట్రానికి రుతుపవనాలు తాకాయి. తీవ్ర వర్షాభావం నెలకొంది. వర్షపాతం లోటు కనిపిస్తోంది. జూన్లో మైనస్ 25 వర్షపాతం లోటు నమోదు కాగా.. జూలైలో ఇప్పటివరకు మైనస్ 41 శాతం వర్షపాతం లోటు నమోదయింది. సాధారణంగా జూన్ నుంచి నవంబర్ వరకు నైరుతీ రుతుపవనాలు విస్తరిస్తాయి. ఖరీఫ్ కు ఇవే ప్రధానం. ఈ సీజన్ మొత్తం మైనస్ 27% వర్షపాతం లోటుతో ముగిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ఉమ్మడి 13 జిల్లాల్లో 68 మండలాలు ఉన్నాయి. అందులో ఎల్ నినో ప్రభావం 105 మండలాలపై తీవ్రంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. 208 మండలాలపై మాత్రం మధ్యస్థ స్థాయిలో ప్రభావం ఉండనుంది. ప్రధానంగా శ్రీ సత్య సాయి, అన్నమయ్య, అనంతపురం జిల్లాలపై ప్రభావం ఉండనుంది. మధ్యస్థ స్థాయి ప్రభావం కర్నూలు, నంద్యాల, చిత్తూరు, వైయస్సార్ కడప, తిరుపతి, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాలపై ఉండనుంది. నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ కీలక సూచనలు చేస్తోంది.

**ఉరుములు, పిడుగులు.. ఆ జిల్లాలకు హై అలెర్ట్!**

ఏపీ వ్యాప్తంగా చల్లటి వాతావరణం కొనసాగుతోంది.



అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. కానీ పూర్తిస్థాయిలో మాత్రం కురవడం లేదు. ఇంకా వర్షపాతం లోటు కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెదర్ అప్డేట్ ఇచ్చింది. నాలుగు జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వానలు పడతాయని తెలిపింది. అయితే భారీ వర్షాలు నమోదు కావడం లేదు. ఎల్ నినో ప్రభావం స్పష్టంగా ఉంది. ఖరీఫ్ అదును దాటుతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులపాటు కొనసాగితే ఇబ్బందికర పరిస్థితులు తప్పేలా లేవు. అయితే నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండడంతో కొంత ఆశలు రేగుతున్నాయి.ఐదు రోజులపాటు నైరుతీ రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈరోజు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో చెదురు మధురుగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే ఛాన్స్ కనిపిస్తోంది. పిడుగులు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. రైతులతోపాటు పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేస్తున్నారు.ఏపీ పై ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం తేలికపాటి వర్షాలు తప్ప.. భారీ వర్షాలు నమోదు కావడం లేదు. నైరుతి రుతుపవనాలు సైతం ఆలస్యం అయ్యాయి. పెద్దగా ప్రభావం సైతం కనిపించడం లేదు. ఖరీఫ్ పంటలపై ప్రభావం కనిపిస్తోంది. ఈ ఏడాది ఇలానే కొనసాగితే కష్టం అని రైతుల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. మరోవైపు ఎల్ నినో హెచ్చరికల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ప్రత్యామ్నాయ పంటలను సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులు ఈ పంటలపై సూచనలు అందిస్తున్నారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలో వర్షపాతం లోటు ఉంటుందని ముందుగానే అంచనా వేశారు. కానీ రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఆకాశం మేఘావృతమై కనిపించినా.. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదు. ఇది కచ్చితంగా రైతులకు లోటు.

# బిజినెస్

## ఎగువ మధ్యాదాయ రేసులో 5 రాష్ట్రాలు!



భారతదేశం స్థూలంగా తక్కువ మధ్య ఆదాయ (లోయర్ మిడిల్ ఇన్‌కమ్) ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నప్పటికీ దేశీయంగా కొన్ని రాష్ట్రాలు మాత్రం ఆదాయంలో దూసుకుపోతున్నాయి. ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన దేశాల ఆర్థిక వర్గీకరణ గుర్తింపు, రాష్ట్రాల తలసరి ఆదాయ డేటాను విశ్లేషిస్తూ కొన్ని సంస్థలు అందించిన నివేదిక ప్రకారం.. భారతదేశంలోని ఐదు రాష్ట్రాలు ఇప్పటికే ప్రపంచ బ్యాంకు ఎగువ మధ్య ఆదాయ (అప్పర్ మిడిల్ ఇన్‌కమ్) పరిమితిని దాటేశాయి. మరోవైపు కొన్ని రాష్ట్రాలు ఈ మైలురాయికి అత్యంత సమీపంలో ఉండగా మరికొన్ని రాష్ట్రాలు ఇప్పటికీ పేదరికంలో వెనుకబడి ఉండటం దేశీయ ఆర్థిక అసమానతలను స్పష్టం చేస్తోంది.ప్రపంచ బ్యాంకు నిబంధనల ప్రకారం, ఏ దేశం లేదా ప్రాంతం తలసరి ఆదాయమైనా 4,636 డాలర్ల నుంచి 14,375 డాలర్ల మధ్య ఉంటే దానిని 'ఎగువ-మధ్య-ఆదాయ' ఆర్థిక వ్యవస్థగా గుర్తిస్తారు. ఈ బెంచ్‌మార్క్‌ను అధిగమించి టాప్-5లో నిలిచిన భారతీయ రాష్ట్రాల వివరాలు..

| స్థానం | రాష్ట్రం / కేంద్రపాలిత ప్రాంతం | తలసరి ఆదాయం (డాలర్లలో) |
|---|---|---|
| 1 | ఢిల్లీ | 6,217 |
| 2 | కర్ణాటక | 5,579 |
| 3 | తెలంగాణ | 5,407 |
| 4 | తమిళనాడు | 5,329 |
| 5 | గుజరాత్ | 4,734 |

**అడుగు దూరంలో మరిన్ని రాష్ట్రాలు**

మరికొద్దిపాటి వృద్ధిని నమోదు చేస్తే 'ఎగువ-మధ్య-ఆదాయ' హోదాను అందుకోవడానికి మరో మూడు రాష్ట్రాలు సిద్ధంగా ఉన్నాయి. అందులో.. మహారాష్ట్ర: తలసరి ఆదాయం 4,628 డాలర్లు (బెంచ్‌మార్క్ కంటే కేవలం 8 డాలర్లు తక్కువ). హరియాణా: తలసరి ఆదాయం 4,627 డాలర్లు (బెంచ్‌మార్క్ కంటే కేవలం 9 డాలర్లు తక్కువ). కేరళ: తలసరి ఆదాయం 4,610 డాలర్లు (బెంచ్‌మార్క్ కంటే కేవలం 26 డాలర్లు తక్కువ).

ఒకవైపు కొన్ని రాష్ట్రాలు అంతర్జాతీయ ప్రమాణాల వైపు దూసుకుపోతుంటే, మరోవైపు దేశంలో ప్రాంతీయ అసమానతలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాల పరిస్థితి దయనీయంగా ఉంది. అందులో అట్టడుగున బిహార్ ఉంది. కేవలం 984 డాలర్లు తలసరి ఆదాయంతో బిహార్ భారతదేశంలోనే పేద రాష్ట్రంగా మిగిలిపోయింది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్ (1,403 డాలర్లు), ఝార్ఖండ్ (1,470 డాలర్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# కిలో రూ. 2 లక్షలు పలికే పుట్టగొడుగు

## ఇంట్లోనే సాగు చేస్తూ కోట్లు సంపాదిస్తున్న రైతులు!



అంతర్జాతీయ మార్కెట్లో కిలో రూ. 2 లక్షల నుండి రూ. 3 లక్షల వరకు పలికే అత్యంత ఖరీదైన కీడా జడి లేదా హిమాలయన్ గోల్డ్ పుట్టగొడుగుల ఇండోర్ సాగు భారత్‌లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. గతంలో కేవలం హిమాలయాల మంచు ప్రాంతాల్లో మాత్రమే సహజంగా దొరికే ఈ ఔషధ పుట్టగొడుగును, ఇప్పుడు ఆధునిక సాంకేతికతతో ఒక చిన్న మూసివున్న గదిలోనే ఆర్టిఫిషియల్ ఎన్విరాన్మెంట్ సృష్టించి విజయవంతంగా పండిస్తున్నారు. ల్యాబ్ వాతావరణంలో ఉష్ణోగ్రత, తేమను కంట్రోల్ చేస్తూ ప్లాస్టిక్ లేదా గాజు జార్లలో పోషకాల ఆధారంగా దీనిని పెంచుతారు. సహజంగా ఇది చైనా, టిబెట్, భారతదేశంలోని హిమాలయ పర్వత ప్రాంతాలలో 3,500 నుండి 5,000 మీటర్ల ఎత్తులో, మంచు కరిగే సమయంలో లభిస్తుంది. ఒక రకమైన గొంగళి పురుగు తల భాగం నుండి ఈ ఫంగస్ లేదా పుట్టగొడుగు మొలుస్తుంది. అందుకే దీనికి కీడా జడి అనే పేరు వచ్చింది. దీనికి అంతటి భారీ ధర ఉండటానికి కారణం దీనిలోని అద్భుతమైన ఔషధ గుణాలే. చైనా, జపాన్, అమెరికా వంటి దేశాల్లో క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలకు సంబంధించిన జీవనరక్షక మందుల తయారీలో దీనిని వాడతారు. అలాగే, అథ్లెట్లు, హెల్త్ ఫ్రీక్స్ తమ శారీరక శక్తిని, రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ఎనర్జీ బూస్టర్ సప్లిమెంట్స్ రూపంలో దీనిని విరివిగా ఉపయోగిస్తారు.

**ల్యాబ్‌లో లేదా గదిలో దీనిని ఎలా సాగు చేయవచ్చు?:**

ఒకప్పుడు కేవలం కొండల్లో మాత్రమే దొరికే ఈ పుట్టగొడుగును, ఇప్పుడు ఆధునిక కార్డిసెప్స్ మిలిటారిస్ సాంకేతికత ద్వారా ఇంట్లోనే ఆర్టిఫిషియల్ ల్యాబ్ ఏర్పాటు చేసి పండిస్తున్నారు. దీని సాగుకు ఒక చిన్న గదిని ల్యాబ్‌లా మార్చాలి. ఇందులో ఏసీ, హ్యూమిడిఫైయర్ల సహాయంతో పర్వత ప్రాంతాల్లో ఉండే శీతల వాతావరణాన్ని నిరంతరం మెయింటైన్ చేయాలి. గాజు లేదా ప్లాస్టిక్ జార్లలో బియ్యం లేదా ప్రత్యేక పోషకాలతో కూడిన ద్రవాన్ని బేస్‌గా తయారు చేసి, అందులో ఈ పుట్టగొడుగుల బీజాలను వేస్తారు. ల్యాబ్‌ను పూర్తిగా క్లీన్‌గా, శానిటైజ్డ్ వాతావరణంలో ఉంచితే దాదాపు 2 నుండి 3 నెలల వ్యవధిలోనే ఈ అత్యంత విలువైన పుట్టగొడుగుల పంట చేతికి వస్తుంది.

**పెట్టుబడి, లాభాలు:**

మొదట్లో ఈ ల్యాబ్ సెటప్, అవసరమైన యంత్రాలు, శిక్షణ కోసం దాదాపు రూ. 7 నుండి 8 లక్షల వరకు పెట్టుబడి అవసరమవుతుంది. అయితే మొదటి పంట విజయవంతంగా చేతికి వచ్చిన తర్వాత, అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ ఆధారంగా ఏడాదికి లక్షల నుండి కోట్ల రూపాయల టర్నోవర్ సాధించడం చాలా సులువవుతుంది. సాంప్రదాయ వ్యవసాయంతో పోలిస్తే, తక్కువ స్థలంలో అత్యధిక లాభాలను తెచ్చిపెట్టే ప్రీమియం అగ్రి-బిజినెస్‌లలో కీడా జడి సాగు అగ్రస్థానంలో నిలుస్తోంది.

# ట్రిలియనీర్ హోదా కోల్పోయిన ఎలాన్ మస్క్

## 1.4 ట్రిలియన్ డాలర్స్ నుంచి 992-997 బిలియన్ డాలర్లకు సంపద..!

ప్రపంచ కుబేరుడు, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తన ట్రిలియనీర్ హోదాను కోల్పోయాడు. ప్రపంచంలోనే ట్రిలియనీర్ హోదాను దక్కించుకొన్న మొదటి వ్యక్తిగా గుర్తింపు పొందిన మస్క్ సంపద.. ఇటీవలి కాలంలో భారీగా తరిగిపోయింది. స్పేస్‌ఎక్స్ షేర్ల ధరలు పడిపోవడంతో ఆయన సంపద తగ్గింది. దాంతో ట్రిలియనీర్ హోదాను కోల్పోయారు. జూలై ప్రారంభంలో స్పేస్ ఎక్స్ షేర్ల ధరలు 30 శాతం పడిపోయాయి. దాంతో అప్పటివరకు 1.4 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న మస్క్ సంపద 992-997 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఈ షేర్లు స్టాక్ మార్కెట్‌లోకి వచ్చినప్పుడు క్రేజ్ ఉండగా ఇప్పుడు తగ్గుతోంది. కృత్రిమ మేధస్సు రంగంలో లక్ష్యాలను సాధించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ బాండ్లను విక్రయించనున్నట్లు మస్క్ ప్రకటించడంతో మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఫలితంగా స్పేస్‌ఎక్స్ షేర్ ధర వరుస సెషన్లలో భారీగా క్షీణించింది. గరిష్ఠస్థాయిలో ఉన్న షేర్ మళ్లీ 150 డాలర్ల పరిధికి పడిపోయి లిస్టింగ్ ధర దగ్గరికి చేరుకుంది. ఇదే సమయంలో జూన్ 23న టెస్లా షేర్ కూడా ఒకే రోజులో 6 శాతం వరకు క్షీణించింది. టెస్లాలో కూడా మస్క్‌కు భారీ వాటా ఉండటంతో ఆయన సంపదపై ప్రత్యక్ష ప్రభావం పడింది.



# టీమిండియాపై ఇంగ్లండ్ భారీ విజయం

నేడు ఇంగ్లండ్‌కు భారత్‌కు మధ్య జరిగిన మూడో టి20లో టీమిండియాపై 125 పరుగుల తేడాతో ఇంగ్లండ్ భారీ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (44 బంతుల్లో 70; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) భారీ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. మరో ఓపెనర్ జోస్ బట్లర్ (21 బంతుల్లో 36) పర్వాలేదనిపించాడు. ఈ ఇద్దరు తొలి వికెట్‌కు 43 పరుగులో జోడించారు. ఆ తర్వాత భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో ఇంగ్లండ్ స్కోరు మందగించింది. ఒక దశలో 160 నుంచి 170 పరుగులకు పరిమితమవుతుందనుకున్న ఇంగ్లండ్.. చివర్లో సామ్ కరన్ (24 బంతుల్లో 41 నాటౌట్), విల్ జాక్స్ (7 బంతుల్లో 14) మెరుపులతో 200 పరుగుల మార్క్‌ను దాటింది. భారత బౌలర్లలో హర్షిత్ రానా, ప్రిన్స్ యాదవ్ చెరో 2 వికెట్లు తీయగా, అక్షర్ పటేల్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం 202 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన టీమిండియా వరుస వికెట్లు కోల్పోయింది. ఇంగ్లండ్ బౌలర్ల దాటికి భారత బ్యాట్స్‌మెన్స్ వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. జోష్ టంగ్ నాలుగు వికెట్లు, జోఫ్రా ఆర్చర్ మూడు వికెట్లు తీయగా, ఆదిల్ రషీద్ రెండు, విల్ జాక్స్ ఒక వికెట్టు తీశారు. కేవలం 11.4 ఓవర్లలో 76 పరుగులకే టీమిండియా ఆలౌటైంది. భారత బ్యాట్స్‌మెన్స్‌లో వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ ఇద్దరూ చెరో 13 పరుగులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు.



ఇంగ్లండ్ ఇచ్చిన 202 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా 11.4 ఓవర్లలో 76 రన్స్‌కే కుప్పకూలింది. జోష్ టంగ్ (4/28), జోఫ్రా ఆర్చర్ (3/29) పేస్ ధాటికి టాప్, మిడిలార్డర్ కుదేలైంది. ఓపెనర్లు అభిషేక్ (10), సూర్యవంశీ (13)తో పాటు ఇషాన్ (13), కెప్టెన్ అయ్యర్ (5), అక్షర్ (10), తిలక్ (3), శివం దూబే (2) పెవిలియన్‌కు క్యూకట్టడంతో జట్టుకు ఘోర పరాభవంతప్పలేదు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లిష్ టీమ్ 20 ఓవర్లకు 201/7 స్కోరు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (44 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 70), ఆల్‌రౌండర్ సామ్ కరన్ (41 నాటౌట్), జోస్ బట్లర్ (36) మెరుపులు మెరిపించారు. భారత బౌలర్లలో ప్రిన్స్, హర్షిత్ చెరో రెండు వికెట్లు తీశారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 గురువారం జరుగుతుంది.

### ఆతిథ్య అమెరికాకు ఓటమి.. క్వార్టర్స్‌లోకి ప్రవేశించిన బెల్జియం

**సియాటెల్:** ఫిఫా వరల్డ్‌కప్‌లో ఆతిథ్య జట్ల పోరు ముగిసింది. టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న అమెరికా .. రౌండ్16 మ్యాచ్‌లో ఓటమి పాలైంది. బెల్జియం 4-1 గోల్స్ తేడాతో అమెరికాను ఓడించి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. బెల్జియం ప్లేయర్ చార్లెస్ డీ కెటిలేరి రెండో గోల్స్ చేశాడు. ఈ మ్యాచ్‌లో అమెరికా డిఫెన్స్ బలహీనత బయటపడింది. బెల్జియం దూకుడును ఏమాత్రం అమెరికా డిఫెండర్లు అడ్డుకోలేకపోయారు. అమెరికా ఫార్వర్డ్ ప్లేయర్ ఫొలారిన్ బలోగన్ ఈ మ్యాచ్‌లో ఆడాడు. ట్రంప్ జోక్యంతో అతనిపై ఓ మ్యాచ్ సస్పెన్షన్‌ను ఫిఫా రద్దు చేసిన విషయం తెలిసిందే. వివాదాస్పద రీతిలో బలోగన్‌ను ఆడించారు. అయినా కానీ అమెరికాకు ఆ అంశం కలిసిరాలేదు. బెల్జియం తరపున డీ కెలిటేరి 9, 33 నిమిషాల్లో, వానకేన్ 57వ నిమిషంలో, లుకాకు 93వ నిమిషంలో గోల్ చేశాడు. ఇక అమెరికా తరపున



టిల్‌మాన్ 31వ నిమిషంలో గోల్ చేశాడు. బెల్జియంతో మ్యాచ్‌లో మరీ పేలవంగా అమెరికా ఆడినట్లు ఫుట్‌బాల్ నిపుణులు చెబుతున్నారు. ఇక ఈ టోర్నీకి ఆతిథ్యం ఇచ్చిన మెక్సికో, కెనడా, అమెరికా దేశాలు ఈ టోర్నీ నుంచి ఔటయ్యాయి.

# స్పోర్ట్స్

### సంజూ శాంసన్‌కు మరో షాక్?



టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్‌కు మరో షాక్ తగలనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జింబాబ్వే టూర్‌కు దూరమైన అతను.. ఏషియన్ గేమ్స్ జట్టులోనూ స్థానంలో కోల్పోనున్నట్లు క్రీడా వర్గాలు అంటున్నాయి. గత నెలలో భారత సెలెక్టర్లు 15 మంది సభ్యుల ఏషియన్ గేమ్స్ జట్టును ప్రకటించారు. ఈ జట్టులో సంజూ శాంసన్ కూడా ఉన్నాడు. ప్రస్తుతం ఈ జట్టు నుంచి కూడా సంజూను తప్పించాలని బీసీసీఐ యోచిస్తున్నట్లు సమాచారం. యువ ఆటగాళ్లకు అవకాశాల పేరుతో సంజూ టీ20 కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాలని కొందరు బీసీసీఐ పెద్దలు యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ విషయంలో బీసీసీఐపై భారీ ఒత్తిడి ఉందని, అతడికి అవకాశాలు ఇవ్వడం కోసమే సంజూను శాశ్వతంగా తప్పించే ప్లాన్ జరుగుతుందని అతని అభిమానులు అనుకుంటున్నారు. కాగా, ఐర్లాండ్ సిరీస్, ఆతర్వాత ఇంగ్లండ్‌తో జరిగిన తొలి రెండు టీ20ల్లో దారుణంగా విఫలమైన సంజూ శాంసన్‌ను జింబాబ్వే పర్యటనకు ఎంపిక చేయని విషయం తెలిసిందే. విశ్రాంతి పేరుతో సెలెక్టర్లు అతన్ని తప్పించారన్న ప్రచారం జరుగుతుంది. ఈ సిరీస్‌కు సంజూ స్థానంలో యువ వికెట్‌కీపర్ బ్యాటర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌కు అవకాశం కల్పించారు. ప్రస్తుత ఇంగ్లండ్ పర్యటన తర్వాత భారత జట్టు మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. ఏషియన్ గేమ్స్ విషయానికొస్తే.. ఈ ఖండాంతరం క్రీడలు సెప్టెంబర్ 19- అక్టోబర్ 4 మధ్యలో జరుగనున్నాయి. జింబాబ్వే పర్యటనకు భారత జట్టు: శ్రేయస్ అయ్యర్ (సి), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (విసి), ఇషాన్ కిషన్ (డబ్ల్యుకె), శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (విసి) ఏషియన్ గేమ్స్‌కు భారత జట్టు: శ్రేయస్ అయ్యర్ (సి), తిలక్ వర్మ, రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి, జస్ప్రీత్ బుమ్రా, సంజు శాంసన్, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అర్ష్దీప్ సింగ్, శివం దూబే, వరుణ్ చక్రవర్తి, వైభవ్ సూర్యవంశీ



# సందీప్ రెడ్డి వంగా బ్యానర్‌లో ‘రోమాంచకం’.. ఆసక్తికరంగా ఫస్ట్ గ్లింప్స్

‘అర్జున్ రెడ్డి’, ‘యానిమల్’ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో ఇండియన్ సినిమాను షేక్ చేసిన స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో ఒక సరికొత్త యూత్‌ఫుల్ లవ్ స్టోరీ రాబోతుంది. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ‘రోమాంచకం’ అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ‘మేమ్ ఫేమస్’ చిత్రంతో యూత్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న యంగ్ హీరో సుమంత్ ప్రభాస్, ‘8 వసంతాలు’ ఫేమ్ అనంతిక సనిల్ కుమార్ ఈ సినిమాలో లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక గ్లింప్స్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ గ్లింప్స్ ప్రస్తుతం ఆకట్టుకుంటోంది. ప్రారంభంలో సముద్ర తీరం బ్యాక్‌డ్రాప్‌లో హీరో హీరోయిన్ల మధ్య సాగే బైక్ రైడ్స్, రొమాంటిక్ సీన్స్ ఎంతో ఆహ్లాదకరంగా సాగగా.. అంతా ప్రశాంతంగా సాగుతుందనుకున్న తరుణంలో గ్లింప్స్ ముగింపులో దర్శకుడు ఒక ఊహించని మైండ్ బ్లోయింగ్ ట్విస్ట్ ఇచ్చారు. హీరో హీరోయిన్లు ఇద్దరూ ఒకరినొకరు గట్టిగా చెంపదెబ్బలు కొట్టుకుంటూ ‘ఐ హేట్ యూ’ అని అరుచుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతవరకు కూల్‌గా సాగిన వాతావరణం, ఒక్కసారిగా ఇంటెన్స్ ఎమోషనల్‌గా మారిపోవడంతో ఈ ప్రేమకథలో సందీప్ రెడ్డి వంగా మార్క్ గట్టిగానే ఉండబోతోందని స్పష్టమవుతోంది. ఇక వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని సెప్టెంబర్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

# జైలర్ 2 బిజినెస్‌కు భారీ క్రేజ్.. రిలీజ్‌కు ముందే మలయాళంలో రికార్డు డిమాండ్




సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన ‘జైలర్’ సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సంచలనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ భారీ విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా మలయాళ మార్కెట్‌లో ఈ చిత్రం అనూహ్యమైన వసూళ్లు సాధించి రజినీకాంత్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు ఈ బ్లాక్‌బస్టర్‌కు సీక్వెల్‌గా రూపొందుతున్న జైలర్ 2 పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన రిలీజ్ డేట్ గ్లింప్స్ సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. సోషల్ మీడియాలో ఆ వీడియోకు విశేష స్పందన లభించడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. తాజా సమాచారం ప్రకారం, జైలర్ 2 విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సినిమా థియేట్రికల్ హక్కుల కోసం ఇప్పటికే మలయాళ మార్కెట్‌లో పోటీ మొదలైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కేరళలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఈ సినిమా హక్కులను దక్కించుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొదటి భాగం కేరళలో అద్భుతమైన వసూళ్లు సాధించడంతో పాటు, మలయాళ స్టార్ మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో కనిపించడం అక్కడి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో రెండో భాగంపై కూడా ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ‘జైలర్’ తొలి భాగంలో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. అదే తరహాలో ‘జైలర్ 2’లో కూడా ఆయన పాత్రకు ప్రాధాన్యత ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయినప్పటికీ, రజినీకాంత్‌తో పాటు మోహన్‌లాల్ క్రేజ్ కూడా మలయాళ మార్కెట్‌లో సినిమాకు అదనపు బలం చేకూరుస్తుందనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ‘జైలర్ 2’ థియేట్రికల్ బిజినెస్ ఊహించిన దానికంటే పెద్ద స్థాయిలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణాది మార్కెట్‌లో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఉండటంతో పంపిణీ హక్కుల కోసం తీవ్ర పోటీ నెలకొనే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ బిజినెస్‌కు సంబంధించిన వివరాలపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ఇది ముందే ఊహించా.. ఓటీటీ నుంచి ‘సత్లుజ్’ బ్యాన్‌పై నటుడు దిల్జీత్ దోసాంజ్ కామెంట్స్



ప్రముఖ నటుడు, సింగర్ దిల్జీత్ దోసాంజ్ ప్రధాన పాత్రలో నటించిన ‘సత్లుజ్’ చిత్రం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఎలాంటి సెన్సార్ కోతలు లేకుండా జూలై 3న ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5లో గుట్టుచప్పుడు కాకుండా విడుదలైన ఈ చిత్రం, కేవలం రెండు రోజులకే ప్లాట్‌ఫామ్ నుండి అకస్మాత్తుగా తొలగించబడింది. ఈ వివాదాస్పద పరిణామంపై దిల్జీత్ దోసాంజ్ ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో స్పందిస్తూ, ఈ నిషేధం ఎప్పుడో ఒకప్పుడు జరగాల్సిందేనని, తాను దీన్ని ముందే ఊహించానని పేర్కొన్నారు. అయితే సోమవారం ప్రభుత్వ కార్యాలయాలు తెరిచిన తర్వాత ఈ నిర్ణయం ఉంటుందని భావించానని, కానీ ఆదివారం సాయంత్రమే తీసేస్తారని అనుకోలేదని ఆయన అన్నారు. తాము ఈ సినిమాను కనీసం ప్రమోట్ కూడా చేయకుండా అలాగే విడుదల చేశామని, ఒకవేళ ప్రమోట్ చేసి ఉంటే ఇది రెండు రోజులు కూడా ఓటీటీలో ఉండేది కాదని దిల్జీత్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ తాము ఏం చెప్పాలనుకున్నామో, ఏ విధంగా చెప్పాలనుకున్నామో అది ప్రేక్షకులకు చేరినందుకు తనకు సంతోషంగా ఉందని, ఇది ప్రేక్షకుల సినిమా కాబట్టి ఎలా వీలైతే అలా డౌన్‌లోడ్ చేసుకుని అయినా చూడవచ్చని ఆయన చెప్పుకొచ్చారు. హనీ ట్రెహాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, పంజాబ్‌కు చెందిన ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త జస్వంత్ సింగ్ ఖల్రా జీవితం ఆధారంగా రూపొందింది. ఆయన 1995లో అపహరణకు గురై, ఆ తర్వాత కనిపించకుండా పోయారు. మొదట ‘పంజాబ్ 95’ అనే టైటిల్‌తో రూపొందిన ఈ సినిమా గత మూడేళ్లుగా సెన్సార్ క్లియరెన్స్ కోసం నిలిచిపోయింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ఏకంగా 127 కట్స్ ప్రతిపాదించడంతో, ఆ కోతలతో సినిమాను విడుదల చేయడానికి నిరాకరించిన దర్శకుడు, హీరో నేరుగా ఓటీటీ బాట పట్టారు. భారత్‌లో ఓటీటీ కంటెంట్‌పై థియేట్రికల్ సెన్సార్ పరిమితులు నేరుగా వర్తించకపోవడంతో, మేకర్స్ దీనిని ‘సత్లుజ్’ అనే కొత్త పేరుతో అన్‌కట్‌గా జీ5లో రిలీజ్ చేశారు. అయితే సెక్యూరిటీ కారణాలు, ఐటీ రూల్స్ ఉల్లంఘనలను ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు జీ5 ఈ చిత్రాన్ని భారత్‌లో నిలిపివేసింది. ప్రస్తుతం ఈ చిత్రం భారతదేశం వెలుపల ఉన్న జెడ్5 గ్లోబల్‌లో మాత్రమే అందుబాటులో ఉంది.





# నాగార్జున సినిమాలో విలన్‌గా అందాల భామ

టాలీవుడ్‌లో మన్మథుడు అనగానే అందరికీ గుర్తొచ్చే పేరు కింగ్ నాగార్జున. మొన్నటి వరకు కుర్ర హీరోలు సైతం అసూయ పడేలా ఆన్‌స్క్రీన్‌పై రొమాన్స్ పండించాడు. అయితే ఈ మధ్య ఆయన తన పంథాను మార్చాడు. యాక్షన్ సినిమాలపై ఫోకస్ పెట్టాడు. తన 100వ సినిమా సినిమా పూర్తిగా యాక్షన్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా ఉండేలా ప్లాన్ చేసుకున్నాడు.తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు ‘కింగ్ 100’ అనే వర్కింగ్ టైటిల్ పెట్టారు. ఇప్పటికే 80 శాతం షూటింగ్ కూడా పూర్తయింది. లాటరీ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని భోగట్టా. అందుకే ‘లాటరీ కింగ్’ అనే టైటిల్‌ని అనుకుంటున్నారట. ఈ చిత్రంలో టబు నటిస్తున్నట్లు అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచి మరింత అంచనాలు పెరిగాయి. గతంలో వీరిద్దరు కలిసి నటించిన ‘నిన్నే పెళ్లాడుతా’, ‘ఆవిడా మా ఆవిడే’ లాంటి సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. వీరిద్దరి ఆన్‌స్క్రీన్ రొమాన్స్‌కి ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ కూడా ఉంది. 100వ సినిమాలోనూ వీరిద్దరి మధ్య రొమాంటిక్ సీన్స్ ఉంటాయని ఆ మధ్య వార్తలు వచ్చాయి. అయితే లేటెస్ట్ సమాచారం ఏంటంటే.. ఈ చిత్రంలో నాగార్జునతో టబు ఫైట్ చేయబోతుంది. ఆమె హీరోయిన్‌గా కాకుండా, నెగటివ్ షేడ్స్ ఉన్న అత్యంత పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించబోతున్నారట. నాగార్జున, టబుల మధ్య వచ్చే యాక్షన్ సీన్స్ సినిమాకే హైలెట్‌గా నిలవనున్నాయని నెట్టింట ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మిస్తున్నారు.

# భారతీయ పరిశ్రమలపై చైనా గుత్తాధిపత్యం

భారతదేశంలోని అత్యంత కీలకమైన పరిశ్రమలను చైనాకు అప్పగించడం ద్వారా మోదీ సర్కార్ జాతీయ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఆరోపించారు. మోదీ ప్రభుత్వం కీలక రంగాలను చైనాకు అప్పగించి, చైనీయులు మరింతగా వృద్ధి చెందడానికి పలు అవకాశాలు కల్పించిందని విమర్శించారు. చైనా ఇప్పటికీ భారత వ్యూహాత్మక పరిశ్రమలను శాసిస్తోందని ఒక మీడియా ఇచ్చిన రిపోర్టును ఆధారంగా చేసుకొని ఖర్గే, మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అయితే కాంగ్రెస్ చేసిన ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి కానీ, బీజేపీ నుంచి కానీ స్పందన రాకపోవడం గమనార్హం.



ఆరేళ్ల క్రితం గల్వాన్ లోయలో 20 మంది భారత వీర జవాన్లు ప్రాణత్యాగం చేసిన తర్వాత ప్రధాని మోదీ చైనాకు క్లీన్ చిట్ ఇచ్చారని ఖర్గే ఆరోపించారు. "మన వీరజవాన్లు మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించారు. కానీ మోదీ ప్రభుత్వం భారతదేశ ప్రయోజనాలను చైనాకు తాకట్టు పెట్టింది" అని ఖర్గే ఎక్స్? వేదికగా విమర్శలు గుప్పించారు. దేశ భవిష్యత్తును నిర్దేశించాల్సిన మన ఆర్థిక వ్యవస్థలోని అత్యంక కీలక రంగాలు చైనాపై ఆధారపడడం పెరిగిపోయిందని అన్నారు. గల్వాన్ ఘర్షణ తర్వాత చైనా నుంచి దిగుమతులు 2025-26 నాటికి 101.81 శాతం పెరిగిందని, దీని వల్ల భారత వాణిజ్య లోటు 112.1 బిలియన్ డాలర్లకు చేరిందని ఖర్గే తెలిపారు. "భారతదేశం దిగుమతి చేసుకునే యాంటీబయాకిట్స్?లో 86 శాతం చైనా నుంచే రావడం ఆశ్చర్యకరం. 2024-25లో భారతదేశం దిగుమతి చేసుకున్న ఏపీఐ, బల్క్? డ్రగ్?, డ్రగ్ ఇంటర్మీడియట్లలో దాదాపు 74 శాతం చైనా చేతిలోనే ఉన్నాయి" అని ఖర్గే చెప్పారు. ఇక భారత్? దిగుమతి చేసుకునే విద్యుత్ వాహనాల (ఈవీ) విడిభాగాల్లో 66 శాతం ఇప్పటికీ చైనా నుంచే వస్తున్నాయని అన్నారు. భారత ఈవీలకు శక్తినిచ్చే లిథియం-అయాన్? బ్యాటరీల్లో దాదాపు 75 శాతం దిగుమతి అవుతున్నాయని, వాటిలో అత్యధిక భాగం చైనావేనని ఖర్గే చెప్పారు. అలాగే 2025-26లో భారతదేశం దాదాపు 93 శాతం పర్మనెంట్ మాగ్నెట్?లను చైనా నుంచే దిగుమతి చేసుకుందని ఆయన అన్నారు. సౌరశక్తిపై మోదీ ప్రభుత్వం చేస్తున్న డొల్ల ప్రసంగాలు ఒక వైపు ఉంచితే, ఆత్మనిర్భర్? భారత్ కింద మోదీ ప్రోత్సహిస్తామని చెప్పుకుంటున్న ఓ రంగం పూర్తిగా చైనా వశమైందని అన్నారు. చైనా నుంచి దిగుమతి చేసుకున్న అన్?డిఫ్యూజ్డ్? సిలికాన్? వేఫర్లలో 99 శాతానికి పైగా చైనా సరఫరా చేయడం తీవ్ర దిగ్భ్రాంతికరం. ఇది ఆ రంగాన్ని దాదాపుగా చేక్కించుకోవడమే. ఈ అన్?డిఫ్యూజ్డ్? సిలికాన్ వేఫర్లే మన సోలార్ సెల్స్?కు ఆధారంగా మారాయని ఖర్గే పేర్కొన్నారు.

**జూలా ఫ్రెండ్ కోసం ఎర్రతివాచీ**

"చైనా నేరుగా అరుణాచల్ ప్రదేశ్?, లద్దాఖ్?లలో చైనా భారత భూభాగంలోకి చొరబడుతోందని ఉందని పౌర సమాజం నివేదికలు చెబుతున్నాయి. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం తన 'జూలా ఫ్రెండ్' కోసం ఎర్ర తివాచీ పరిచింది. భారతదేశ ప్రభుత్వ విద్యుత్ ప్రాజెక్టులకు నాలుగు చైనా కంపెనీలు బిడ్లు వేసేందుకు వీలుగా ఆంక్షలు తొలగించింది" అని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్?కు చైనా సహాయం చేయడం గురించి సాక్ష్యాత్తు డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అంగీకరించారని, అది అధికారికంగా నమోదు కూడా అయ్యిందని ఖర్గే అన్నారు. అయినా సరే గల్వాన్ ఘటన తర్వాత భారత్?లోని అత్యంత కీలకమైన పరిశ్రమలను బీజింగ్? చేజిక్కించుకోవడానికి అనుమతించడం ద్వారా మోదీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను దెబ్బతీసిందని ఆయన అన్నారు. ఇప్పుడు వారు తన రంగు పులుముకున్న లాల్? ఆంఖ్? (నల్లని కంటి) నీడలో చైనీయులు వృద్ధి చెందడానికి మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నారని మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

# గొప్పగా ఎదగండి, ఎక్కువ విజయాలు సాధించండి

'గొప్పగా ఎదగండి, ఎక్కువ విజయాలు సాధించండి' అంటూ మెల్‌బోర్న్‌లోని ప్రవాస భారతీయులకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఒక లక్ష్యం పూర్తయితే మరో సంకల్పం తీసుకని ముందుకెళ్లాలని తెలిపారు. ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక వ్యవస్థతో భారత్? వేగంగా అడుగులో వేస్తోందని, త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ఎదుగుతుందని పేర్కొన్నారు. చంద్రయాన్ ద్వారా తొలిసారి చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టామని, అంతరిక్షంలోకి గగన్‌యాన్ పంపేందుకు భారత్ సిద్ధమవుతోందని తెలిపారు. అలాగే, భారత్ సొంత స్పేస్ స్టేషన్ ఏర్పాటుకు సిద్ధమవుతోందని మోదీ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన మెల్?బోర్న్?లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు ప్రసంగించారు.




"భారత్‌లో హైడ్రో ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్, సోలార్ మాడ్యూల్స్, విండ్ మిల్స్ కోసం మేము ఒక బలమైన మ్యాన్?ఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్‌ను తీర్చిదిద్దుతున్నాం. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని, 2070 నాటికి 'నెట్ జీరో' ఉద్గారాలను సాధించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన సాంకేతికత, పెట్టుబడులు, వనరులు ఈ పరివర్తనను మరింత వేగవంతం చేయగలవు. కొన్ని నెలల క్రితమే శాంతియుత ప్రయోజనాల చట్టం ద్వారా భారత్ అణు రంగాన్ని ప్రైవేట్ కంపెనీలకు కూడా భారత్ అందుబాటులోకి తెచ్చింది. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆస్ట్రేలియాలో ఉన్న అపారమైన యురేనియం నిల్వలు భారత్ అణు ఇంధన ప్రయాణంతో ప్రత్యక్షంగా ముడిపడి ఉన్నాయి."

**'భారత్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయి'**

దీర్ఘకాలిక పెట్టుబడులకు భారత్ అత్యుత్తమ గమ్యస్థానమని, భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా వ్యాపారవేత్తలను మోదీ కోరారు. భారత్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇండోనేసియా పర్యటన ముగించుకొని ప్రధాని మోదీ ఆస్ట్రేలియా వెళ్లారు. మెల్‌బోర్న్‌కు చేరుకున్న ప్రధానికి అక్కడి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం పలికారు. ఇరు దేశాల ఉమ్మడి వారసత్వాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రధాని వీక్షించారు. తర్వాత మెల్‌బోర్న్‌లో జరిగిన ఆసీస్‌లో ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో కలిసి ఆస్ట్రేలియా-ఇండియా సీఈఓ ఫోరమ్ సదస్సులో పాల్గొన్నారు. విమాన, రవాణా, లాజిస్టిక్స్, ఆర్థిక సేవలు, కీలక ఖనిజాలు, టెక్నాలజీ, ఆహార భద్రత వంటి రంగాల్లో ఉన్న అవకాశాలను సీఈఓలతో మోదీ చర్చించారు. ఈ సందర్భంగా అల్బనీస్, మోదీ సరదాగా సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం మాట్లాడిన ప్రధాని ద్వైపాక్షిక వాణిజ్యాన్ని కొత్త శిఖరాలకు చేర్చే ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందాన్ని త్వరగా ఖరారు చేయాలని ఆల్బనీస్‌ను కోరారు. భారత్, ఆస్ట్రేలియాలు సహజమైన, విశ్వసనీయ భాగస్వాములుగా ముందుకు సాగడం ఎంతైనా అవసరం ఉందన్నారు.

**'భారత్, ఆస్ట్రేలియా సంబంధాలు బలపడ్డాయి'**

ఇదిలా ఉండగా, గత 12 ఏళ్లలో తాను ఆస్ట్రేలియాలో పర్యటించడం ఇది మూడోసారని మోదీ తెలిపారు. గడిచిన కాలంలో భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు గొప్ప శిఖరాలకు చేరుకున్నాయని, ఇందులో ప్రవాస భారతీయులు కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రవాస భారతీయుల దినచర్య వారిని భారతదేశంతో అనుసంధానించి ఉంచుతుందని, అలాగే వారు ఆస్ట్రేలియా అభివృద్ధికి కూడా దోహదపడుతున్నారని కొనియాడారు. "ఈ కార్యక్రమం హౌస్‌ఫుల్ అయింది. ఇది ఒక బ్లాక్‌బస్టర్. దీనికి ముందు, నేను సిడ్నీలో మీ అందరినీ రెండుసార్లు కలిశాను. నేను మెల్?బోర్న్ ప్రజలను కలవడానికి కూడా ఎదురుచూస్తున్నాను. అందుకే ఈసారి మెల్?బోర్న్ ప్రజలతో కలిసి ఫ్లాట్ వైట్ కాఫీ తాగాలని అనుకున్నాను. ఇక్కడ మీ అందరినీ చూసి నాకు గర్వంగా ఉంది. ఆస్ట్రేలియా అభివృద్ధికి పూర్తి శక్తితో తోడ్పడుతున్నారు. మనం భారతీయులం, పాలలో కరిగే చక్కెరలాంటి వాళ్లం. అది పాలను మరింత మధురంగా ??చేస్తుంది. మన ప్రేమ సారాన్ని ప్రపంచంలోకి నిరంతరం పంచుతూనే ఉంటాం. ఇంట్లో పాలు ఆస్ట్రేలియన్ కావచ్చు, కానీ తయారుచేసే టీ మాత్రం భారతీయమైనది. పప్పులు, కూరగాయలు ఆస్ట్రేలి యన్వే అయినప్పటికీ వాటికి అసలైన భారతీయ మసాలాలతో తాలింపు వేస్తాం" అని మోదీ పేర్కొన్నారు.

మెల్‌బోర్న్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భారతీయ స్ఫూర్తితో నిండిన అనేక ప్రదేశాలు, మార్కెట్లు ఉన్నాయని, కొందరు వాటిని 'లిటిల్ ఇండియా' అని పిలిస్తే, మరికొందరు 'మినీ ఇండియా' అని పిలుస్తారని మోదీ పేర్కొన్నారు. పేరు ఏదైనప్పటికీ, అవి భారతీయ సంస్కృతిలో పూర్తిగా అనుసంధానమై ఉంటాయని, అక్కడ అమ్మకాలు నిరంతరం జరుగుతూ ఉంటాయని చెప్పారు. అంతేకాదు, ఈ అమ్మకాల కొనుగోలు చేయడంలో ప్రజలు ఆసక్తి కనబరుస్తారని తెలిపారు. ఒకవేళ షాపింగ్ చేయాలనే మూడ్ లేకపోయినా, చివరికి ఏదో ఒకటి కొనేస్తారని చెప్పారు.

# హర్మ్యూజ్‌లో ఉద్రిక్తతలు ఉన్నా భారత్‌కు చమురు కొరత లేదు

పశ్చిమాసియాలోని హర్ముజ్ జలసంధి వద్ద కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లను ఆందోళనకు గురిచేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇలా ఉన్నా భారత్‌కు ముడి చమురు సరఫరాపై తక్షణ ప్రభావం ఉండే అవకాశం తక్కువగా ఉందని అంతర్జాతీయ ఇంధన మార్కెట్ విశ్లేషణ సంస్థ కెప్లర్ వెల్లడించింది. అయితే ఈ పరిస్థితులు ఎక్కువ కాలం కొనసాగితే మాత్రం ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ సరఫరాలు, రవాణా వ్యయాలు, బీమా ఖర్చులపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణపై తాజాగా చేసిన వ్యాఖ్యల అనంతరం పశ్చిమాసియాలో ఘర్షణలు చెలరేగాయి. దీంతో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే ఇంధన రవాణా మార్గమైన హర్ముజ్ జలసంధి భద్రతపై ఆందోళనలు పెరిగాయి. అయినప్పటికీ భారత్ గత కొన్నేళ్లుగా ముడి చమురు కొనుగోలు వనరుల్ని విస్తరించుకున్న క్రమంలో ప్రస్తుతం సరఫరాపై పెద్దగా ప్రభావం లేదని కెప్లర్ విశ్లేషకుడు సుమిత్ రిటోలియా తెలిపారు. భారత క్రూడాయిల్ దిగుమతులకు ఎలాంటి ఆటంకం లేదని, దేశీయ రిఫైనరీలకు చమురు సరఫరా యథాతథంగానే కొనసాగుతోందని అన్నారు.



**సగానికిపైగా క్రూడ్ రష్యా నుంచే**

సుమిత్ రిటోలియా వివరాల ప్రకారం- రష్యా ఇప్పటికీ భారత్‌కు అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా ఉంది. ఇదే సమయంలో సౌదీ అరేబియా, యూఏఈ నుంచి ప్రత్యామ్నాయ మౌలిక వసతుల ద్వారా చమురు సరఫరా కొనసాగుతోంది. ఇంకా పశ్చిమ ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల నుంచి కూడా దిగుమతులు పెరగడంతో భారత్ గతంలో మాదిరిగా ఒకే ప్రాంతంపై ఆధారపడే పరిస్థితి తగ్గింది. దీంతో సరఫరా వ్యవస్థ మరింత బలపడిందని ఆయన చెప్పారు. ఈ వ్యూహం ఫలితంగానే 2026 జూన్ నెలలో భారత్ రికార్డు స్థాయిలో రోజుకు సగటున 4.93 మిలియన్ బ్యారెళ్ల చొప్పున క్రూడాయిల్ దిగుమతి చేసుకుంది. దీంట్లో సుమారు 2.7 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు రష్యా నుంచే వచ్చింది. అంటే మొత్తం క్రూడ్ దిగుమతుల్లో దాదాపు సగానికిపైగా రష్యా వాటానే ఉండటం వల్ల, రష్యా భారత్‌కు ప్రధాన ఆయిల్ సరఫరాదారుగా తన స్థానాన్ని మరింత బలపర్చుకుంది.

హర్ముజ్ జలసంధి మీదుగా చమురు నౌకల రాకపోకలు ప్రస్తుతం కొనసాగుతున్నప్పటికీ, ఉద్రిక్తతలు కొనసాగితే మాత్రం భారత్‌పై ప్రభావం పడుతుందని కెప్లర్ అంచనా వేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే షిప్పింగ్ ఛార్జీలు, ఇన్సూరెన్స్ ప్రీమియాలు పెరిగే అవకాశం ఉందని స్పష్టం చేసింది. మరోవైపు అమెరికా ఆంక్షలు, వాణిజ్యపరమైన అనిశ్చితి కారణంగా సమీప భవిష్యత్తులో ఇరాన్ చమురు-భారత దిగుమతుల్లో కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపించడం లేదని పేర్కొంది. కెప్లర్ విశ్లేషణ ప్రకారం ప్రస్తుతం అసలు ఆందోళన ముడి చమురుపై కాకుండా ాచీ+, ాా+ పైనే ఉంది. ఈ ఇంధనాలకు తక్షణ ప్రత్యామ్నాయాలు తక్కువగా ఉండటంతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగితే సరఫరా తగ్గడం, రవాణా వ్యయాలు పెరగడం తద్వారా ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని హెచ్చరిక చేసింది.

**పెట్రోల్ ధర తగ్గించాలి- కేజ్రీవాల్ డిమాండ్**

ఇదిలా ఉండగా ఆమ్ ఆద్మీ పార్టీ (ూాూా) జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు తగ్గినా దేశంలో పెట్రోల్ ధరల్ని తగ్గించడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధరను రూ. 102 నుంచి రూ. 82 కు తగ్గించాలని, అదే విధంగా డీజిల్ ధరల్ని కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది మే నుంచి ఇవే ధరలు ఉన్నాయని, చమురు కంపెనీలు అక్రమ లాభాల్ని ఆర్జించకూడదని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గితే ద్రవ్యోల్బణం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఇంకా గతంలోనూ అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పలు మార్లు భారీగా తగ్గినా ఆ ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించలేదని కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆ లాభాల్ని ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు.

## పీవోకేలో తీవ్ర ఉద్రిక్తత..
## పాకిస్థాన్‌కు 48 గంటల అల్టిమేటం!



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. జమ్ము కశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) తమ 38 డిమాండ్లను నెరవేర్చాలంటూ ఇస్లామాబాద్ ప్రభుత్వానికి 48 గంటల గడువు విధిస్తూ అల్టిమేటం జారీ చేసింది. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే తీవ్రస్థాయిలో తుది దశ పోరాటం చేపడతామని హెచ్చరించింది. ఈ నెల 27న పీఓకేలో ప్రాంతీయ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్‌లో స్థిరపడిన కశ్మీరీ శరణార్థులకు కేటాయించిన 12 అసెంబ్లీ స్థానాలను రద్దు చేయాలనే నిర్ణయం తాజా ఆందోళనలకు ప్రధాన కారణమైంది. ఈ నిర్ణయం ద్వారా పాక్ కేంద్ర ప్రభుత్వం స్థానిక రాజకీయాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటోందని జేఏఏసీ ఆరోపిస్తోంది. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో, ముజఫరాబాద్‌కు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాలని కమిటీ పిలుపునిచ్చింది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పౌర సమాజం, వాణిజ్య, విద్యార్థి సంఘాలతో 2023లో ఏర్పాటైన జేఏఏసీ, పెరిగిన ధరలు, విద్యుత్ ఛార్జీలు, గోధుమ పిండిపై సబ్సిడీ వంటి డిమాండ్లతో ఈ ఏడాది మే నెలలో చేపట్టిన భారీ నిరసనలతో వెలుగులోకి వచ్చింది. మంగ్లా డ్యామ్ వంటి ప్రాజెక్టుల ద్వారా స్థానికంగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌పై తమకే హక్కులు కల్పించాలని, అలాగే రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులకు కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలను రద్దు చేయాలని కమిటీ డిమాండ్ చేస్తోంది. గత కొన్ని వారాలుగా పీఓకేలో బంద్‌లు, ధర్నాలతో నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతూ పలువురిని అరెస్ట్ చేసిందని జేఏఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఆహారం, మందుల కొరత ఏర్పడిందని, తక్షణమే మానవతా సాయం అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని 'ఆజాద్ కశ్మీర్' అని పిలుస్తున్నప్పటికీ, ఇక్కడి సహజ వనరులను వాడుకుంటూ తమను ఆర్థికంగా అణచివేస్తోందని స్థానికులు సుదీర్ఘ కాలంగా ఆరోపిస్తున్నారు. కాగా, జమ్ముకశ్మీర్ మొత్తం తమ అంతర్భాగమేనని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసిన విషయం విదితమే.

## ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు



ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ మరోసారి ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ ఆస్ట్రేలియాకు నిజమైన మిత్రుడని, తనకు ఎంతో ఆప్తుడని అన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో భారతీయులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భారతీయులు హాజరయ్యారు. ఎన్నో చారిత్రక కార్యక్రమాలకు ఈ స్టేడియం వేదికగా నిలిచిందని, కానీ భారతీయుల ఈ సమావేశం అత్యంత ప్రత్యేకమైందని ఆల్బనీస్ అన్నారు. ఈ సభలో కనిపిస్తున్న ఉత్సాహమే భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న బలమైన బంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానిగా తాను రెండుసార్లు భారత్‌లో పర్యటించే అవకాశం దక్కిందని ఆల్బనీస్ గుర్తు చేసుకున్నారు. భారతదేశ అందాలు, ప్రజల ఆతిథ్యం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. 2023లో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మోదీతో కలిసి రథంలో ప్రయాణించిన అనుభవాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. అప్పట్లో గుజరాత్‌లో చూసిన ఆప్యాయత, ఇప్పుడు ఈ సభలోనూ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. భారత సంతతి ప్రజలు ఆస్ట్రేలియా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆల్బనీస్ కొనియాడారు. ఆరోగ్యం, ఐటీ వంటి రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారని చెప్పారు. చిన్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు విద్యా రంగాన్ని కూడా బలోపేతం చేస్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ముందుగా స్పందించి సాయం చేసేది భారతీయులేనని వెల్లడించారు. భారతీయుల వల్ల ఆస్ట్రేలియా మరింత బలమైన, వైవిధ్యభరితమైన దేశంగా మారిందని ఆల్బనీస్ అన్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధాన్ని మరింత బలపరిచే సజీవ వారధి భారత సంతతి ప్రజలేనని కొనియాడారు.

## మూలికతో క్యాన్సర్‌కు చెక్
## జంతువులపై ప్రయోగాలు సక్సెస్

ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిని నయం చేసే సామర్థ్యం గంధమార్దన్? కొండల్లో లభించే ఒక అరుదైన మూలికకు ఉందని పరిశోధకులు గుర్తించారు. జంతువులపై నిర్వహించిన ప్రయోగాలు ఆశాజనక ఫలితాలు ఇస్తున్నాయని, త్వరలోనే మనుషులపై కూడా ప్రయోగాలు చేయడానికి సిద్ధమవుతున్నాయని వారు చెబుతున్నారు. సంబల్‌పూర్ విశ్వవిద్యాలయానికి చెందిన బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్? విభాగం దీనిపై పరిశోధనలు చేస్తోంది. గత 35 రోజులుగా జంతువులపై చేస్తున్న ప్రయోగాలు అత్యంత ఆశాజనకమైన ఫలితాలు ఇస్తున్నాయి. మరో 90 రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఇవి కనుక విజయవంతమైతే, దేశంలోని సీసీఆర్ఏఎస్ గుర్తింపు పొందిన ఆసుపత్రితో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకొని, ఈ ఔషధాన్ని మనుష్యులపై ప్రయోగించడానికి చర్యలు చేపడతారు. ఆ ప్రక్రియ మరో 9 నెలలపాటు కొనసాగుతుందని అధికారిక వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న క్యాన్సర్ చికిత్సలు చాలా ఖరీదైనవి. ఇవి సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. అందుకే సంబల్‌పూర్ విశ్వవిద్యాలయ పరిశోధకులు గత ఐదేళ్లుగా గంధమార్దన్? కొండల్లో లభించే కొన్ని విశిష్ట ఔషధ మొక్కలపై విస్తృతంగా అధ్యయనం చేశారు. చివరికి ఐదు ప్రధానమైన మూలికలను గుర్తించారు. బార్గఢ్ జిల్లా గంధమార్దన్ కొండల్లో నివసిస్తూ, సంప్రదాయ ఆయుర్వేద పద్ధతులు ఉపయోగించే కొందరు నాటు వైద్యుల సహాయంతో, సంబల్?పూర్? యూనివర్సిటీ బృందం పరిశోధనలు ప్రారంభించింది. నాటు వైద్యులు ఇచ్చిన సమాచారంతో ముందుగా 50 ఔషధ మొక్కలను గుర్తించారు. వాటిలో 5 ఔషధ మొక్కలకు క్యాన్సర్‌తో పోరాడే గుణాలు ఉన్నట్లు శాస్త్రీయంగా నిర్ధరించుకున్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137